గురువారం 6-6-2024

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 75

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'



ఆడుతూ పాడుతూ...

టి20 ప్రపంచకప్‌లో భారత్ శుభారంభం. ఐర్లాండ్‌పై 8 వికెట్లతో గెలుపు - 14లో



మళ్లీ మార్కెట్ పరుగు

2,303 పాయింట్ల ర్యాలీ మళ్లీ 74,300 దాటేసిన సెన్సెక్స్ - 15లో



కోర్టులో కేజ్రీవాల్‌కు చుక్కెదురు

మధ్యంతర బెయిల్‌ను అనారోగ్య కారణాల రీత్యా పొడిగించాలని కేజ్రీవాల్ చేసిన అభ్యర్థనను ఢిల్లీ సిటీ కోర్టు తోసిపుచ్చింది. - వివరాలు 6లో



9 మంది ట్రెక్కర్స్ దుర్మరణం

ఉత్తరాఖండ్‌లో పర్వతారోహణకు వెళ్లిన కర్ణాటకకు చెందిన తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. - వివరాలు 6లో



నవీన్ పట్నాయక్ రాజీనామా

ఒడిశాలో 24 ఏళ్లుగా అవిచ్ఛిన్నంగా సీఎం పదవిలో కొనసాగిన బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ బుధవారం రాజీనామా చేశారు. - వివరాలు 6లో



దేవేంద్ర ఫడ్నవీస్ రాజీనామా

మహారాష్ట్ర లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పేలవమైన పనితీరుకు బాధ్యత వహిస్తూ డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ రాజీనామా చేశారు. - వివరాలు 6లో

ఎన్డీఏ నేతగా మోదీ

ఏకగ్రీవంగా ఎన్నుకున్న నేతలు.. మోదీ సారథ్యంపై ప్రశంసలు

కూటమి తొలి భేటీలో తీర్మానం.. వీలైనంత త్వరగా ప్రభుత్వ ఏర్పాటు

నితీశ్ సహా 16 పార్టీల నేతలు హాజరు

రేపు ఎన్డీఏ ఎంపీల కీలక సమావేశం

మోదీని నాయకునిగా ఎన్నుకోనున్న ఎంపీలు.. అనంతరం రాష్ట్రపతికి మద్దతు లేఖల సమర్పణ

- బీజేపీ సారథ్యంలోని అధికార ఎన్డీఏ కూటమి నేతగా ప్రధాని నరేంద్ర మోదీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం వెలువడ్డ లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీఏ మెజారిటీ స్థానాలు సాధించడం తెలిసిందే. దాంతో మోదీ వరుసగా మూడోసారి ప్రధాని కానున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఢిల్లీలో ప్రధాని నివాసంలో ఎన్డీఏ కీలక సమావేశం జరిగింది. మోదీ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో బీజేపీతో పాటు ఎన్డీఏ పక్షాల అగ్ర నేతలంతా పాల్గొన్నారు. - 6లో



బుధవారం ఢిల్లీలోని ప్రధాని నివాసంలో జరిగిన ఎన్డీఏ సమావేశంలో కుమారస్వామి, అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, జేపీ నడ్డా, చంద్రబాబు, నితీశ్‌కుమార్, ఏక్‌నాథ్ షిండే, ప్రఫుల్‌పటేల్, పవన్ కల్యాణ్ తదితరులతో కలిసి విజయ సంకేతం చూపుతున్న ప్రధానమంత్రి మోదీ

8 లేదా 9న ప్రమాణ స్వీకారం

- మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్న మోదీ
- మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సమావేశం
- 17వ లోక్‌సభను రద్దు చేయాలని సిఫార్సు

6లో

ప్రభుత్వం ఏర్పాటు చేద్దాం రండి

- కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై విపక్ష ఇండియా కూటమి మల్లగుల్లాలు పడుతోంది. బుధవారం కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో కూటమి నేతల కీలక సమావేశం జరిగింది. ఇండియా కూటమిలో చేరాల్సిందిగా పార్టీలన్నింటినీ ఆహ్వానిస్తున్నట్టు ఖర్గే ఈ సందర్భంగా ప్రకటించారు.

- వివరాలు 6లో

కేంద్ర కేబినెట్‌లో ఇద్దరికి చాన్స్ ?

- కేంద్రంలో మూడోసారి కొలువుదీరనున్న ఎన్డీఏ ప్రభుత్వంలో ఈసారి తెలంగాణకు రెండు కేబినెట్ బెర్తులు దక్కే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. పార్టీలో సీనియారిటీ, విధేయత, కులాల సమీకరణలు దృష్టిలో పెట్టుకొని ఒక రెడ్డి, మరొక బీసీ సామాజికవర్గ నేతకు కేబినెట్‌లో చోటు కల్పించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

- వివరాలు 12లో

న్యూస్‌రీల్

ఎన్ని ప్రగల్భాలు పలికినా భంగపాటు తప్పలేదు



సీఎం రేవంత్ ఎన్ని ప్రగల్భాలు పలికినా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భంగపాటు తప్పలేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. రేవంత్ మల్కాజిగిరి తన సీటు అంటే.. ప్రజలు తమ తీర్పు ద్వారా స్పష్టమైన సమాధానం ఇచ్చారన్నారు. - 12లో

భూమి చుట్టూ 310 రౌండ్లు



రైల్వే ఆధునికీకరణలో భాగంగా కొత్తగా ప్రారంభించిన వందేభారత్ రైళ్లు సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. 2019 ఫిబ్రవరి 15న ప్రారంభమైన వందేభారత్ రైళ్లు ఇప్పటి వరకు తిరిగిన నిడివిని పరిశీలిస్తే.. 310 పర్యాయాలు భూపరిభ్రమణం చేసిన దూరంతో సమానమట. - 11లో

నేడు రాష్ట్రానికి జస్టిస్ పినాకి చంద్రఘోష్

కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయ విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ గురువారం హైదరాబాద్‌కు రానున్నారు. శుక్రవారం అన్నారం బ్యారేజీ, శనివారం సుందిళ్ల బ్యారేజీని సందర్శించి జరిగిన నష్టాన్ని పరిశీలించనున్నారు. - 5లో

బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి బదిలీ..



- అసెంబ్లీ ఎన్నికల్లో 37.5% ఓట్లు తెచ్చుకున్న బీఆర్ఎస్ ఇప్పుడు 16 శాతానికి పడిపోయింది
- 22 శాతం బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి బదిలీ చేశారు
- లోక్‌సభ ఫలితాలపై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

- బీజేపీని గెలిపించేందుకు బీఆర్ఎస్ నేతలు అవయవ దానం చేశారు
- బీజేపీ గెలిచిన 8 స్థానాల్లో బీఆర్ఎస్ ఏడు చోట్ల డిపాజిట్ కోల్పోయింది
- మా పాలనను మెచ్చుకున్న ప్రజలు ఓట్లు, సీట్లను పెంచి ఆశీర్వదించారు
- మేము, అభిమానులు ఆశించిన స్థాయిలో మాత్రం ఫలితాల్లేవు

సాక్షి, హైదరాబాద్: 'అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 37.5 శాతం ఓట్లు తెచ్చుకున్న బీఆర్ఎస్ ఇప్పుడు 16 శాతానికి పడిపోయింది. 22 శాతం బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి బదిలీ చేశారు. 2023 ఎన్నికల్లో 13 శాతం ఓట్లు వచ్చిన బీజేపీకి ఇప్పుడు 35 శాతం వచ్చాయి. సరిగ్గా బీజేపీకి పెరిగిన ఓట్ల శాతమే బీఆర్ఎస్‌కు తగ్గింది. కేసీఆర్, హరీశ్, కేటీఆర్‌లు కలిసి బీఆర్ఎస్ నేతల ఆత్మగౌరవాన్ని బీజేపీకి తాకట్టు పెట్టారు. తనంతట తాను అంతర్థానమై బీజేపీని గెలిపించే దురాగతానికి కేసీఆర్ పూనుకున్నాడు..' అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. బుధవారం జూబ్లీహిల్స్ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

బూడిదైన బీఆర్ఎస్ మళ్లీ పుట్టేది లేదు

'రాష్ట్రంలో కాంగ్రెస్‌తో పాటు బీజేపీకి కూడా ఓట్లు, సీట్లు పెరిగాయి. బీజేపీని గెలిపించేందుకు బీఆర్ఎస్ నేతలు ఆత్మ బలిదానం చేసుకుని, అవయవ దానం చేశారు. బీజేపీ గెలిచిన 8 లోక్‌సభ స్థానాల్లో బీఆర్ఎస్ ఏడు చోట్ల డిపాజిట్ కోల్పోయింది. సిద్దిపేటలో ఎప్పుడూ బీఆర్ఎస్‌కు భారీ మెజారిటీ వచ్చేది. కానీ ఈ పార్లమెంటు ఎన్నికల్లో హరీశ్‌రావు తన ఓట్లను బీజేపీకి బదిలీ మిగతా 12వ పేజీలో ▶

ఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి ఉత్సవాలు

మీడియాతో ఇష్టాగోష్టిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రారంభ వేడుకలకు సోనియాను ఆహ్వానిస్తామని వెల్లడి

12లో

నేడు 'దోస్త్' తొలి దశ సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి 'దోస్త్' ద్వారా దరఖాస్తు చేసిన విద్యార్థులకు గురు వారం తొలి దశ సీట్లు కేటా యిస్తారు. సాయంత్రం 3గంటలకు విద్యా ర్థులు ఏ కాలేజీలో, ఏ కోర్సులో సీటు వచ్చిందో ఆన్‌లైన్ ద్వారా చూసుకోవచ్చని ఉన్నత విద్యా మండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ తెలిపారు. దోస్త్‌లో ఇప్పటివరకూ 1.03 లక్షల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 85 వేల మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు.



వారంలో రాష్ట్రమంతా నైరుతి

ఇప్పటికే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తరణ

సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి. ఈనెల 3న రాష్ట్రంలోని ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు.. రెండ్రోజుల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కు విస్తరించినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం తెలంగాణ లోని నారాయణపేట, ఆంధ్రప్రదేశ్‌లోని నర్సాపూర్ గుండా రుతుపవనాలు కదులుతున్నట్లు చెప్పింది. 3 రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరిస్తాయని, కదలికలు ఇదే తరహాలో ఉంటే వారం రోజుల్లో రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రాంతాలకు వ్యాపిస్తాయని అంచనా వేస్తోంది. రుతుపవనాల రాకతో రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. పగటి పూట కొంతసేపు గరిష్ట ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నప్పటికీ.. ఆకాశం మేఘావృతం కావడంతో క్రమంగా ఉష్ణోగ్రతల తీవ్రత తగ్గుతూ వస్తోంది. సాయంత్రానికి పూర్తిగా చల్లని వాతావరణం ఏర్పడుతోంది. రెండు రోజులు రాష్ట్రంలో ఉష్ణో గ్రతలు సాధారణం, అంతకంటే తక్కువగా నమోదు కావొచ్చని ఆ శాఖ అంచనా వేసింది.

నిజామాబాద్‌లో గరిష్ట ఉష్ణోగ్రత: దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, ఉత్తర తమిళనాడు తీరం వద్ద పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం మిగతా 5వ పేజీలో ▶


3 లక్షల ర్యాంక్ వచ్చినా ఎంబీబీఎస్ సీటు!

ప్రైవేటు వైద్య కాలేజీల్లో కన్వీనర్ కోటా కింద వచ్చే చాన్స్

సాక్షి, హైదరాబాద్: నీట్ ఫలితాలు వెలువడిన నేపథ్యంలో మరో వారంలో రాష్ట్రస్థాయి ర్యాంకులనూ ప్రకటించే అవకాశముంది. ఈసారి అర్హత మార్కులు పెరగడంతో లక్షల్లో ర్యాంకులు వచ్చిన వారికీ కన్వీనర్ కోటాలో సీట్లు వస్తాయని నిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలో గతేడాది ఎన్ని ర్యాంకులు వచ్చిన వారికి కన్వీనర్ సీట్లు వచ్చాయన్న విషయమై విద్యార్థులు ఆరా తీస్తున్నారు. గతేడాది కన్వీనర్ కోటా కింద నీట్ జాతీయ స్థాయిలో 2.66 లక్షల ర్యాంకు వచ్చిన ఒక విద్యార్థికి సీటు లభించింది. మేడ్చల్‌లోని సీఎంఆర్ మెడికల్ కాలేజీలో బీసీ సీ కేటగిరీకి చెందిన ఒక విద్యార్థికి ఆ ర్యాంక్‌కు సీటు వచ్చింది. అలాగే 2.62 లక్షల ర్యాంకు పొందిన బీసీ సీ కేటగిరీకి చెందిన ఓ విద్యార్థికి సిద్దిపేటలోని సురభి మెడికల్ కాలేజీలో సీటువచ్చింది. సంగారెడ్డిలోని టీఆర్ఆర్ కాలేజీలో బీసీ సీ కేటగిరీకే చెందిన విద్యార్థికి 2.58 లక్షల ర్యాంక్ వచ్చినా మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి




VERITAS
SAINIK SCHOOL
Mettle over Matter
Overall Excellence Powered by SAINIK DISCIPLINE
NOW IN HYDERABAD
ADMISSION
OPEN
SAINIK DISCIPLINE WITH
INTERNATIONAL STANDARD EDUCATION
OUR WORLD CLASS INFRASTRUCTURE
SMART CLASS ROOMS
WORLD CLASS SWIMMING POOL
GROUP TASKS
LABORATORIES
BASKETBALL COURT
INDORE SHOOTING RANGE
BOYS & GIRLS
LKG TO GRADE VIII
(Day Boarding / Residential)
Sprawling Campus
across 12 acres
SCAN FOR
CAMPUS LIFE
Campus 1 - TIRUPATI
C.RAMAPURAM, TIRUPATI, AP. - 517 561
Campus 2 - HYDERABAD
NEAR RVM MEDICAL COLLEGE,
HYDERABAD, TELANGANA 502279
Ph : 8886679710 | 8886679711

క్లుప్తంగా...

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: సీతక్క



సాక్షి, హైదరాబాద్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందుకోసం పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలని పంచాయతీరాజ్, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీవించడానికి పర్యావరణం చాలా ముఖ్యమైనదని, గ్లోబల్ వార్మింగ్ ప్రభావాల నియంత్రణకోసం చర్యలు చేపట్టాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కోరారు. మానవాళి మనుగడకు, భవిష్యత్తు తరాలకు పర్యావరణం ప్రాథమిక అవసరం అని గుర్తు చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటి పచ్చదనాన్ని కాపాడాలని సూచించారు.

డా.శేషుమాధవ్‌కు ఫెలో పురస్కారం



పురస్కారం అందుకుంటున్న శేషుమాధవ్

సాక్షి, హైదరాబాద్: రాజమహేంద్రవరంలోని కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్ అనుబంధం) డైరెక్టర్‌గా పనిచేస్తున్న సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ మాగంటి శేషుమాధవ్‌కు న్యూఢిల్లీలోని జాతీయ వ్యవసాయ శాస్త్రాల అకాడమీ (ఎన్.ఎ.ఎ.ఎస్.) అందించే ప్రతిష్టాత్మక ఫెలో పురస్కారం లభించింది. ఎన్.ఎ.ఎ.ఎస్. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో అకాడమీ అధ్యక్షులు, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్ డా.హిమాంశు పాఠక్ చేతుల మీదుగా డా. శేషుమాధవ్ బుధవారం ఈ పురస్కారాన్ని అందుకున్నారు. వరంగల్ జిల్లా హనుమకొండకు చెందిన శేషుమాధవ్ గత మూడు దశాబ్దాలుగా వరి, పొగాకు తదితర పంటలపై విశేష పరిశోధనలు చేశారు. కాండం తొలిచే పురుగును తట్టుకునే జన్యువు కలిగిన వరి రకాన్ని గుర్తించి, జన్యుక్రమాన్ని ఆవిష్కరించటంలో ఆయన కీలకపాత్ర నిర్వహించారు. వరిలో అధిక దిగుబడినిచ్చే డీఆర్ఆర్ ధన్ 52,55,57,60,62, 63 వంగడాల రూపకల్పనలో ముఖ్యపాత్ర పోషించారు. పొగాకు పంటలో కేన్సర్ కారకాలను తగ్గించేందుకు పరిశోధనలు చేపట్టారు.



8 స్థానాల్లో బీఆర్‌ఎస్ డిపాజిట్లు గల్లంతు

ఒక స్థానంలో కాంగ్రెస్, రెండు స్థానాల్లో బీజేపీకి కూడా...

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 17 ఎంపీ సెగ్మెంట్‌లలో బీఆర్‌ఎస్ పోటీ చేయగా, 8 చోట్లలో ఆ పార్టీ అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి. ఆదిలాబాద్, నిజామాబాద్, జహీరాబాద్, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, హైదరాబాద్, చేవెళ్ల, మహబూబ్‌నగర్ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులకు డిపాజిట్ దక్కలేదు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రతి అభ్యర్థి నిర్దేశిత మొత్తంలో డిపాజిట్ చెల్లించాలి. పోలైన మొత్తం ఓట్లలో కనీసం ఆరోవంతు ఓట్లు సాధించిన అభ్యర్థులకు మాత్రమే ఎన్నికలు ముగిసిన తర్వాత డిపాజిట్లు తిరిగి చెల్లిస్తారు. నాన్ సీరియస్ అభ్యర్థులు ఎన్నికల్లో నామినేషన్లు వేయకుండా నిలువరించడానికి ఈ నిబంధనను అమలు చేస్తున్నారు. అయితే డిపాజిట్లు దక్కించుకోవడం రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు ప్రతిష్టాత్మకంగా మారింది. 14 లోక్‌సభ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు మూడో స్థానంలో నిలవగా, మరో రెండు నియోజకవర్గాల్లో రెండో స్థానంతో సరిపెట్టుకున్నారు. హైదరాబాద్ సెగ్మెంట్‌లో ఆ పార్టీ అభ్యర్థి నాలుగో స్థానంలో నిలిచారు.

- ఒక్క హైదరాబాద్ లోక్‌సభ స్థానంలోనే కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోయింది. ఆ పార్టీ అభ్యర్థి మూడో స్థానంలో నిలిచారు. ఓడిపోయిన ఇతర 8 స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు రెండోస్థానంలో నిలిచి డిపాజిట్లు దక్కించుకున్నారు.
- బీజేపీ అభ్యర్థులు మహబూబాబాద్, ఖమ్మం స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయి మూడో స్థానంలో నిలిచారు. ఆ పార్టీ ఓడిపోయిన మరో 7 స్థానాల్లో మాత్రం రెండోస్థానంలో నిలవడంతోపాటు డిపాజిట్లను సొంతం చేసుకుంది.

ఇక చదువుల సీజన్

జోరందుకున్న ఇంటర్ అడ్మిషన్లు
- డిగ్రీ ప్రవేశాలు... ఇంజనీరింగ్ హడావుడి
- 12 నుంచి స్కూల్స్ రీ ఓపెనింగ్
- టీచర్ల బదిలీలు, పదోన్నతులు మొదలు
- వర్సిటీల వీసీల నియామకంపై దృష్టి
- త్వరలో సెర్చ్ కమిటీ పరిశీలన
- ప్రైవేటు కాలేజీల్లో మొదలైన పాఠాలు



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల హడావుడి ముగియడంపై విద్యా రంగంపై అధికారులు దృష్టి పెట్టారు. ఈ నెల 12వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు రీ ఓపెనింగ్ అవుతున్నాయి. స్కూళ్లల్లో మౌలిక సమస్యల పరిష్కారం వైపు అడుగులు వేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు వెళ్ళాయి. ఇక ఇంటర్ బోర్డ్ ప్రవేశాల మొదలు, ఉన్నత విద్యా మండలి కార్యక్రమాలు, యూనివర్సిటీల ప్రక్షాళన వరకు అన్ని అంశాలపై దృష్టి పెట్టబోతున్నట్టు అధికారులు తెలిపారు. ప్రతీ అంశంపై ఇటీవల ఉన్నత స్థాయి సమీక్ష కూడా నిర్వహించారు. ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం దిశగా అడుగులు వేయాలని నిర్ణయించారు.

7 నుంచి బదిలీలు, పదోన్నతులు

ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల నుంచి డిమాండ్ పెరుగుతోంది. పార్లమెంట్ ఎన్నికల ముందు దీన్ని చేపట్టాలని భావించినా ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. గత ఏడాది కొంతమంది టీచర్లను బదిలీ చేశారు. కానీ ఇప్పటి వరకూ రిలీవ్ చేయలేదు. దాదాపు 50 వేల మంది టీచర్లు బదిలీ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. మరోవైపు 10 వేల మంది టీచర్ల వరకూ పదోన్నతులు పొందాల్సి ఉంది. ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్, ఎస్‌ఏ నుంచి హెచ్‌ఎం వరకూ ప్రమోషన్లు ఇవ్వడానికి సీనియారిటీ జాబితా కూడా రూపొందించారు. ఎన్నికల కోడ్ ముగియడంతో ఈ నెల 7వ తేదీ నుంచి ఈ ప్రక్రియ చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు.

ఊపందుకుంటున్న అడ్మిషన్లు

ఇంటర్ అడ్మిషన్లకు అనుగుణంగా ఇంటర్ కాలేజీలకు బోర్డ్ అనుబంధ గుర్తింపు ఇప్పటికే చాలావరకు పూర్తి చేసింది. ఇంకా 600 ప్రైవేటు కాలేజీలకు ఇవ్వాల్సి ఉంది. ఈ నెలాఖరు కల్లా అన్ని డాక్యుమెంట్లు ఇవ్వాలని అధికారులు ఆదేశించారు. మరోవైపు ప్రైవేటు కాలేజీల్లో పెద్ద ఎత్తున అడ్మిషన్లు జరుగుతున్నాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనూ ప్రవేశాలు ఊపందుకున్నాయి. గత ఏడాది 80 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ కాలేజీల్లో చేరారు. ఈ సంవత్సరం మరికొంత మంది చేరే వీలుంది. టెన్త్ ఉత్తీర్ణులకు అవసరమైన డిప్లొమా కోర్సుల కౌన్సెలింగ్ ప్రక్రియను జూన్ నుంచి మొదలు పెట్టే వీలుంది. డిగ్రీ ప్రవేశాలను వేగంగా చేపడుతున్నారు. తొలి దశ సీట్ల కేటాయింపు ఈ నెల 6వ తేదీన జరుగుతుంది. డిగ్రీలో ఏటా 2.20 లక్షల మంది చేరుతున్నారు.

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కూ చురుకుగా ఏర్పాట్లు

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఇప్పటికే ప్రకటించారు. ఈ నెలాఖరు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రక్రియ మొదలుపెడతారు. రాష్ట్రంలో 1.06 లక్షల ఇంజనీరింగ్ సీట్లున్నాయి. ఇందులో 80 వేల వరకూ కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు. ఈ ప్రక్రియ జూలై నెలాఖరుకు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమై ఉన్నారు.

వీసీల నియామకాలపై దృష్టి

రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాల్లో కొత్త వైస్ ఛాన్సలర్ల నియామకం కోసం చురుకుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పెద్ద ఎత్తున వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు ప్రభుత్వం సెర్చ్ కమిటీలను కూడా నియమించింది. మే నెలాఖరుతో వీసీల పదవీ కాలం ముగిసింది. వీరి స్థానంలో ఐఏఎస్‌లను ఇన్‌ఛార్జిలుగా నియమించారు. ఎన్నికల కోడ్ అడ్డంకిగా ఉండటంతో వీసీల నియామకం ఇంత కాలం చేపట్టలేదు. సెర్చ్ కమిటీ భేటీ అయిన, ఒక్కో వర్సిటీకి ముగ్గురు చొప్పున ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తుంది. ఇందులో ఒకరిని వీసీగా నియమిస్తారు. ఈ ప్రక్రియ మరో పది రోజుల్లో జరగొచ్చని అధికారులు చెబుతున్నారు.

టీఎస్ ఐసెట్ షురూ

- మొదటి సెషన్‌లో 89.81 శాతం..
- రెండో సెషన్‌లో 90.78 శాతం హాజరు



కేయూ క్యాంపస్: రాష్ట్రంలో ఏంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకుగాను టీఎస్ ఐసెట్‌ను బుధవారం రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి 116 కేంద్రాల్లో నిర్వహించారు. ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ పద్ధతిన జరిగిన ఈ ప్రవేశ పరీక్షకు నిమిషం నిబంధన ఉండడంతో అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి వరంగల్ కాకతీయ యూనివర్సిటీలోని టీఎస్ ఐసెట్ కార్యాలయంలో ఉదయం 8గంటలకే ప్రశ్నపత్రం సెట్‌ను డ్రా పద్ధతిలో ఎంపిక చేశారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12–30గంటల వరకు మొదటి సెషన్ ప్రవేశ పరీక్షను నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలోని111 పరీక్ష కేంద్రాల్లో 27,801మంది అభ్యర్థులకు గానూ 25,086 మంది హాజరు(90.2శాతం) కాగా, ఏపీలోని నాలుగు కేంద్రాల్లో 1,130మంది అభ్యర్థులకు గానూ 896మంది (79.3శాతం) హాజరయ్యారని టీఎస్ ఐసెట్ కన్వీనర్, కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంటు కళాశాల ప్రొఫెసర్ ఎస్.నర్సింహాచారి వెల్లడించారు. గురువారం జరిగే మొదటి సెషన్‌తో ఈ ప్రవేశ పరీక్ష ముగుస్తుందని నర్సింహాచారి తెలిపారు.

నేటి నుంచి బడిబాట



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 6వ తేదీ నుంచి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు సమగ్రశిక్ష విభాగం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమం ఈ నెల 19వ తేదీ వరకూ జరుగుతుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విద్యకు దూరంగా ఉన్న పిల్లలను గుర్తించి, వారికి అవగాహన కల్పించి బడుల్లో చేర్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. దీనిద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచాలన్నది లక్ష్యం. అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ల నేతృత్వంలో జరిగే బడిబాట కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, గ్రామాల్లో టీచర్లు ముఖ్యపాత్ర పోషిస్తారు.

'బీసీల సమగ్ర అభివృద్ధిపై బీజేపీ దృష్టి పెట్టాలి'



సాక్షి, హైదరాబాద్: మోదీ పాలనలో బీసీలను పూర్తిగా విస్మరించినందుకే దేశవ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేక ఫలితాలు వచ్చాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ వ్యాఖ్యానించారు. పదేళ్ల మోదీ పాలనలో బీసీలకు ఏమాత్రం లబ్ధి చేకూర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవడం, జాతి జనగణనలో సమగ్ర కులగణన చేయకపోవడం, సామాజిక రిజర్వేషన్లను 50 శాతానికి కుదించి బీసీ రిజర్వేషన్లను తగ్గించడం, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించకపోవడం తదితర కారణాలతో బీజేపీ పట్ల ఆగ్రహాన్ని ఓటు రూపంలో చూపించారని పేర్కొన్నారు. ఇప్పటికైనా బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు.

3 లక్షల ర్యాంక్ వచ్చినా ఎంబీబీఎస్ సీటు!

▶ మొదటి పేజీ తరువాయి

కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీటు లభించింది. ఈ వివరాలను కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు వెల్లడించాయి. ఇక ఓపెన్ కేటగిరీ లోకల్ కోటాలో వరంగల్‌లోని ఫాదర్ కొలంబో మెడికల్ కాలేజీలో 1.60 లక్షల ర్యాంకు సాధించిన విద్యార్థికి సీటు లభించింది. ఓపెన్ కేటగిరీలోని అన్ రిజర్వ్‌డ్ కోటాలో సంగారెడ్డిలోని ఎంఎన్‌ఆర్ మెడికల్ కాలేజీలో 58,727 ర్యాంకు సాధించిన విద్యార్థికి సీటు లభించింది.

పెరిగిన సీట్లతో ఈసారి విస్తృత అవకాశాలు...

రాష్ట్రంలో వైద్యవిద్య అవకాశాలు భారీగా పెరిగాయి. గతేడాది ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో సీట్లు పెరిగాయి. 2023–24 వైద్య విద్యాసంవత్సరంలో రాష్ట్రంలోని 56 మెడికల్ కాలేజీల్లో మొత్తం 8,490 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. 27 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 3,790 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా 29 ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 4,700 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ప్రభుత్వంలోని అన్ని సీట్లను, ప్రైవేటు కాలేజీల్లోని 50 శాతం సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు. అలాగే ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని సీట్లలో 15 శాతం సీట్లను అఖిల భారత కోటా కింద కేటాయిస్తారు. మరోవైపు ఈ ఏడాది కూడా మెడికల్ కాలేజీల సంఖ్య పెరుగుతోంది. 2024–25 విద్యాసంవత్సరంలో జోగులాంబ గద్వాల, నారాయణపేట, ములుగు, వరంగల్, మెదక్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లోనూ మెడికల్ కాలేజీలు రానున్నాయి. వాటికి సంబంధించి ఇంకా నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) నుంచి అనుమతి రావాల్సి ఉంది. ఈసారి ఆరు కాలేజీలకు అనుమతి వచ్చే అవకాశం ఉందని.. ఈ లెక్కన కనీసం 300 సీట్లు పెరుగుతాయని అధికార వర్గాలు అంటున్నాయి. అంటే ఆ మేరకు ఎంబీబీఎస్‌లో విద్యార్థుల చేరికలకు అవకాశాలు పెరగనున్నాయి.

15% ఉమ్మడి కోటా రద్దు కానుండటంతో..

తెలంగాణలోని అన్ని మెడికల్ కాలేజీల్లో ఏపీ విద్యార్థులు 15 శాతం కోటా కింద పదేళ్లపాటు సీట్లు పొందేందుకు వీలు కల్పించిన ఏపీ పునర్విభజన చట్టం -2014లోని నిబంధన గడువు ఈ నెల 2వ తేదీతో ముగిసింది. ఈ నిబంధన వల్ల 2014 నుంచి 2022 వరకు తెలంగాణలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 15 శాతం సీట్లను రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు ఉమ్మడి కోటా కింద వర్తింపజేశారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అందుబాటులోకి వచ్చిన కొత్త మెడికల్ కాలేజీల్లోనూ ఉమ్మడి కోటాను అమలు చేయడంపై విమర్శలు రావడంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిబంధనల్లో మార్పులు తెచ్చింది. అన్ని కొత్త కాలేజీల్లో ఉమ్మడి కోటాను రద్దు చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పడిన 5 ప్రభుత్వ, 15 ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోనే ఉమ్మడి కోటాను అమలు చేసింది. ఆయా కాలేజీల్లో 1,950 కన్వీనర్ కోటా సీట్లలో 15 శాతం అంటే 292 సీట్లను ఉమ్మడి కోటా కింద భర్తీ చేస్తున్నారు. అయితే అందులో 200కుపైగా సీట్లు ఏపీ విద్యార్థులకే దక్కుతున్నాయి. ఉమ్మడి కోటా రద్దు కానుండటంతో ఇకపై ఆ సీట్లన్నీ తెలంగాణ విద్యార్థులకే అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఇలా కూడా అదనంగా సీట్లు రాబోతున్నాయి. కాబట్టి ఈసారి 3 లక్షల ర్యాంక్ పొందిన విద్యార్థికి కూడా కన్వీనర్ కోటాలో సీటు లభిస్తుందని కాళోజీ నారాయణరావు వర్గాలు అంచనా వేస్తున్నాయి.

గతేడాది ఉస్మానియా, గాంధీ, కాకతీయల్లో ఏ ర్యాంక్‌కు సీట్లు వచ్చాయంటే?

- ఉస్మానియా మెడికల్ కాలేజీ ఓపెన్ కేటగిరీలోని లోకల్ కింద 19,239 ర్యాంకుకు, అన్ రిజర్వుడ్‌లో 7,943 ర్యాంకర్లకు సీట్లు లభించాయి. ఈడబ్ల్యూఎస్ కేటగిరీ వారికి 30,522 ర్యాంకు వరకు కూడా సీటు లభించింది. ఎస్సీ విద్యార్థులకు లోకల్ కేటగిరీలో 89,253 ర్యాంకు సాధించినా సీటు వచ్చింది. అన్‌రిజర్వ్‌డ్‌లో 48,358 ర్యాంకర్‌కు సీటు వచ్చింది. ఎస్టీ లోకల్ కేటగిరీలో 90,658 ర్యాంకర్‌కు, అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో 73,500 ర్యాంకు సాధించిన విద్యార్థికి సీటు వచ్చింది. బీసీ ఏలో లోకల్ కేటగిరీ కింద 79,611 ర్యాంకు, అన్‌రిజర్వ్‌డ్‌లో 42,349 ర్యాంకు వచ్చిన విద్యార్థులకు సీట్లు వచ్చాయి. బీసీ బీలో లోకల్‌కు 30,944... అన్ రిజర్వుడుకు 12,788 ర్యాంకర్లకు సీట్లు వచ్చాయి. బీసీ సీలో లోకల్‌కు 69,344... అన్ రిజర్వ్‌డ్‌లో 21,822 ర్యాంకర్లకు సీట్లు వచ్చాయి. బీసీ డీలో లోకల్‌కు 30,465... అన్ రిజర్వ్‌డ్‌లో 20,069 ర్యాంకర్లకు సీట్లు వచ్చాయి. బీసీ–ఈలో లోకల్‌కు 34,482... అన్ రిజర్వ్‌డ్‌లో 20,497 ర్యాంకర్లకు సీట్లు లభించాయి.
- గాంధీ మెడికల్ కాలేజీలో ఓపెన్ కోటాలో లోకల్ కేటగిరీ కింద 8,164 ర్యాంకుకు, అన్ రిజర్వ్‌డ్‌లో 3,225 ర్యాంకర్లకు సీట్లు లభించాయి. ఈడబ్ల్యూఎస్ కేటగిరీ వారికి 26,245 ర్యాంకుకు సీటు లభించింది. ఎస్సీ కోటాలో లోకల్ కేటగిరీ కింద 80,215 ర్యాంకు వచ్చిన విద్యార్థికి సీటు వచ్చింది. అన్ రిజర్వ్‌డ్‌లో 39,519 ర్యాంకర్‌కు సీటు వచ్చింది. ఎస్టీలో లోకల్‌కు 78,656... అన్ రిజర్వ్‌డ్‌కు 47,860 ర్యాంకుకు సీటు వచ్చింది. బీసీ–ఏ లోకల్ కేటగిరీలో 36,691 ర్యాంకుకు సీటురాగా బీసీ–బీలో లోకల్ కింద 15,625 ర్యాంకర్‌కు సీటు వచ్చింది. అలాగే బీసీ–సీలో లోకల్‌కు 55,674 ర్యాంకుకు సీటు లభించింది. బీసీ–డీలో లోకల్‌కు 14,598 ర్యాంకుకు... అన్ రిజర్వ్‌డ్‌లో 8,257 ర్యాంకుకు సీట్లు వచ్చాయి. బీసీ–ఈలో లోకల్‌కు 30,495... అన్ రిజర్వ్‌డ్‌లో 5,737 ర్యాంకర్లకు సీట్లు లభించాయి.
- వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో ఓపెన్‌లోని లోకల్ కేటగిరీలో 36,905 ర్యాంకుకు, అన్ రిజర్వ్‌డ్‌లో 25,305 ర్యాంకర్లకు సీట్లు లభించాయి. ఈడబ్ల్యూఎస్ కేటగిరీ వారికి 47,684 ర్యాంకుకు సీటు లభించింది. ఎస్సీల్లో లోకల్ కేటగిరీలో 1.14 లక్షల ర్యాంకుకు సీటు వచ్చింది. అన్ రిజర్వ్‌డ్‌లో 98,658 ర్యాంకుకు సీటు వచ్చింది. ఎస్టీ కోటాలో లోకల్ కింద 1.07 లక్షల ర్యాంకు వచ్చిన వారికి... అన్ రిజర్వ్‌డ్‌లో 95,831 ర్యాంకర్‌కు సీటు వచ్చింది. బీసీ–ఏ లోకల్ కేటగిరీలో 1.09 లక్షల ర్యాంకుకు... అన్ రిజర్వ్‌డ్‌లో 66,831 ర్యాంకులకు సీట్లు వచ్చాయి. బీసీ–బీలో లోకల్‌కు 43,616... అన్ రిజర్వ్‌డ్‌కు 37,381 ర్యాంకర్లకు సీట్లు వచ్చాయి. బీసీ–సీలో లోకల్‌కు 94,902 ర్యాంకర్‌కు సీటు వచ్చింది. బీసీ–డీలో లోకల్‌కు 42,838, బీసీ–ఈలో లోకల్ కోటా కింద 50,030 ర్యాంక్ పొందిన వారికి సీట్లు లభించాయి.

'ఆ కాంట్రాక్టు ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి'

సాక్షి, హైదరాబాద్: సమగ్ర శిక్షా ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించాలని తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుండిగల్ యాదగిరి డిమాండ్ చేశారు. 61 సంవత్సరాలు పూర్తి చేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగి వెంటనే పదవీ విరమణ పొందాలని స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడం బాధాకరమన్నారు. ఎలాంటి ప్రయోజనాలు కల్పించకుండా పదవీ విరమణ పొందితే వారి కుటుంబ పోషణ ప్రశ్నార్థకమవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు 20 వేల మంది ఈ ప్రాజెక్టులో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్నారని, పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించకుండా ఉన్నట్టుండి ఇంటికి వెళ్లిపోవాలని ఆదేశించడం సరైంది కాదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ ఉత్తర్వులను ఉపసంహరించుకోకపోతే ఉద్యమిస్తామని తెలిపారు.

విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయండి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



బుర్రా వెంకటేశంను కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ సత్యం తదితరులు

కాచిగూడ (హైదరాబాద్): ఉన్నత విద్యా వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్ది విద్యా వ్యవస్థను వెంటనే ప్రక్షాళన చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంక్షేమసంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, నీలం వెంకటేశ్, రాజ్‌కుమార్, నిరంజన్‌లతో కూడిన ప్రతినిధి బృందం రాష్ట్ర సచివాలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రావెంకటేశంను కలిసి బీసీ విద్యార్థుల సమస్యలపై చర్చించింది. ఈ సందర్భంగా బీసీ విద్యార్థుల డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ గత మూడు సంవత్స రాలుగా పెండింగ్‌లో ఉన్న రూ.7 కోట్ల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాలేజీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలన్నారు. బీసీ కాలేజీ హాస్టల్ విద్యార్థులకు పాకెట్ మనీ పెంచాలని కోరారు.

మనం బలహీనపడితే, స్వార్థపరులమవుతాం. మనం ఖాళీ అయినప్పుడే తీసుకుంటాం. కానీ మనం నిండుగా ఉంటే అందరికీ ఇచ్చేస్తాం. అదే మన స్వభావం.

– బ్రహ్మకుమారీలు

సాక్షి

గురువారం, 6 జూన్ 2024

సమస్యలపై 'సమష్టి' దృష్టి

అక్కున చేర్చుకున్నవారిని మెచ్చుకోవటం, అయిష్టత చూపినవారికి దూరం జరగటం సర్వసాధారణం. ప్రధాని మోదీ కూడా దానికి భిన్నంగా ఉండలేకపోయారు గనుకే మంగళవారం నాటి తన విజయోత్సవ ప్రసంగ ప్రారంభంలో ఎప్పటిలా 'జైశ్రీరాం' అనడానికి బదులు 'జై జగన్నాథ్' అని వుండొచ్చు. ఆశించిన సీట్లు ఇవ్వని ఉత్తరప్రదేశ్ ప్రస్తావన కన్నా ఆదరాభిమానాలు చూపి ఏకంగా 21 ఎంపీ స్థానాల్లో 20 కట్టబెట్టడంతో పాటు రాష్ట్ర పాలనాపగ్గాలను సైతం అందించిన ఒడిశా ప్రధానికి స్ఫురించటంలో వింతేముంది? ఈ ఎన్నికల్లో బీజేపీకి మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. అందువల్ల పదేళ్లనాడే 282 స్థానాలు, అటుపై 303 స్థానాలు గెలిచిన బీజేపీ ఈసారి 240తో సరిపెట్టుకోవాల్సివచ్చింది. ఇది సాధారణ మెజారిటీ కన్నా 32 తక్కువ. ఎన్డీఏ కూటమిగా ఇప్పటికీ 292 స్థానాలున్నా నితీశ్ కుమార్, చంద్రబాబు వంటి ఊగిసలాట మనస్తత్వం గల భాగస్వాములున్నచోట ఏదైనా జరగొచ్చన్న భయాందోళనలు బీజేపీకి ఉండటం సహజమే. అందులోనూ నితీశ్ ఎప్పటి నుంచో కోరుకుంటున్న ప్రత్యేక హోదా డిమాండ్ తెరపైకొచ్చినా ఆశ్చర్యం లేదు. బాబు చరిత్ర గమనిస్తే ఆయన హోదా కోసం పట్టుబట్టే అవకాశం అంతంత మాత్రమే. మొత్తానికి 'అబ్ కీ బార్ మోదీ సర్కార్' అన్న నినాదాన్ని సవరించుకుని 'అబ్ కీ బార్ కూటమి సర్కార్' అనక తప్పట్లేదు.

సంప్రదాయానికి భిన్నంగా తక్కువ స్థానాలిచ్చిన ఉత్తరాదితో పోలిస్తే... సగానికిపైగా స్థానాలిచ్చిన తూర్పు జోన్, ఆశించినదానికి మించి ఇచ్చిన దక్షిణాది బీజేపీకి భుజాలు కాశాయి. పశ్చిమ జోన్‌లోని మహారాష్ట్రలో ఫిరాయింపులను ప్రోత్సహించి రెండు ప్రధాన పార్టీల్లో చీలిక తెచ్చిన పర్యవసానంగా ఎన్డీఏ దెబ్బతింది. సగం స్థానాలు కూడా సాధించలేకపోయింది. అసెంబ్లీ ఎన్నికలు తరుముకొస్తున్న వేళ ఇది బీజేపీని వణికిస్తోంది. మహారాష్ట్రలో 2019లో శివసేనతో పొత్తు పెట్టుకుని అక్కడున్న 48 స్థానాల్లో బీజేపీ సొంతంగా 23, కూటమిగా 41 గెల్చుకుంది. ఈసారి 28 చోట్ల పోటీ చేస్తే అందులో సగం కూడా దక్కలేదు. బీజేపీ 9తో సరిపెట్టుకోగా... దాని మిత్రపక్షాల్లో ఒకటైన శివసేన (షిందే) వర్గం పోటీచేసిన 15లో ఆరు, ఎన్సీపీ(అజిత్) పోటీచేసిన అయిదింటిలో రెండు గెల్చుకున్నాయి. ఈసారి కనీసం 45 రాబట్టాలన్న ఆశ కొట్టుకుపోయింది. ఈ జోన్‌లోని గుజరాత్‌లో ఎన్డీఏకు 25 లభించినా చాన్నాళ్ల తర్వాత ఒకస్థానం విపక్షాలకు దక్కటం అది జీర్ణించుకోలేని అంశం. ఇక రాజస్తాన్‌లోవున్న మొత్తం 25 స్థానాలూ గతంలో ఎన్డీఏ గెల్చుకోగా ఈసారి 14తో సరిపెట్టుకుంది. ఇండియాకు 11 దక్కాయి. పశ్చిమజోన్‌లో మొత్తం 103 స్థానాలుంటే ఎన్డీయేకు 59, ఇండియాకి 42 వచ్చాయి. ఉత్తరాదిన ఏడు రాష్ట్రాలతోపాటు కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూ-కశ్మీర్, ఢిల్లీ, చండీగఢ్, లద్దాఖ్‌లున్నాయి. ఈ ప్రాంతంలో మొత్తంగా 195 స్థానాలుండగా ఎన్డీయేకు 117 దక్కాయి. అంకె ఘనంగానే కనబడుతున్నా ఇండియా కూటమి 71 స్థానాలు ఎగరేసుకుపోవటం అసాధారణం. ఇక్కడి యూపీ, పంజాబ్, హరియాణా, బిహార్, మధ్యప్రదేశ్, హిమాచల్, ఉత్తరాఖండ్‌లలో ఇండియా కూటమి పక్షాలకు పెద్దగా రాకపోవచ్చని బీజేపీ అంచనా వేసుకుంది. కానీ ఉత్తరప్రదేశ్‌లోని 80 స్థానాల్లో 2019లో 62 గెల్చుకున్న ఎన్డీఏకు ఈసారి కేవలం 36 వస్తే, విపక్ష కూటమి 43 గెల్చుకుంది. పైగా ఆ కూటమిలోని సమాజ్‌వాదీ 33 సాధించి బలం పుంజుకుంది. ఇక బిహార్‌లో 40 స్థానాలకూ ఎన్డీయే 30 గెల్చుకుంది. తొమ్మిది విపక్ష కూటమికి వచ్చాయి. కానీ రైతు ఉద్యమ ప్రభావంగల హరియాణాలోని 10 స్థానాల్లో అయిదు స్థానాలే లభించాయి. ఇండియా కూటమికి మరో అయిదు వచ్చాయి. పంజాబ్‌లోని 13 స్థానాల్లో బీజేపీకి ఒక్కటంటే ఒక్కటి రాలేదు. ఇండియా కూటమికి 10 లభించాయి. గతంలోని వోటింగ్ శాతం గల్లంతైనా ఢిల్లీ మాత్రం మాట దక్కించింది. అక్కడి ఏడు స్థానాలూ బీజేపీ ఖాతాలో పడ్డాయి. కేజ్రీవాల్ అరెస్టు ప్రభావం ఏమాత్రం లేదు. మధ్యప్రదేశ్ (29), హిమాచల్ (4), ఉత్తరాఖండ్ (5) గంపగుత్తగా ఎన్డీఏ వైపే మొగ్గాయి. ఇక దక్షిణాదిలో నిరుడు ఎన్నికల్లో అసెంబ్లీని చేజార్చుకున్న కర్ణాటకలో ఎన్డీఏకు 19 సీట్లు రావటం, 'ఇండియా' కేవలం 9కి పరిమితం కావటం బీజేపీకి ఊరటనిచ్చింది. అలాగే ఏపీలో ఎన్డీఏకు 21, తెలంగాణలో 8, కేరళలో ఒకటి లభించటం అంచనాకు మించినవే. దక్షిణాదిన గల 131 స్థానాల్లో 'ఇండియా' కూటమికి లభించిన 77తో పోలిస్తే ఎన్డీయేకు వచ్చిన 49 తక్కువే కావొచ్చుగానీ... ఇప్పుడున్న పరిస్థితుల్లో అదే ఎక్కువ. 114 స్థానాలున్న తూర్పు జోన్‌లో ఎన్డీయేకు 67 లభించాయి. ఇందులో ఒడిశా గురించి ప్రత్యేకించి చెప్పుకోవాలి. 24 ఏళ్లపాటు ఆ రాష్ట్రాన్ని పాలించి సిల్వర్ జూబ్లీలోకి అడుగుపెడదామనుకున్న బిజూ జనతాదళ్ అధినేత, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను నిరోధించి అధికారం దక్కించుకోవటంతోపాటు ఒకటి మినహా ఎంపీ స్థానాలన్నీ బీజేపీ గెల్చుకుంది. ఇదే జోన్‌లోని బెంగాల్ కేవలం 12 ఎంపీ స్థానాలకే బీజేపీని పరిమితం చేయటం గమనించదగ్గది.

మొత్తానికి ఉత్తరాదిలో భావోద్వేగాల కన్నా నిరుద్యోగం, అధిక ధరలు, పడిపోయిన జీవనప్రమాణాలు వగైరా అంశాలు చర్చలోకొచ్చాయి. వోటింగ్‌లోనూ వాటి ప్రభావం కనబడింది. ఇది మెచ్చదగ్గ విషయం. వచ్చే ఏడాది రాబోయే 16 ఫైనాన్స్ కమిషన్ నివేదిక, ఆ మరుసటేడు లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, ఫెడరల్ వ్యవస్థపై సాగే చర్చ కీలకమైనవి. ఈ అంశాల విషయంలో ఏకపక్ష నిర్ణయాలకు బదులు అందరినీ సంప్రదించక తప్పని స్థితి ఏర్పడటం హర్షించదగింది. దేశ ప్రజానీకం ప్రదర్శించిన విజ్ఞతనూ, దానివెనకున్న స్ఫూర్తినీ రాజకీయ పక్షాలన్నీ గ్రహిస్తే జటిల సమస్యల పరిష్కారం కష్టం కాదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** అమావాస్య సా.5.49 వరకు, తదుపరి జ్యేష్ఠ, శుద్ధ పాడ్యమి, **నక్షత్రం:** రోహిణి రా.8.25 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** ప.12.38 నుండి 2.11 వరకు, తదుపరి రా.2.00 నుండి, 3.35 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.48 నుండి 10.40 వరకు, తదుపరి ప.3.01 నుండి 3.53 వరకు, **అమృతఘడియలు:** సా.5.27 నుండి 6.18 వరకు.

సూర్యోదయం : 5.28
సూర్యాస్తమయం: 6.28
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సంకీర్ణంతో సామరస్యం నెలకొనేనా?

అభిప్రాయం

ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

'ఇండియా' కూటమి కుల జనగణనను అంగీకరిస్తూ, బీజేపీ 400 సీట్లతో గెలిచి ఏకంగా రాజ్యాంగాన్ని మార్చెయ్యాలని చూస్తున్నదనీ, మొత్తం రిజర్వేషన్లను రద్దు చెయ్యాలనుకుంటోందనీ పెద్దఎత్తున ప్రచారం చేసింది. ఇది కచ్చితంగా ఓటర్ల మీద ప్రభావాన్ని చూపించింది. దాంతో ఫలితాలు బీజేపీని సంకీర్ణంలోకి నెట్టాయి. మోదీ సంకీర్ణ ప్రభుత్వాన్ని వారి సిద్ధాంతంతోనైనా వాజ్‌పేయిలా నడిపే వ్యక్తి కాదు. మోదీని ముస్లిం దేశాలు బద్ధశత్రువుగా చూసే అవకాశముంది. ఆరెస్సెస్/బీజేపీ ఆయనను కాక మరో వ్యక్తిని ప్రధానిగా ప్రతిపాదించి కాస్త సామరస్య వాతావరణంలో దేశాన్ని నడవనిచ్చే అవకాశమున్నది. కానీ మోదీ తప్పుకొనే అవకాశం కనబడటం లేదు. అందుకు ప్రత్యర్థి కూటమి ప్రత్యామ్నాయంగా బలపడటం తప్ప మార్గం లేదు.

2024 ఎన్నికలు దేశ చరిత్రలో చాలా విచిత్రమైనవి. దేశస్థాయిలో మోదీ నాయకత్వంలోని బీజేపీని సంకీర్ణంలోకి నెట్టాయి. ఆంధ్రప్రదేశ్, ఒరిస్సాల్లో పరిపాలిస్తున్న రెండు పార్టీలూ ఓడిపోయాయి. ముఖ్యంగా వైసీపీ ఓటమి చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. అయితే దేశం ఒక పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డ ఎన్నిక కూడా ఇది. బీజేపీ 240కి పడిపోవడం ఒక రక్షణ కవచం.

ఈ ఎన్నికతో చాలా ఘోరంగా పతనమైపోతుందనుకున్న కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు దేశాన్ని ఒక పెద్ద ప్రమాదం నుంచి కాపాడాయి. ఉత్తరప్రదేశ్‌లో బుల్‌డోజర్ వ్యవస్థకు చెక్ పడింది. మొత్తం బీజేపీ శక్తులు 'పప్పు, పప్పు' అని ఎద్దేవా చేసిన రాహుల్ గాంధీ... ఒక దళిత మల్లికార్జున్ ఖర్గే నేతృత్వంలో ఎవరూ ఊహించనట్టు మ్యానిఫెస్టోను దేశం ముందు పెట్టి మోదీ, అమిత్‌షాల 400 సీట్లు తెస్తారన్న బీజేపీని 240 సీట్లకు పడేసి దేశాన్ని చాలా పెద్ద ప్రమాదం నుంచి కాపాడారు.

'ఇండియా' కూటమి కాంగ్రెస్ మ్యానిఫెస్టోను సొంతం చేసుకొని దేశమంతటా ప్రచారం చేసింది. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ఈ ఎన్నికల 'హీరో' అన్నారు. 'ఇండియా' కూటమి కుల జనగణనను అంగీకరిస్తూ, బీజేపీ 400 సీట్లతో గెలిచి ఏకంగా రాజ్యాంగాన్ని మార్చెయ్యాలని చూస్తున్నదనీ, మొత్తం రిజర్వేషన్లను రద్దు చెయ్యాలనుకుంటోందనీ పెద్దఎత్తున ప్రచారం చేసింది. ఈ ప్రచారం కచ్చితంగా చాలామంది ఓటర్ల మీద ప్రభావాన్ని చూపించింది. నరేంద్ర మోదీ దీన్ని తట్టుకోవడానికి ముస్లింల రిజర్వేషన్లు ఎత్తేసి బీసీలకు ఇస్తామని పదేపదే మాట్లాడారు. కానీ చంద్రబాబు, నితీష్ కుమార్ వంటివారు దాన్ని అంగీకరించలేదు. ఇప్పుడు ఈ ఇద్దరు లేకుండా బీజేపీ ప్రభుత్వం నిలబడదు. అయితే అటు నితీష్ గానీ, ఇటు చంద్రబాబు గానీ మోదీకి మంచి మిత్రులు కారు. ఇద్దరూ మోదీని, షాని వ్యతిరేకించి శత్రుస్థానంలో పెట్టి, వారితో పోరాడిన వాళ్లే. అయితే ఆ ఇద్దరు ఇప్పుడు 'ఇండియా' కూటమి దేశానికి, రాజ్యాంగానికి ప్రమాదకరమైనదని ప్రచారం చేస్తున్న మోదీని ప్రధానమంత్రిని, షాను మళ్లీ హోంమంత్రిని చేసి దేశ అభద్రతకు బాధ్యులవుతారా? లేక బీజేపీలోని మరో వ్యక్తిని ప్రధానమంత్రిని చెయ్యమని సలహా ఇస్తారా? చూడాలి.

మోదీ ప్రభుత్వం చంద్రబాబుకు దూరమైన గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు ఎన్నో తీవ్ర నష్టాలను చేసింది. ఆంధ్ర పెట్టుబడిదారులనెవ్వరినీ నిర్మాణం రంగంలో గానీ, పెద్ద బిజినెస్‌లలో గానీ నిలువనివ్వలేదు. బ్యాంకుల విలీనం చేసినప్పుడు బరోడా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్ వంటి వాటిని ఆ పేర్లతోనే ఉంచి ఆంధ్రా బ్యాంక్‌ను మాత్రం యూనియన్ బ్యాంక్‌లో విలీనం చేశారు. మొదటి నుండి ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదాకు వ్యతిరేకంగా ఉన్నారు. ఈ



అన్నింటి రీత్యా ఇప్పుడు చంద్రబాబుపై ఆధారపడే కేంద్ర ప్రభుత్వానికి బాబు ఎటువంటి కండిషన్లు పెడతారు?

అటు కాంగ్రెస్‌తో 2019లో తెలంగాణలో పొత్తులో పోటీ చేసింది టీడీపీ. కాంగ్రెస్ తమ ప్రభుత్వం వస్తే ప్రత్యేక హోదా తప్పకుండా ఇస్తామంటోంది. చంద్రబాబు, నితీష్‌కుమార్ ఒక నిర్ణయం తీసుకుంటే, మోదీ, అమిత్ షాలను ఇంటికి పంపగలరు. అయితే చంద్రబాబుకు ఇప్పుడున్న స్థితిలో అది చిన్న నిర్ణయం కాదు. మోదీ సంకీర్ణ ప్రభుత్వాన్ని వారి సిద్ధాంతంతోనైనా వాజ్‌పేయిలా నడిపే వ్యక్తి కాదు. ఎన్నికల ప్రచారంలో ఆయన దేశంలోని మొత్తం ముస్లింల మీద అక్కసు కక్కారు.

గుజరాత్‌లోని 2002 మత కల్లోలం తరువాత జరిగిన ఈ ముస్లింల వ్యతిరేక ప్రచారం ఆయన్ని ఇంకా పెద్ద ముస్లిం వ్యతిరేకిగా నిలబెడుతుంది. ప్రపంచ పత్రికలన్నీ ఆయన్ని 'గ్రేట్ డివైడర్' అని రాశాయి. ముస్లిం దేశాలు ఈ ఎన్నికల తరువాత ఆయన్ని బద్ధశత్రువుగా చూసే అవకాశముంది. ఆరెస్సెస్/బీజేపీ ఆయన్ని కాక మరో వ్యక్తిని ప్రధానిగా ప్రతిపాదించి కాస్త సామరస్య వాతావరణంలో దేశాన్ని నడవనిచ్చే అవకాశమున్నది. కానీ ఆరెస్సెస్/బీజేపీ క్యాడర్ మోదీ, అమిత్ షాల పరిపాలనలో సుఖాలను అనుభవించడం నేర్చుకున్నారు. వారికి ఈ భోగం మరో నాయకుల నేతృత్వంలో దొరకదు. అందువల్ల ఆరెస్సెస్‌లో కూడా వారు చెప్పిందే నడుస్తుంది.

గుజరాత్ పెట్టుబడి దేశాన్ని మొత్తం తన గుత్తాధిపత్యంలోకి తీసుకుంది. ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న ఏ రాష్ట్రం నుండి కూడా గుజరాత్ పెట్టుబడిదారులకు ధీటుగా పోటీపడే పరిస్థితి లేదు. తెలుగు రాష్ట్రాల నుండి నిర్మాణ రంగంలో గుజరాతీ పెట్టుబడిదారులకు ధీటుగా ఎదిగిన జీవీకే కంపెనీని బొంబాయి ఎయిర్‌పోర్ట్ నుండి తప్పించి మోదీ, షాలు అదానీకి అప్పజెప్పారు. తమకు ఎదురు తిరిగిన రాజకీయ నాయకులపై సీబీఐ, ఈడీలను ప్రయోగించి జైలుపాలు చేశారు. ఈ పరిస్థితి నుండి దేశం బయట పడాలంటే మోదీ, షాలు అధికారం నుండి పోవడమొక్కటే మార్గం. అందుకు ప్రత్యర్థి కూటమి ప్రత్యామ్నాయంగా బలపడటం తప్ప మరో మార్గం లేదు. అందుకు 'ఇండియా' కాస్త దారి చూపింది. ఈ స్థితిలో 'ఏ కూటమితోనూ ఉండను' లాంటి నిర్ణయాలు నష్టం చేస్తాయి. ఎప్పుడైనా ప్రాంతీయ పార్టీలు జాతీయ స్థాయి వ్యవస్థల్ని శాసించలేవు. నిజానికి, ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేనతో – బీజేపీ చేరి ఎన్నికల కమిషన్‌ను అటు తిప్పింది అనేది స్పష్టంగా కనిపిస్తోంది. కీలక స్థలాల్లో వైసీపీ కీళ్ల విరిచే ప్రయత్నం చేసింది.

రాహుల్ గాంధీ దేశంలో అన్ని సభల్లో ఎన్నికల సంఘం నిష్పక్షపాత్రను ప్రశ్నిస్తూ వచ్చారు. సీబీఐ, ఈడీ, ఎలెక్టోరల్ బాండ్స్, ఇతర పార్టీల ఆదాయాలను అడ్డుకోవడం, ఉన్న పార్టీ డబ్బును ఎన్నికల్లో వాడకుండా చూడటం, ఇన్‌కమ్‌టాక్స్ వంటి సంస్థల ద్వారా బంధించడం... ఈ స్థితిలో అన్ని ప్రాంతీయ పార్టీలు తమ ఉనికిని కాపాడుకోవాలంటే ఒక జాతీయ కూటమిలో చేరి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడే నిర్ణయాల్లో, పోరాటాల్లో భాగం కాకపోతే ముందు ముందు బీజేపీ ప్రాంతీయ పార్టీలను తమ బందీలను చేస్తుంది.

కాంగ్రెస్ ముఖ్యంగా రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ యాత్ర తరువాత ఆరెస్సెస్/బీజేపీలను నిలువరించే ప్రయత్నం చేశారు. దేశంలోని ప్రాంతీయ పార్టీలు డీఎంకే లాగ ఒక ప్రత్యామ్నాయ తాత్విక పునాదితో నిర్మించినవి కావు. అందుకే డీఎంకేని బీజేపీ సనాతన ధర్మం చుట్టూ రాద్ధాంతం చేసి ఓడించాలని చూసింది. కానీ దాని ద్రావిడ, శూద్ర సిద్ధాంతరంగం కాపాడింది. బీజేపీ అక్కడ ఒక్క సీటు కూడా గెలవలేదు.

ఇప్పుడు పార్లమెంట్ పోరాటం... రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రిజర్వేషన్లను కాపాడాలనే 'ఇండియా' కూటమికీ, ఆరెస్సెస్ సిద్ధాంతాన్ని దేశంలో నాటి, మత సమస్యను ముందు పెట్టి దేశంలో ఉత్పత్తి కులాలను అణగదొక్కే ఎన్డీఏలోని ఆధిపత్య బీజేపీకీ మధ్య జరుగుతుంది.

ఎన్డీయే కూటమిలోని నితీష్ కుమార్, చంద్రబాబుకు బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక నిర్ణయాలకు చెక్ పెట్టే అవకాశమొచ్చింది. ఈ ఇద్దరు నాయకులు ఏం చేస్తారనేది చూడాలి. చంద్రబాబు 2002లో మోదీని ముఖ్యమంత్రి పదవి నుండి దింపే స్థితిలో ఉండి కూడా ఆయన్ని కొనసాగించే బీజేపీ నిర్ణయానికి మద్దతిచ్చారు. మళ్లీ ఈ కీలకదశలో ఆయనకు ఒక అవకాశమొచ్చింది. 'ఇండియా' కూటమి దేశంలోని మొత్తం ప్రతిపక్ష పార్టీలను తమ పక్కన చేర్చుకోవాల్సిన అవసరముంది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎన్నికల చిత్రం



గెలిచినవాళ్ల కంటే (బీజేపీ) ఓడిపోయిన వాళ్లు (ఇండియా కూటమి) ఎక్కువ సంతోషంగా ఉన్నట్లు కనబడిన ఎన్నికలను మీరు చివరిసారి ఎప్పుడు చూశారు?

– సదానంద్ ధూమే, కాలమిస్ట్

స్నేహం పెరగాలి!



మూడోసారి విజయం సాధించిన ప్రధాని నరేంద్ర మోదీకి నా హృదయపూర్వక శుభాభినందనలు. ఇండియా, ఇజ్రాయెల్ దేశాల స్నేహం కొత్త ఎత్తులకు చేరుకోవాలి. 'బధాయీ హో' (కంగ్రాట్స్)!

– బెంజమిన్ నెతన్యాహూ, ఇజ్రాయెల్ ప్రధాని

మరిచిపోలేని తేదీ



నిరంకుశత్వం ఎలా ఉంటుందో ఆచరణలో చూశారా? తియనాన్మెన్ స్క్వేర్ ఊచకోత జరిగి 35 ఏళ్లు అవుతున్న సందర్భంగా, కళాకారుడు సన్ను చెన్ '8964' అంకెలను గాలిలో రాశాడని హాంకాంగ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ అంకెలను రాస్తున్నట్టుగా వేలు ఆడిస్తుండగా అరెస్టయ్యారు. (అది జరిగిన 1989 జూన్ 4ను ఆయన సంకేతించారు.)

– డ్రూ పావ్‌లో, యాక్టివిస్ట్

సహకరించుకుందాం!



నూతన ఎన్నికల విజయం పట్ల నరేంద్ర మోదీకి శుభాభినందనలు. ఇటలీ, ఇండియాలను ఏకం చేసే స్నేహాన్ని బలోపేతం చేసేలా మనం కలిసి పనిచేద్దాం. మన దేశాలు, మన ప్రజల సంక్షేమం కోసం మనల్ని కలిపే విభిన్న అంశాలపై సహకారాన్ని పెంపొందించుకుందాం.

– జార్జియో మెలోనీ, ఇటలీ ప్రధాని

మర్యాద రాముడు



అక్కడ జరిగినదానికి హిందువులనో, అయోధ్య జనాన్నో నిందించొద్దు. దానిక్కారణం రామ్ లల్లా. భయోత్పాతాన్ని పుట్టించడానికి తన పేరును వాడటానికి ఆయన ఇష్టపడలేదు. 'జై శ్రీ రామ్' అనేది భయపెట్టే ఒక యుద్ధ నినాదంలా మారిపోయింది. రాముడు నిలబడింది దీనికి కాదు. 'జై శ్రీ రామ్' అని గౌరవంగా చెప్పండి. (అయోధ్య భాగంగా ఉన్న ఫైజాబాద్‌లో బీజేపీ అభ్యర్థి ఓడిపోయారు.)

– అంబ్రీన్ జైదీ, రచయిత్రి

ఎందుకలా అన్నారు?



సంకీర్ణ ప్రభుత్వం నడపడం తనకేమీ కష్టం కాదనీ, ఇప్పుడు నడుపుతున్నది కూడా సంకీర్ణమేననీ రాజీనామా చేయడానికి ముందు ప్రధాని మోదీ తన మంత్రివర్గ సహచరులతో జరిగిన సమావేశంలో వ్యాఖ్యానించినట్టు నా సోర్సులు తెలిపాయి. అసలు తన సహచరులకు ఆయన ఆ విధంగా పునర్నిర్ధారించాల్సిన అవసరం ఏముందన్నదే ఇక్కడ ప్రశ్న

– మనీష్ చిబ్బర్, జర్నలిస్ట్

చెప్పుకోవాల్సిన విజయం



పార్లమెంటులో అత్యంత పిన్న వయస్కురాలు ఇద్దరు పిల్లలకు తల్లి అయిన ఒక దళిత మహిళ. ఇది చాలా స్థాయిల్లో సాధించిన విజయం. (రాజస్థాన్‌లోని భరత్‌పూర్ నియోజకవర్గం నుంచి 25 ఏళ్ల సంజనా జాటవ్ కాంగ్రెస్ నుంచి గెలుపొందారు.)

– అర్పితా ఛటర్జీ, సినిమా రచయిత్రి

ఇన్ బాక్స్

సోషల్ మీడియా దన్నుగా...

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామిక దేశంలో జరిగిన ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో అని ప్రపంచం మొత్తం ఎదురు చూసింది. 18వ లోక్ సభకు జరిగిన ఈ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 64.2 కోట్ల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొని చరిత్ర సృష్టించారు. సుదీర్ఘంగా 81 రోజులు సాగిన ఈ ఎన్నికల ప్రక్రియ, కేంద్రంలో మళ్లీ కమల వికాసమా లేక హస్త ప్రభంజనమా అనే ఉత్కంఠకు తెర లేపింది. భారత ప్రజల చైతన్యస్ఫూర్తి ఈ ఎన్నికల్లో మరోసారి రుజువయ్యింది.

'అబ్ కీ బార్ చార్ సౌ పార్' అనే నినాదంతో మూడోసారి అత్యధిక మెజార్టీతో అధికారంలోకి రావాలనుకున్న ఎన్డీఏ కూటమికి ఈ ఎన్నికల్లో వారు ఊహించిన ఫలితాలు రాలేదు. గత పదేండ్ల కాలంలో మోదీ నేతృత్వంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరుగుదల వంటి అంశాలు ప్రజల్లో ఆ పార్టీపై నమ్మకం తగ్గేలా చేశాయి. కుల మతాలనూ, అయోధ్య రాముణ్ణీ ఎన్నికల్లో వాడుకొని లబ్ధి పొందాలని భావించినా ఆశించిన స్థాయిలో లబ్ధి చేకూరలేదు.

ప్రతిపక్ష 'ఇండియా' కూటమి మోదీ ప్రభుత్వ వ్యతిరేక ప్రజా ఉద్యమం నడపడంలో కొంత వరకు సఫలం అయిందని చెప్పవచ్చు. 'మోదీ 3.0 మళ్ళీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మారుస్తారు' అనే అంశం ప్రజల్లోకి బాగా వెళ్ళి, బీజేపీ ఓటు బ్యాంక్‌కు గండి కొట్టింది. ఓటర్లు ప్రతిపక్షానికి కావలసినంత బలాన్ని ఇచ్చారు. విధానపరమైన నిర్ణయాలలో అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది.

ఈ సారి ఎన్నికల్లో సోషల్ మీడియా ప్రభావం... ముఖ్యంగా యూట్యూబర్లు ధ్రువ్ రాఠీ, రవీష్ కుమార్ వంటి వారు మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరచడంలో కీలకమైన పాత్ర పోషించారు. కేవలం ధ్రువ్ వీడియోలను 69 కోట్ల మంది ప్రజలు వీక్షించారంటే వారి ప్రభావాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. ఉత్తర భారత దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రొజెక్టర్లు పెట్టి మరీ ఈ వీడియోలను ప్రజలు వీక్షించారు. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగే విధంగా పాలకులు నిర్ణయాలు తీసుకుని, ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందిస్తూ నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ, కార్మిక– కర్షక సంక్షేమానికి పాటుపడుతూ, మహిళా సాధికారత సాధిస్తూ, భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి కృషి చేస్తారని ఆశిద్దాం.

– పాకాల శంకర్ గౌడ్, ఉపాధ్యాయుడు

కాంగ్రెస్ ఆలోచనా విధానం మారాలి!

అభిప్రాయం

ఉల్లి బాల రంగయ్య

పాకిస్తాన్ వద్ద అణు బాంబు ఉందనీ, ఆ దేశాన్ని సరిగా గౌరవించకపోతే, మన దేశం పైన అణు బాంబులు వేసి, మనకు నష్టాన్ని కలిగిస్తుందనీ కొంతమంది కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు ప్రపంచ రాజకీయ విశ్లేషకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. ఈ విషయంపై కాంగ్రెస్ అధిష్టానం స్పష్టత ఇవ్వకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది. ఈ దేశం నాది అని భావించే ప్రజా సమూహానికి, జాతి హితైషులకు మాత్రం వారి వ్యాఖ్యలు కోపాన్నీ, చిరాకునూ తెప్పించాయి. అయినప్పటికీ ఏమీ చేయలేని పరిస్థితి. కాంగ్రెస్ నాయకుల మైండ్ సెట్ ఇంతేనని ప్రజలు సరిపెట్టుకుంటున్నారు. 1947లో ఈ దేశాన్ని మతం ఆధారంగా విడగొట్టి ముస్లిం లీగ్ నాయకులను సంతృప్తి పరిచారు. భారత్‌ను సెక్యులర్ దేశం అంటూ 1947 నుంచి దాదాపు 60 సంవత్సరాలు పాలించారు. వారి పరిపాలన కాలంలో పాకిస్తాన్‌తో 1948, 1965, 1971ల్లో మన సైన్యం యుద్ధం చేయవలసి వచ్చింది. ఈ యుద్ధాల్లో అపారమైన రక్షణ వ్యయాన్ని దేశం భరించవలసి వచ్చింది.



పాకిస్తాన్‌ను ఎందుకు గౌరవించాలి అనే విషయాన్ని కాంగ్రెస్ నాయకులు ఈ దేశ ప్రజలకు స్పష్టంగా చెప్పలేక పోతున్నారు. దేశంలో ముస్లింలను ప్రత్యేక పౌరులుగా ట్రీట్ చేశారు. దేశంలో సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రేరేపించినందుకేనా? లేక ఈ దేశంలో తిండి తింటూ, 'పాకిస్తాన్ జిందాబాద్' అని నినాదాలు చేసే దేశద్రోహులను ఈ దేశానికి ఎగుమతి చేసినందుకా? లేక పాకిస్తాన్ పై ప్రేమ వలకబోస్తే– ఈ దేశంలోని ముస్లిం సమాజం గంపగుత్తగా ఓట్లు వేసి, తమకు అధికారాన్ని కట్టబెడుతుందని ఆశతోనా? ఏమో మరి! వారి ఆలోచనలు ఈ దేశ సామాన్య ప్రజలకు అర్థం కావడం లేదు.

స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ పార్టీ పరిపాలన విధానాన్ని విశ్లేషిస్తే –ఇస్లాం మత అనుకూల పరిపాలనను సాగించిందని చెబితే అవాస్తవికత ఏమీ ఉండదు. షాబానో కేసు విషయంలో సుప్రీంకోర్టు తీర్పును కాలరాచి, ముస్లిం స్త్రీల హక్కులను బొంద పెట్టి, ఇస్లామిక్ మత అనుకూల చట్టాన్ని కాంగ్రెస్ నాయకులు చేశారు. ప్రపంచంలో ఏ సెక్యులర్ దేశం లేక ఇస్లామిక్ దేశం హజ్ యాత్రకు సబ్సిడీలను ఇవ్వదు. కానీ కాంగ్రెస్ పాలకులు ఆ ఘనకార్యాన్ని సాధించారు. రాష్ట్రపతి భవన్‌ను ఇఫ్తార్ విందులకు కేంద్రంగా మార్చారు.

ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ఆలోచనా విధానం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటుంది. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రేరేపించే పాకిస్తాన్ పీచ మణచాలనీ, రక్షణ పరంగా, ఆర్థికపరంగా, దౌత్య పరంగా దెబ్బతీసి, చచ్చిన పాముగా మార్చాలని బీజేపీ వ్యూహం. ఈ దేశ భద్రత, సమైక్యత, సమగ్రతల విషయంలో బీజేపీ నాయకుల ఆలోచనా విధానం స్పష్టంగా ఉంటుంది. కుహనా లౌకికవాద ఆలోచనలకు, ముస్లిం సంతుష్టీకరణలకు వారు చాలా దూరం. అందుకే లౌకికవాద ముసుగు వేసుకున్న హిందూ రాజకీయ నాయకులు బీజేపీ ప్రభుత్వాన్ని తిట్టకుండా ఉండలేరు.

ఇక చివరగా ఈ దేశ ఉత్థాన పతనాలలో భాగస్వామిగా మారిన కాంగ్రెస్ పార్టీ ఒక స్పష్టమైన జాతీయ విధానంతో ముందుకు వెళ్లకపోతే– ఆ పార్టీ నాయకులకు భవిష్యత్తు అంధకారంగానే ఉంటుందని చెప్పక తప్పదు. వాస్తవం మాట్లాడితే, ఈ దేశం పట్ల ఆ పార్టీ నాయకులు చేసిన పొరపాట్లే (కుహనా లౌకికవాద ఆలోచనలు) భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏని అందలమెక్కించాయని చెబితే అతిశయోక్తి ఏమీ ఉండదు.

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

దైవానుభవానికి మార్గం

దత్తబోధ

శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

దైవత్వం ఒక అనుభవం. దీనిని హృదయంలో ప్రతిబింబింప జేసుకోవాలి. అద్దం కదులుతూ ఉన్నా లేదా దానిని పొగ కప్పివేసినా లేదా వస్తువుల నుండి చాలా దూరంగా ఉన్నా... అద్దం దేనినీ సరిగా ప్రతిబింబింప చేయలేదు. మనస్సు (అద్దం) నిశ్చలంగా (కదలకుండా) ఉండడమే ఏకాగ్రత. అద్దాన్ని కప్పి ఉంచే పొగ (అహం)ను తొలగించాలి. అదే 'దైవ సాక్షాత్కారం'. జ్ఞానానికి రెండు స్థాయులు ఉన్నాయి. ఒకటి కిందిస్థాయి, మరొకటి పైస్థాయి. ఇంద్రియాలను ఉపయోగించుకొని, హేతుబద్ధంగా విచారించి తెలుసుకొనేది కిందిస్థాయి జ్ఞానం. చాలామంది కిందిస్థాయి జ్ఞానంతోనే జీవితాన్ని గడుపుతున్నారు. దైవానికి సంబంధించిన జ్ఞానమే పైస్థాయికి చెందింది. ఇది సాధారణమైన జ్ఞానాన్ని మించింది. అంటే సర్వోత్కృష్టమైనదన్నమాట. కొద్దిమంది భాగ్యవంతులు మాత్రమే ఇటువంటి జ్ఞానాన్ని పొందటానికి ప్రయత్నిస్తారు. ఈ విధమైన జ్ఞానాన్ని సద్గురువు మాత్రమే అనుగ్రహిస్తారు.

మానవ జన్మ ఉన్నత లక్ష్యం భగవంతునిలో ఐక్యం చెందటమే. మనిషి తన జన్మకు కారణం ఏమిటో మరచిపోయి 'కామ– కర్మ– అవిద్య' అనే చక్రంలో చిక్కుకున్నాడు. స్వార్థబుద్ధిని పోనీయక, సొంతలాభం కోసం ఇతరులకు నష్టం చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నాడు. అలాంటి వారికి ఎన్నటికీ విమోచన ఉండదు. కాబట్టి ఆత్మ వివేక మార్గంలో నడచి, భగవంతుడు వరప్రసాదంగా ఇచ్చిన ఈ జన్మను సార్థకం చేసుకోవాలి. ఇతరుల దోషాలనూ, తన చుట్టూ గల వాతావరణంలోని లోపాలను ఎంచుట మనిషికి గల సాధారణ లక్షణం. ఈ విధంగా తప్పులను ఎంచుటం వలన ఏ ప్రయోజనమూ లేదు. వాస్తవంగా ఈ లక్షణం మనిషి మానసిక ప్రశాంతతను భంగపరుస్తుంది. ఇందువలన సమతాస్థితిని పొందలేడు.

ఆధ్యాత్మిక మార్గం అనుసరించదలచిన భక్తుడు చిత్తశుద్ధిని పెంపొందించుకోవాలి. ఆ విధంగా ఉన్నప్పుడు మాత్రమే ఆధ్యాత్మిక జీవితం సాధ్యమవుతుంది. ఇతరుల దోషాలను ఎంచటం మానివేసి, ఎవరికి వారు తమను తాము సరిచేసుకొని అభివృద్ధి అవ్వడానికి ప్రయత్నించాలి.

నేడు రాష్ట్రానికి జస్టిస్ పినాకి చంద్రఘోష్

- రేపు, ఎల్లుండి అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిశీలన
- నేడు కడెం, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లకు మంత్రి ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయ విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ గురువారం హైదరాబాద్‌కు రానున్నారు. శుక్రవారం అన్నారం బ్యారేజీ, శనివారం సుందిళ్ల బ్యారేజీని సందర్శించి జరిగిన నష్టాన్ని పరిశీలించనున్నారు. ఈ నెల 10లోగా బ్యారేజీలకు అత్యవసర మరమ్మతులు పూర్తి చేయాలని గతంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో బ్యారేజీల మరమ్మతుల్లో పురోగతిని సైతం జస్టిస్ చంద్రఘోష్ పరిశీలించనున్నారు. జస్టిస్ చంద్రఘోష్ కమిషన్‌కు సహకరించేందుకు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఇప్పటికే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించింది. ఇలావుండగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి గురువారం కడెం ప్రాజెక్టుతో పాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను సందర్శించి వాటికి నిర్వహిస్తున్న అత్యవసర మరమ్మతులను పరిశీలించనున్నారు. గతేడాది వరదల్లో దెబ్బతిన్న కడెం ప్రాజెక్టు పునరుద్ధరణకు ప్రభుత్వం రూ.3.81 కోట్లను కేటాయించగా పనులు జరుగుతున్నాయి. ప్రాజెక్టు గేట్లను మాన్యువల్ విధానంలో కాకుండా ఆటోమేటిక్‌గా ఎత్తాలని నిర్ణయించిన ప్రభుత్వం, ఆ మేరకు గేట్ల ఆధునీకరణ పనులు చేయిస్తోంది.

నేడు మేడిగడ్డ రెండు గేట్ల ఎత్తివేత

మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో మొరాయిస్తున్న 16, 17వ నంబర్ గేట్లను గురువారం బలప్రయోగంతో పైకి ఎత్తనున్నారు. బ్యారేజీలో మొత్తం 8 బ్లాకులు, 85 గేట్లు ఉన్నాయి. గతేడాది అక్టోబర్ 21న ఏడో బ్లాకు కుంగిన వెంటనే 77 గేట్లను ఎత్తి, బ్యారేజీలో నిల్వ చేసిన నీటినంతా దిగువకు విడుదల చేశారు. బ్యారేజీ పియర్లకు నిట్టనిలువునా పగుళ్లు రావడంతో 7వ బ్లాకులోని 15–22 నంబర్ గేట్లు ఎత్తడం సాధ్యం కాలేదు. కాళేశ్వరం బ్యారేజీల్లోని లోపాలపై అధ్యయనం జరిపి పరిష్కార చర్యలను సిఫారసు చేయడానికి కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఇటీవల మధ్యంతర నివేదిక సమర్పించింది. వానకాలానికి ముందు నిర్వహించాల్సిన అత్యవసర మరమ్మతులు, చర్యలను సిఫారసు చేసింది. అలాగే మేడిగడ్డ బ్యారేజీలో మొరాయించిన అన్ని గేట్లను వర్షాకాలానికి ముందే పైకి ఎత్తాలని సూచించింది. ఈ నెల 17న 15వ నంబర్ గేటును విజయవంతంగా పైకి ఎత్తారు. 16వ నంబర్ గేటును ఎత్తడానికి ప్రయత్నించగా శబ్దాలు, ప్రకంపనలు రావడంతో ఆగిపోయారు. తాజాగా గురువారం 16వ నంబర్ గేటుతో పాటు 17వ నంబర్ గేటును కూడా బలప్రయోగంతో ఎత్తడానికి ఏర్పాట్లు చేశారు. ఈఎన్‌సీ (జనరల్) గుమ్మడి అనిల్ కుమార్ పర్యవేక్షణలో ఈ పనులు జరగనున్నాయి. మంత్రి ఉత్తమ్ మేడిగడ్డ సందర్శనకు రానుండడంతో ఆయన అక్కడే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు.

మొదటి రౌండ్‌లో కాంగ్రెస్‌కు ఆధిక్యం

వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు బుధవారం ప్రారంభం కాగా మొదటి రౌండ్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 36,210 ఓట్లు లభించాయి. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి 28,540 ఓట్లు లభించాయి. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి 11,395 ఓట్లు లభించాయి. మొదటి రౌండ్ ముగిసేసరికి తీన్మార్ మల్లన్న 7,670 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. బుధవారం ఉదయం 8 గంటలకు స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి బ్యాలెట్ బాక్సులను తీసుకొచ్చి 4 హాళ్లలో ఏర్పాటు చేసిన 96 టేబుళ్లపై ఉంచి 25 బ్యాలెట్ పేపర్లను ఒక బండిల్‌గా కట్టే ప్రక్రియను మొదట ప్రారంభించారు. ఆ ప్రక్రియ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. 5 గంటలకు మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది.

4 రౌండ్ల తర్వాత మొదటి ప్రాధాన్యత ఫలితం

పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 4,63,839 ఓట్లుండగా 3,36,013 ఓట్లు పోలయ్యాయి. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. నాలుగు రౌండ్లలో ఈ లెక్కింపు పూర్తవుతుంది. నాలుగు హాళ్లలో ఏర్పాటు చేసిన 96 టేబుళ్లలో ఒక టేబుల్‌కు ఒక రౌండ్‌లో వెయ్యి ఓట్లు లెక్కిస్తున్నారు. అంటే ప్రతి రౌండ్‌లో 96 వేల చొప్పున 4వ రౌండ్‌లలో మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు చేపడతారు.

మొదటి రౌండ్‌కు ఆరు గంటల సమయం

మొదటి రౌండ్ ఓట్ల లెక్కింపునకు దాదాపు 7 గంటలకు పైగా సమయం పట్టింది. మొదటి రౌండ్‌లో 96,097 ఓట్లకుగాను 88,369 ఓట్లు చెల్లుబాటు అయ్యాయి. మొదటి రౌండ్‌లోనే 7,728 ఓట్లు చెల్లలేదు. దీంతో మిగతా మూడు రౌండ్లలో చెల్లని ఓట్లు ఎన్ని ఉంటాయోనన్న చర్చ జరుగుతోంది. మిగతా మూడు రౌండ్ల ఓట్ల లెక్కింపు గురువారం మధ్యాహ్నం 12 గంటల వరకు పూర్తయ్యే అవకాశముంది. ఓట్ల లెక్కింపు సమయంలోనే ఆయా అభ్యర్థులకు బ్యాలెట్ పేపర్లు చూపి ఏ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేశారో చూపించి, ఆ అభ్యర్థి డబ్బాలో వేస్తున్నారు. ఒక వేళ ఏదేని ఓటు చెల్లకపోతే అది ఏజెంట్లకు చూపి చెల్లని ఓట్ల డబ్బాలో వేస్తున్నారు. ఇలా ప్రతి రౌండ్‌లోనూ కౌంటింగ్ సందర్భంగా చెల్లిన, చెల్లని ఓట్లు లెక్కిస్తున్నారు.

పూర్తయిన మొదటి రౌండ్ కౌంటింగ్

బుధవారం అర్ధరాత్రి 12:45 గంటలకు మొదటి ప్రాధాన్యత ఓట్ల మొదటి రౌండ్ లెక్కింపు పూర్తయ్యింది. అయితే మిగతా మూడు రౌండ్లకు అంత సమయం పట్టదని, వాటికి తక్కువ సమయమే పడుతుందని అధికారులు చెబుతున్నారు. మొత్తానికి నాలుగు రౌండ్లలో జరిగే మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు గురువారం ఉదయం 11 గంటల వరకు పూర్తయ్యే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు.

కోడలి హత్య కేసులో అత్తకు రెండు జీవిత ఖైదులు

ఖలీల్‌వాడి: కట్నం కోసం కొడుకుతో కలిసి కుట్రపన్ని కోడలి కిరాతకంగా హతమార్చిన చేసిన కేసులో బానోత్ పద్మ అనే దోషికి రెండు జీవిత కారాగార శిక్షలు విధిస్తూ నిజామాబాద్ జిల్లా, సెషన్స్ జడ్జి సునీత కుంచాల బుధవారం సంచలన తీర్పు వెలువరించారు. ప్రధాన ముద్దాయి బానోత్ రామ్‌సింగ్ కోర్టు వాయిదాకు గైర్హాజరవడంతో అతనిపై బెయిల్‌కు వీల్లేని అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. ముద్దాయి కోర్టుకు హాజరయ్యాక శిక్ష ఖరారు చేయనున్నట్లు తీర్పులో పేర్కొన్నారు.

ప్రేమించి పెళ్లి చేసుకుని...

నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం శివ తండాకు చెందిన బానోత్ రామ్‌సింగ్... ఏపీలోని ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలానికి చెందిన యెండల రాధ సికింద్రాబాద్‌లోని కళామందిర్ షోరూంలో కలిసి పనిచేసేవారు. దీంతో వారి మధ్య ప్రేమ చిగురించి 2020 జనవరి 30న నవీపేట్‌లోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. రాధ తల్లిదండ్రులు పేదలు కావడంతో పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇవ్వలేదు. అయితే పెళ్లియిన కొన్ని రోజులకే కట్నం కోసం రాధకు వేధింపులు మొదలయ్యాయి. రూ. లక్ష నగదుతోపాటు బంగారాన్ని తల్లిదండ్రుల నుంచి తేవాలని భర్త, అత్త పద్మ ఆమెను చిత్రహింసలకు గురిచేశారు. అదే సమయంలో రాష్ట్రంలో కరోనా లాక్‌డౌన్ విధించడంతో రామ్‌సింగ్ ఉద్యోగం కోల్పోయాడు. మరో పెళ్లి చేసుకుంటే ఆర్థికంగా కలిసొస్తుందని భావించాడు. ఇందుకు అడ్డంకిగా ఉన్న భార్యను చంపాలని తల్లితో కలిసి కుట్రపన్నాడు.

బైక్‌పై తీసుకెళ్లి..

చుట్టాల ఇంటికి వెళ్దామని రాధను నమ్మించిన రామ్‌సింగ్, పద్మ ఆమెను బైక్‌పై తీసుకెళ్లారు. దగ్గర దారిలో వెళ్దామంటూ రాధను మాక్లూర్ మండలం రాంచంద్రాపల్లి అటవీ ప్రాంతంలోని బాసం లొద్ది గుట్టపైకి తీసుకెళ్లారు. ముందు నడుస్తున్న రాధపై వెంట తెచ్చుకున్న పెట్రోల్, కిరోసిన్‌ను అత్త పోసింది. వెంటనే రామ్‌సింగ్ అగ్గిపుల్ల గీసి నిప్పంటించడంతో మంటలకు తాళలేక రాధ విలవిల్లాడింది. అయినా ఆమె బ్రతికి ఉండటంతో బండ రాళ్లతో తలపై కొట్టి తీవ్రంగా గాయపర్చారు. కొన ఊపిరితో ఉన్న ఆమెను ఒక గుంతలో పడేసి సజీవదహనం చేశారు. ఈ కేసును ఛేదించిన అప్పటి నిజామాబాద్ సౌత్ సీఐ శ్రీనాథ్ రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్ కుమార్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా విచారణ చేపట్టిన జడ్జి తాజాగా ముద్దాయి పద్మకు జైలుశిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. వరకట్న వేధింపులు, హత్య చేసినందుకు ఒక జీవితఖైదు విధించడంతో పాటు కుట్ర కేసులో మరో జీవిత ఖైదు, సాక్ష్యాధారాలను మాయం చేసిన నేరానికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రధాన ముద్దాయిపైనా నేరారోపణలు రుజువు అయినట్లు నిర్ధారించారు. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిరాజ్ వాదనలు వినిపించారు.

వర్షం పడుతుందని చెట్ల కిందకు వెళ్లి..

- పిడుగులు పడి వేర్వేరు చోట్ల ముగ్గురి మృత్యువాత



గంగనర్సయ్య



సంతోష్ కుమార్(ఫైల్)

మేడిపల్లి/గుండాల /షాబాద్: వివిధ ప్రాంతాల్లో బుధవారం పిడుగులు పడి ముగ్గురు మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు.

- జగిత్యాల జిల్లా భీమారం మండలం వెంకట్రావు పేటకు చెందిన రైతు కొంక గంగనర్సయ్య(46) పొలంలో జీలుగ విత్తనాలు చల్లుతున్న క్రమంలో ఒక్కసారిగా వర్షంతోపాటు పిడుగు పడడంతో కిందపడిపోయాడు. తోటి రైతులు గమనించి అతడిని జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం సీతానగర్‌లో గ్రామానికి చెందిన మేకల సంతోష్ కుమార్(12), గొగ్గెల శివకుమార్, గొగ్గెల శివ, గొగ్గెల రంజిత్ కలిసి సాయంత్రం ఆడుకునేందుకు ఊరు చివరకు వెళ్లారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడటంతో పక్కనే ఉన్న చెట్టుకిందకు వెళ్లారు. ఆ సమయంలో చెట్టుపై పిడుగు పడడంతో సంతోష్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. శివకుమార్, శివకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆళ్లపల్లి పీహెచ్‌సీకి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా సంతోష్‌కుమార్ తండ్రి ఏడాది క్రితమే మృతి చెందాడు.
- రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం గుండాలకు చెందిన బేగరి వెంకటయ్య, నర్సింహులు పని నిమిత్తం షాద్‌నగర్ వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తూ మార్గమధ్యలో షాబాద్ మండలం సంకెపల్లిగూడలోని భారత్‌గ్యాస్ కంపెనీ సమీపంలో మద్యం తాగుతూ చెట్టు కింద కూర్చున్నారు. అంతలోనే ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలైంది. దీంతోవారు అక్కడి నుంచి లేస్తుండగానే భారీశబ్దంతో పిడుగు పడింది. దీంతో వెంకటయ్య అక్కడికక్కడే మృతి చెందగా, నర్సింహులు గాయపడ్డాడు.

వీధికుక్కల దాడిలో బాలుడు మృతి

- ఆరేళ్ల బాలుడిని కొరికి చంపి..
- మియాపూర్‌లో డంపింగ్ యార్డు వద్ద దారుణం



సాత్విక్ (ఫైల్)

మియాపూర్: వీధి కుక్కల దాడిలో ఓ బాలుడు మృతి చెందిన దారుణ ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. మియాపూర్ మక్తమహబూబ్‌పేట గ్రామానికి చెందిన బోసాల వీరేశం, శిరీష దంపతుల కుమారుడు సాత్విక్(6) స్థానిక స్కూల్లో ఒకటో తరగతి చదువుతున్నాడు. తల్లి నాలుగేళ్ల కిందట కరోనాతో మృతి చెందడంతో కూలి పనులు చేసే తండ్రి, స్థానిక గుడి వద్ద యాచకురాలిగా జీవనం సాగిస్తున్న నాన్నమ్మ దేవమ్మ వద్ద ఉంటున్నాడు. స్కూళ్లకు సెలవులు కావడంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో దేవమ్మ ఇంటికి వచ్చి చూడగా సాత్విక్ కనిపించలేదు. రాత్రయినా రాలేదు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఏడున్నర గంటలకు మియాపూర్ దీప్తిశ్రీనగర్ వద్ద ఉన్న డంపింగ్ యార్డు సమీపంలో చెట్ల పొదల్లో ఓ బాలుడు గాయాలతో పడి ఉన్నాడని అక్కడి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా బాలుడి శరీరంలోని ముఖం, కడుపు భాగంలో తీవ్ర గాయాలతో అప్పటికే మృతి చెంది ఉన్నాడు. శరీరంపై కుక్కలు కరిచిన గాయాలున్నాయని పోలీసుల విచారణలో తేలింది. బాలుడు గురించి స్థానికంగా విచారించగా వీరేశం కుమారుడు సాత్విక్‌గా గుర్తించారు. కాగా, మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు డంపింగ్ యార్డ్ సమీపంలో సాత్విక్ పిల్లలు, కుక్కలతో ఆడుకున్నాడని అక్కడ చెత్త ఏరుకునే వ్యక్తులు చెప్పుకొచ్చారు. మిగిలిన పిల్లలు వెళ్లిపోయిన తర్వాత ఒంటరిగా కనిపించిన సాత్విక్‌పై కుక్కలు దాడి చేసి ప్రక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి లాక్కొని వెళ్లి కొరికి చంపినట్లు భావిస్తున్నారు. యార్డు సమీపంలో ఎప్పుడూ సుమారు 50కిపైగా కుక్కలు తిరుగుతుంటాయని స్థానికులు చెబుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దుర్గా రామలింగ ప్రసాద్ తెలిపారు.

ఏసీబీ దూకుడు!

- వరుస దాడులతో అవినీతి అధికారుల భరతం పడుతున్న వైనం
- ఇటీవల రోజంతా ఆర్టీఏ కార్యాలయాలపై దాడులు
- ఇప్పుడు గొర్రెల కేసుతో సంచలనం
- ఏకంగా మాజీ డైరెక్టర్, మంత్రి ఓఎస్డీల అరెస్టుతో సంచలనం
- రెవెన్యూ, పోలీస్, రవాణా సహా అన్ని శాఖలపై ఏసీబీ అధికారుల ఫోకస్
- మారు వేషాల్లో వెళ్లి మరీ ఆకస్మిక తనిఖీలు
- ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ల శాఖల్లో అక్రమార్కులే టార్గెట్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) గత కొద్ది నెలలుగా దూకుడు పెంచింది. వరుస తనిఖీలు, ఆకస్మిక 'ఆపరేషన్'లతో ఏసీబీ అధికారులు హల్‌చల్ చేస్తున్నారు. శుక్రవారం ఒక్క రోజే వనపర్తి జిల్లా టీజీఎస్పీడీఎల్ ఉద్యోగులు ముగ్గురు, గొర్రెల కుంభకోణంలో ఇద్దరు, కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో సీఐ, ఎస్సై, మరో ప్రైవేటు వ్యక్తి కలిపి ముగ్గురు..గండిపేట్ ఎమ్మార్వో కార్యాలయంలో నలుగురు అధికారులు కలిపి మొత్తంగా 12 మంది అవినీతి అధికారులను కటకటాల వెనక్కి నెట్టారు. ఇక గొర్రెల కుంభకోణం కేసులో పశుసంవర్ధక శాఖ మాజీ డైరెక్టర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ఓఎస్డీగా పనిచేసిన కళ్యాణ్‌ను అరెస్టు చేసి కొరడా ఝుళిపిస్తున్నామనే సంకేతాలనిచ్చింది ఏసీబీ. కొద్ది రోజుల ముందు ఆర్టీఏ కార్యాలయాలు, చెక్‌పోస్టులలో ఏకకాలంలో 15 ఏసీబీ అధికారుల బృందాలు 12 ప్రాంతాల్లో సోదాలు చేయడం సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఏసీబీ అధికారులు లారీ డ్రైవర్లుగా మారు వేషాల్లో వెళ్లి మరీ ఆర్టీఏ చెక్‌పోస్టులపై సోదాలు చేయడం గమనార్హం.

ఆనంద్ రాకతో..

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఏసీబీ డీజీగా సీవీ ఆనంద్‌కు బాధ్యతలు అప్పగించింది. ఆయన కింది స్థాయి అధికారులకు పూర్తి స్వేచ్ఛను ఇవ్వడంతో క్షేత్రస్థాయిలోని అవినీతి అధికారుల భరతం పడుతున్నారు ఫలితంగా కేసుల సంఖ్య పెరుగుతోంది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 78 కేసులు నమోదు చేయగా.. గతేడాది(2023)లో మొత్తం కలిపి కేసులు 94 మాత్రమే కావడం గమనార్హం. ప్రధానంగా రెవెన్యూ, మున్సిపల్,పట్టణాభివృద్ధిశాఖతోపాటు పోలీస్‌శాఖలో అవినీతిపై ఏసీబీ ఫోకస్ పెట్టింది. దీంతో పాటు ఇటీవల ఆర్టీఏ కార్యాలయాలపై మెరుపు దాడులు చేయడంతో అవినీతికి నిలయాలుగా మారినన మిగతా ప్రభుత్వ శాఖలపైనా ఏసీబీ నజర్ ఉన్నట్లుగా తేటతెల్లం అయ్యింది. రాష్ట్రంలో అవినీతికి మూల కేంద్రాలుగా చర్చ జరుగుతోన్న ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ల శాఖలపై కూడా ఏసీబీ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ రెండు శాఖలే టార్గెట్‌గా ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించినా ఆశ్చర్యపోవక్కర్లేదని తెలుస్తోంది.

చిక్కుతున్న అవినీతి తిమింగలాలు..

ఏసీబీ అధికారులు పక్కా స్కెచ్‌తో ముందుకు వెళుతుండడంతో అవినీతి తిమింగలాలు విలవిలలాడుతున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే హెచ్ఎండీఏలో పరాకాష్టకు చేరిన అవినీతి బాగోతం బయటకు లాగారు ఏసీబీ అధికారులు. ఆ శాఖలో అవినీతితో వేళ్లూనుకున్న హెచ్ఎండీఏ టౌన్‌ప్లానింగ్ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ కేసు అప్పట్లో పెను ప్రకంపనలు సృష్టించింది.. వందల కోట్ల అవినీతి సొమ్మును వెలికి తీయడంతోపాటు వరుస అరెస్టులు ఈ కేసులో జరిగాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 19న రూ.84 వేలు లంచం తీసుకుంటుండగా గిరిజన సంక్షేమశాఖ ఇంచార్జి సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ (ఎస్ఈ) జగజ్యోతిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సదరు అధికారి ఇంట్లో సోదాల్లో రూ.65 లక్షల నగదు, రెండున్నర కిలోల బంగారం లభ్యమైంది. మార్చిలో జరిపిన ఏసీబీ సోదాల్లో మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా రూ.19 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఆదాయానికి మించిన ఆస్తుల ఉన్నట్టు విశ్వసనీయ సమాచారంతో సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు ఇల్లు, బంధువుల ఇళ్లలో చేసిన సోదాల్లో రూ.కోట్ల ఆస్తులతోపాటు, తనతోపాటు అవినీతి భాగస్వాములుగా ఉన్న మరికొందరి పోలీస్ అధికారుల ఆస్తులకు సంబంధించిన పత్రాలు లభించడం సంచలనంగా మారింది.



ప్రజలకు మరింత చేరువయ్యేలా ఏసీబీ

గతంలో ఏసీబీ అధికారులను సంప్రదించేందుకు కేవలం 1064 టోల్‌ఫ్రీ నంబర్ మాత్రమే అందు బాటులో ఉండేది. ఇటీవల కాలంలో ప్రజలకు మరింత చేరువయ్యేలా ఏసీబీ సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటోంది. 94404 46106 వాట్సప్ నంబర్ అందుబాటులోకి తెచ్చింది. అదేవిధంగా 'www.acb.telangana.gov.in'వెబ్‌సైట్‌లో, ఫేస్‌బుక్ 'http//www.facebook.com/ ACBtelangana'లో, 'https://x.com/ Telangana ACB'ట్విట్టర్‌లో, 'dg&acb@telangana.gov.in' ఈ–మెయిల్ లోనూ ఏసీబీ అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు.

క్లుప్తంగా...

మేడిగడ్డలో శాస్త్రవేత్తల బృందం పరీక్షలు



15వ పియర్ వద్ద కాంక్రీట్ నమూనా సేకరిస్తున్న బృందం సభ్యులు

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీని సెంట్రల్ సాయిల్ మెటీరియల్స్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) శాస్త్రవేత్త హరిదేవ్ ఆధ్వర్యంలోని ఏడుగురు సభ్యుల బృందం బుధవారం బ్యారేజీని సందర్శించింది. బ్యారేజీ పియర్లు కుంగిన నేపథ్యంలో వివిధ పరీక్షలు ప్రారంభించింది. బ్యారేజీ నిర్మాణంలో వాడిన మెటీరియల్, మట్టి నమూనాలను సేకరిస్తోంది. కుంగిన 12, 13 పియర్ల వద్ద 25 అడుగుల మేర డ్రిల్లింగ్ చేసి మట్టి పరీక్షలు నిర్వహిస్తోంది. ఈ బృందం వారంపాటు మేడిగడ్డలో మకాం వేసి పరీక్షలు చేపట్టనుందని ఇంజనీరింగ్ వర్గాలు వెల్లడించాయి. వారి వెంట ఈఈ తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



అశోక్ (ఫైల్)

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కొమ్మాలకు చెందిన గడ్డమీది అశోక్ (40) అనే కౌలు రైతు బుధవారం అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువుల కథనం ప్రకారం.. అశోక్ మూడేళ్లుగా అదే గ్రామానికి చెందిన రైతు వద్ద రెండున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నా డు. ఈ క్రమంలో వ్యవసాయంలో పెట్టుబడి కోసం సుమారు రూ.6 లక్షల మేర అప్పు చేశాడు. పంటలు సరిగా పండక, చేసిన అప్పు తీరకపోవడంతో మనస్తాపం చెంది బుధవా రం మధ్యాహ్నం క్రిమిసంహారక మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరుకున్న అతడిని స్థానికులు గుర్తించి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

బీడీ ఆకుల సీజన్‌లో కొనుగోలు రేటు ఖరారు

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది ప్రస్తుత సీజన్‌లో బీడీ ఆకుల (అబ్బస్ లీవ్స్) సేకరణ, కొనుగోలు రేటును ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2024 బీడీ ఆకుల సీజన్‌లో స్టాండర్డ్ బ్యాగ్ (50 ఆకుల చొప్పున వెయ్యి బండిళ్ల)కు సేకరణ, కొనుగోలు రేటును రూ. 3 వేలుగా నిర్ణయించింది. జూన్ 30తో ముగియనున్న బీడీ ఆకుల సీజన్‌కు ఈ రేట్లు వర్తింపజేయనుంది. బుధవారం ఈ మేరకు అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి ఎ.వాణీప్రసాద్ ఆదేశాలిచ్చారు. ఈ విషయంలో ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) తగిన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'రేపటి నుంచి మాదిగల జనసభలు'

సాక్షి, హైదరాబాద్: మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఈనెల 7వ తేదీ నుంచి మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో మాదిగల జనసభలను నిర్వహించనున్నారు. జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి నేతృత్వంలో నిర్వహించనున్న ఈ జనసభల పోస్టర్‌ను బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత చంద్రశేఖర్, మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డె యాదయ్య, అంబేడ్కర్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గజ్జెల్లి మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.



బంజారాహిల్స్‌లో కురుస్తున్న భారీ వర్షం


వారంలో రాష్ట్రమంతా నైరుతి

▶ మొదటి పేజీ తరువాయి

బుధవారం నైరుతి బంగాళాఖాతం ప్రాంతాలలో కేంద్రీకృతమై ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది దక్షిణ ఆంధ్రప్రదేశ్, దాని పరిసర ప్రాంతాలలో సముద్ర మట్టం నుంచి సగటున 3.1 కిలోమీటర్ల నుంచి 4.5 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉన్నట్లు వివరించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని తూర్పు, ఉత్తర ప్రాంతాల్లోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదు కావొచ్చని పేర్కొంది. బుధవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాలను పరిశీలిస్తే నిజామాబాద్‌లో 40.1 డిగ్రీ సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇక కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 22.5 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది.


హైదరాబాద్‌లో జడివాన.. భారీగా ట్రాఫిక్ జామ్

బుధవారం సాయంత్రం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎండ మండిపోగా.. నాలుగు గంటలకు ఒక్కసారిగా మబ్బులు కమ్మి వాతావరణం చల్లబడింది. ఆ తర్వాత పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపుతో కూడిన భారీ వర్షం కురిసింది. అత్యధికంగా బేగంబజార్‌లో 8.5 సెం.మీ. వర్షపాతం నమోదైంది. బండ్లగూడ కందికల్‌గేట్‌లో 8.1, చార్మినార్‌లో 8, అల్లాపూర్‌లో 7.6, యూసుఫ్‌గూడ 7.5, గౌలిగూడ 7.3 సెం.మీ చొప్పున మిగతా ప్రాంతాల్లో ఆరు సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. బేగంబజార్, నాంపల్లి, బండ్లగూడ, చార్మినార్, కూకట్‌పల్లి, ఖైరతాబాద్, ఆసిఫ్‌నగర్, శేరిలింగంపల్లి, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, హైటెక్ సిటీ, శిల్పారామం, గచ్చిబౌలి తదితర ప్రాంత్రాల్లో వర్షం నీరు రహదారులను ముంచెత్తింది. ఆయా ప్రాంతాల్లో తీవ్రమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి

- అధికారులకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్లను యుద్ధప్రాతి పది కన మెరుగుపరచాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ఎన్నికల కోడ్ అమలులోకి రావ టంతో రోడ్ల పరిస్థితిపై సమీక్షించి చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఇప్పుడు 24 గంటలు పనిచేసేలా వ్యవస్థను ఏర్పాటు చేసి రోడ్లను మెరుగుపరచాల్సి ఉందని చెప్పారు. బుధవారం ఆయన అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. సచివాలయంలో రూ.30 కోట్ల వ్యయంతో ప్రత్యేకంగా పార్కింగ్ వ్యవస్థకు సంబంధించిన పనులు వెంటనే మొదలయ్యేలా ఏర్పాట్లు చేయాలన్నారు. రోజుకు వేయి వరకు వాహనాలు వచ్చిపోయే సచివాలయంలో సరైన పార్కింగ్ వ్యవస్థకు ప్లాన్ చేయకుండానే భవనం నిర్మించటం ఏంటని ప్రశ్నించారు. డ్రైవర్లకు టాయిలెట్లు కూడా నిర్మించా లని సూచించారు. హైదరాబాద్‌లో టిమ్స్ ఆస్పత్రుల నిర్మా ణంలో జాప్యం జరుగుతుండటంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకుల నుంచి లోన్లు తీసుకుంటున్నందున, నిధు ల కొరత లేకున్నా జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. తాను ఆరు రోజుల అమెరికా పర్యటనకు వెళుతున్నానని, రాగానే జిల్లాల్లో పర్యటిస్తానని తెలిపారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయ భవనం, సీఆర్ఐఎఫ్ పనులపై కూడా ఆరా తీశారు. ఈ సమావేశంలో రోడ్లు, భవనాలశాఖ కార్యదర్శి విజేంద్రబోయీ, ఈఎన్‌సీ గణపతిరెడ్డి, చీఫ్ ఇంజనీర్ శారద, ఎస్ఈ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రెడిట్ కార్డు రుణం చెల్లించలేక యువకుడి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: క్రెడిట్ కార్డు ద్వారా తీసుకున్న రుణం తిరిగి చెల్లించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నిజామాబాద్ నగరంలోని గాజుల్‌పేట్‌లో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. గాజుల్‌పేట్‌కు చెందిన నారాయణ అలియాస్ సన్నీ(22) క్రెడిట్ కార్డు ద్వారా నగదు తీసుకొని షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టాడు. పలు కారణాలతో క్రెడిట్ కార్డు రుణం చెల్లించడంలో ఆలస్యమైంది. దీంతో క్రెడిట్ కార్డు సంస్థకు చెందిన సిబ్బంది నారాయణ ఇంటికి వచ్చి రుణం చెల్లించాలని హెచ్చరించారు. దీంతో మనస్తాపానికి గురైన నారాయణ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


ఎన్డీఏ భేటీలో చంద్రబాబు, నితీశ్ కుమార్‌లతో మాట్లాడుతున్న మోదీ


తన రాజీనామా పత్రాన్ని రాష్ట్రపతి ముర్ముకు సమర్పిస్తున్న మోదీ

ఎన్డీఏ నేతగా మోదీ

ఏకగ్రీవంగా ఎన్నుకున్న నేతలు.. వీలైనంత త్వరగా ప్రభుత్వ ఏర్పాటు

న్యూఢిల్లీ/బెంగళూరు: బీజేపీ సారథ్యంలోని అధికార ఎన్డీఏ కూటమి నేతగా ప్రధాని మోదీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం వెలువడ్డ లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీఏ మెజారిటీ స్థానాలు సాధించడం తెలిసిందే. దాంతో మోదీ వరుసగా మూడోసారి ప్రధాని కానున్నారు. తొలి ప్రధాని నెహ్రూ తర్వాత ఈ ఘనత సాధించనున్న నాయకునిగా రికార్డు సృష్టించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఢిల్లీలో ప్రధాని నివాసంలో ఎన్డీఏ కీలక సమావేశం జరిగింది. మోదీ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో బీజేపీతో పాటు ఎన్డీఏ పక్షాల అగ్ర నేతలంతా పాల్గొన్నారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జేడీ(యూ) చీఫ్ నితీశ్‌కుమార్, శివసేన అధినేత ఏక్‌నాథ్ షిండే, ఎల్జేపీ (ఆర్‌వీ) చీఫ్ చిరాగ్ పాశ్వాన్, జేడీ(ఎస్) నేత హెచ్.డి.కుమారస్వామి, ఎన్సీపీ నాయకుడు ప్రఫుల్ పటేల్, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ సహా 16 పార్టీలకు చెందిన 21 మంది నాయకులు భేటీలో పాల్గొన్నారు. బీజేపీ నుంచి పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, అగ్ర నేతలు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్ తదితరులు హాజరయ్యారు. భేటీను ద్దేశించి తొలుత మోదీ మాట్లాడారు. ఎన్నికల విజయానికి కూటమి పక్షాలను అభినందించారు. కేంద్రంలో ఎన్డీఏ వరుసగా మూడోసారి మెజారిటీ సాధించడం చరిత్రాత్మకమని అభిప్రాయపడ్డారు. ఇది గత 60 ఏళ్లలో ఎవరికీ సాధ్యపడని ఘనత అన్నారు. వీలైనంత త్వరగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా నితీశ్ సూచించారు. ఇండియా కూటమిలో చేరాలంటూ ఎన్డీఏ పార్టీలకు కాంగ్రెస్ బాహాటంగానే పిలుపులిస్తున్న నేపథ్యంలో అనిశ్చితికి తావు లేకుండా తక్షణం ప్రభుత్వం కొలువుదీరాలని నేతలన్నారు. అందుకు వీలుగా శాఖల పంపకం తదితర మంతనాలను వీలైనంత త్వరగా పూర్తి చేసుకోవాలని నిర్ణయించారు. ప్రభుత్వ కూర్పుపైనా భేటీలో నేతలు చర్చించారు. శుక్రవారం ఎన్డీఏ ఎంపీలంతా సమావేశమై మోదీని తమ నాయకునిగా లాంఛనంగా ఎన్నుకుంటారని హెచ్ఏఎం(ఎస్) జితిన్‌రాం మాంఝీ వెల్లడించారు. అనంతరం రాష్ట్రపతిని కలిసి ఎన్డీఏ కూటమికి మద్దతు లేఖలు సమర్పిస్తామని భేటీ అనంతరం మీడియాకు వెల్లడించారు.

మోదీపై నేతల ప్రశంసలు

దేశ ఘన వారసత్వాన్ని ప్రగతికి, సమగ్రాభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం పాటుపడుతుందంటూ ఎన్డీఏ భేటీలో నేతలంతా తీర్మానం చేశారు. ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ''ప్రధాని మోదీ సారథ్యంలో గత పదేళ్లలో పలు ప్రజానుకూల నిర్ణయాలతో దేశం అన్ని రంగాల్లోనూ వృద్ధి బాటన సాగుతోంది. ఆయన నాయకత్వంలో 2024 లోక్‌సభ ఎన్నికల్లో సమైక్యంగా పోటీ చేసి గొప్ప విజయం సాధించడం మాకందరికీ గర్వకారణం. మోదీని మా నాయకునిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నాం'' అంటూ నేతలు తీర్మానించారు.

ఎన్డీఏతోనే ఉంటాం

తాము ఎన్డీఏలోనే కొనసాగుతామని బాబు, నితీశ్ స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి ఊహాగానాలకూ తావు లేదన్నారు. దేశ నిర్మాణం కోసం పదేళ్లుగా మోదీ చేసిన కృషిని ప్రస్తుతిస్తూ నేతలంతా ఆయన్ను అభినందించారని తెలిపారు. ''అంతర్జాతీయంగా భారత్ స్థాయిని మోదీ పెంచారు. ఆయన లక్ష్యాల సాధనకు సహకరిస్తాం'' అన్నారు.

కీలక శాఖలు, స్పీకర్
ఎన్డీఏ పక్షాల డిమాండ్లు

2014, 2019ల్లోనూ కేంద్రంలో ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వమే ఏర్పాటైనా ఆ రెండు సార్లూ బీజేపీకి ఒంటరిగానే సంపూర్ణ మెజారిటీ వచ్చింది. ఈసారి మాత్రం ఆ పార్టీ 240 లోక్‌సభ స్థానాలకు పరిమితమై మెజారిటీకి 32 సీట్ల దూరంలో నిలిచింది. దాంతో ప్రభుత్వ ఏర్పాటులో భాగస్వామ్య పక్షాల మద్దతు కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో మోదీ 3.0 సర్కారు పనితీరు గత రెండుసార్లతో పోలిస్తే చాలా భిన్నంగా ఉండేలా కనిపిస్తోంది. ఎన్డీఏ భాగస్వాములంతా కీలక శాఖలు డిమాండ్ చేస్తున్నట్టు చెబుతున్నారు. విశ్వసనీయ వర్గాలతో పాటు జాతీయ మీడియా పేర్కొంటున్న మేరకు ఎవరేం కోరుతున్నారంటే...

టీడీపీ: ఏకంగా 7 నుంచి 8 కేబినెట్ బెర్తులు, ఒక సహాయ మంత్రి పదవి కోరుతోంది! వ్యవసాయ, రవాణా, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యం, ఐటీ–వాణిజ్య, విద్య, గృహ నిర్మాణ, జల శక్తి, ఆర్థిక (సహాయ) శాఖలతో కూడిన జాబితాను బీజేపీ ముందు పెట్టినట్టు తెలుస్తోంది. లోక్‌సభ స్పీకర్ పదవి కూడా అడుగుతోంది.

జేడీ(యూ): జేడీ(యూ) పార్టీ కనీసం మూడు కేబినెట్ పదవులు డిమాండ్ చేస్తోంది. ఒకట్రెండు సహాయ మంత్రి పదవులు కూడా కోరవచ్చంటున్నారు. మరోవైపు విపక్షాల 'ఇండియా' కూటమి కూడా ఇప్పటికే తమను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తోందని జేడీ(యూ) సీనియర్ నేత, బిహార్ మంత్రి విజయ్ కుమార్ చౌదరి మీడియాకు చెప్పడం విశేషం. ఆయన వ్యాఖ్యలను బీజేపీపై ఒత్తిడి పెంచే వ్యూహంగా భావిస్తున్నారు.

ఎల్జేపీ (ఆర్‌వీ): ఒక కేబినెట్, ఒక సహాయ మంత్రి పదవి కోసం పట్టుబడుతోంది. బిహార్లో పోటీ చేసిన ఐదు లోక్‌సభ స్థానాల్లోనూ పార్టీ ఘనవిజయం సాధించడం తెలిసిందే. హెచ్ఏఎం(ఎస్) నేత జితిన్‌రాం మాంఝీ కూడా కేబినెట్ పదవి ఆశిస్తున్నారు.

శివసేన: ఒక కేబినెట్, మరో సహాయ మంత్రి పదవి కోరుతోంది.

వ్యవసాయ శాఖపై జేడీ(ఎస్) కన్ను: తనకు వ్యవసాయ శాఖ కావాలంటూ జేడీ(ఎస్) నేత కుమారస్వామి స్పష్టమైన సంకేతాలిచ్చారు. ఆయన పార్టీ జేడీ(ఎస్) రెండు లోక్‌సభ స్థానాలు గెలిచింది. ''కేంద్ర వ్యవసాయ శాఖపై మా పార్టీకి ఆసక్తి ఉంది. అయితే మేమేమీ డిమాండ్లు చేయడం లేదు. మాకు కర్నాటక ప్రయోజనాలే ప్రధానం. కేంద్ర మంత్రివర్గంలో రాష్ట్రానికి ఎలాంటి ప్రాతినిధ్యం కల్పించాలో మోదీ నిర్ణయిస్తారు. అయినా దానిపై సరైన సమయంలో మాట్లాడుకుందాం'' అని చెప్పుకొచ్చారు.

8 లేదా 9న ప్రమాణం!

మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నరేంద్ర మోదీ

- మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సమావేశం
- ఎన్నికల ఫలితాలు, ప్రభుత్వ ఏర్పాటుపై చర్చ
- 17వ లోక్‌సభను రద్దు చేయాలని సిఫార్సు
- ఆమోదించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ప్రభుత్వం ఏర్పడే వరకు ఆపద్ధర్మ ప్రధానిగా వ్యవహరించాలని మోదీకి సూచన

సాక్షి, న్యూఢిల్లీ: మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధాని పీఠాన్ని అధిరోహించబోతున్నారు. వరుసగా మూడుసార్లు ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసి జవహర్‌లాల్ నెహ్రూ నెలకొల్పిన రికార్డును మోదీ సమం చేయబోతున్నారు. ఈ నెల 8 లేదా 9న ప్రమాణం స్వీకారం చేసే అవకాశం ఉంది. ప్రధాని సహా నూతన మంత్రివర్గ ప్రమాణ స్వీకారానికి రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాగా, బుధవారం మోదీ నేతృత్వంలో కేంద్ర మంత్రివర్గం సమావేశమైంది. ఎన్డీయే–2 ప్రభుత్వంలో ఇదే చివరి కేబినెట్ సమావేశం. లోక్‌సభ ఎన్నికల ఫలితాలతోపాటు నూతన ప్రభుత్వ ఏర్పాటుపై విస్తృతంగా చర్చించారు. ప్రస్తుత 17వ లోక్‌సభను రద్దు చేయాలని కేబినెట్ సిఫార్సు చేసింది. ఢిల్లీలోని ప్రధాని నివాసంలో ఉదయం 11.30 గంటలకు జరిగిన కేబినెట్ భేటీలో మోదీ మాట్లాడారు. రాజకీయాల్లో గెలుపోటములు ఒక భాగమేనని అన్నారు. నెంబర్ గేమ్ కొనసాగుతుందని చెప్పారు. గత పదేళ్ల పాలనలో ఎన్నో మంచి పనులు చేశామని, భవిష్యత్తులోనూ ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తూనే ఉంటామని వెల్లడించారు. పదేళ్లలో మంత్రులంతా కష్టపడి పనిచేశారని ప్రశంసించారు. మంత్రివర్గ సమావేశం అనంతరం మోదీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి తనతో పాటు మంత్రివర్గ సహచరుల రాజీనామా లేఖలను సమర్పించారు. మోదీతోపాటు కేంద్ర మంత్రుల రాజీనామాలను రాష్ట్రపతి ఆమోదించారు. నూతన ప్రభుత్వం ఏర్పడే వరకు ఆపద్ధర్మ ప్రధానమంత్రిగా వ్యవహరించాలని మోదీని కోరారు. 17వ లోక్‌సభను రద్దు చేయాలని కోరుతూ కేబినెట్ చేసిన సిఫార్సు లేఖను రాష్ట్రపతి అందజేశారు. దీంతో 17వ లోక్‌సభను రద్దు చేస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్రపతి భవన్ వర్గాలు వెల్లడించాయి.

ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్‌తో మోదీ భేటీ

ప్రధాని మోదీ బుధవారం తన పదవికి రాజీనామా చేసిన తర్వాత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ధన్‌ఖడ్ మూడు కమలం పువ్వులున్న పుష్పగుచ్ఛాన్ని మోదీకి అందజేసి అభినందనలు తెలియజేశారు. వరుసగా మూడుసార్లు విజయం సాధించినందుకు గుర్తుగా మూడు కమలం పువ్వులను ఇచ్చినట్లు తెలుస్తోంది. అలాగే మోదీ కూడా కొన్ని రకాల మిఠాయిలను ఉప రాష్ట్రపతికి అందజేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం రాత్రి ప్రధాని నరేంద్ర మోదీ, దిగిపోతున్న మంత్రివర్గానికి రాష్ట్రపతి భవన్‌లో విందు ఇచ్చారు. ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూడా దీనికి హాజరయ్యారు.

టీడీపీ, జేడీ(యూ) మద్దతుతో ప్రభుత్వ ఏర్పాటు

సార్వత్రిక ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన బీజేపీ మిత్రపక్షాల సహాయంతో వరుసగా మూడోసారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతోంది. ఈసారి కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యా బలం బీజేపీకి లభించలేదు. ఇతర పార్టీలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. టీడీపీ, జేడీ(యూ), ఇతర మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ పెద్దలు నిర్ణయించారు. ఇదిలా ఉండగా, కేంద్రంలో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి సైతం తన వంతు ప్రయత్నాలు ప్రారంభించింది. దీంతో హస్తినలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఎన్డీయే నుంచి కొన్ని భాగస్వామ్య పక్షాలు ప్రతిపక్ష కూటమిలో చేరబోతున్నాయంటూ ఢిల్లీలో ఊహాగానాలు మొదలయ్యాయి.

కోర్టులో కేజ్రీవాల్‌కు చుక్కెదురు

బెయిల్ పొడిగింపు అభ్యర్థన తిరస్కరణ

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల కోసం ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను అనారోగ్య కారణాలరీత్యా పొడిగించాలని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ చేసిన అభ్యర్థనను ఢిల్లీ సిటీ కోర్టు బుధవారం తోసిపుచ్చింది. బెయిల్‌ను పొడిగించాలంటూ కేజ్రీవాల్ పెట్టుకున్న పిటిషన్‌పై కేజ్రీవాల్, ఈడీ తరఫున ఇరువైపులా వాదనలు విన్న కోర్టు గతంలోనే తీర్పును బుధవారానికి రిజర్వ్‌చేయడం తెల్సిందే. ఈ అభ్యర్థనను తిరస్కరిస్తున్నట్లు తీర్పును బుధవారం వెలువరిచింది. పిటిషన్‌లో కేజ్రీవాల్ అనారోగ్యం అంశాన్ని ప్రస్తావించిన నేపథ్యంలో జైలులో ఆయన బాగోగులు చూసుకోవాలని తిహార్ జైలు యంత్రాంగానికి ఢిల్లీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా బుధవారం ఆదేశించారు. కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని జూన్ 19వ తేదీదాకా పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ కేసులో డీఫాల్ట్ బెయిల్ కోసం కేజ్రీవాల్ విడిగా పెట్టుకున్న మరో పిటిషన్‌ను జూన్ ఏడో తేదీన విచారిస్తామని కోర్టు తెలిపింది.

మహిళా ఎంపీలు@74

న్యూఢిల్లీ: పద్దెనిమిదో లోక్‌సభకు మొత్తం 74 మంది మహిళా ఎంపీలు ఎన్నికయ్యారు. 543 మంది సభ్యులు గల లోక్‌సభలో మహిళా ఎంపీలు 13.62 శాతం మాత్రమే. ఈ 74 మందిలో 30 మంది గత లోక్‌సభలోనూ సభ్యులు కాగా, ఒకరు రాజ్యసభ సభ్యురాలు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 797 మంది మహిళలు పోటీచేయగా... బీజేపీ అత్యధికంగా 69 మందిని బరిలోకి దింపింది. కాంగ్రెస్ 41 మంది మహిళలకు టికెట్లిచ్చింది. చట్టసభల్లో 33 శాతం సీట్లను రిజర్వు చేసే మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటు ఆమోదం పొందాక జరిగిన తొలి ఎన్నికలివి. అయితే మహిళా రిజర్వేషన్ బిల్లు ఇంకా అమల్లోకి రాలేదు. బీజేపీ నుంచి హేమమాలిని, టీఎంసీ నుంచి మహువా మొయిత్రా, ఎన్సీపీ (ఎస్పీ) నుంచి సుప్రియా సూలే, ఎస్పీ నుంచి డింపుల్ యాదవ్‌లు తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. బాలీవుడ్ నటి కంగనా రనౌత్, లాలూ కూతురు మీసా భారతి తొలిసారిగా నెగ్గి దేశం దృష్టిని ఆకర్షించారు. సమాజ్‌వాది పార్టీ నుంచి 25 ఏళ్ల ప్రియా సరోజ్ (మచిలీషహర్), 29 ఏళ్ల ఇఖ్రా చౌదరి (కైరానా)లు లోక్‌సభకు ఎన్నికైన అతిపిన్న వయసు మహిళా ఎంపీలు. దేశంలో అత్యధిక మంది మహిళా ఎంపీలను లోక్‌సభకు పంపిన రాష్ట్రంగా పశ్చిమబెంగాల్ నిలిచింది. బెంగాల్ నుంచి గెలిచిన 11 మంది మహిళా ఎంపీలూ టీఎంసీ వారే కావడం విశేషం. భారత లోక్‌సభ చరిత్రలో అత్యధికంగా 17వ లోక్‌సభలో 78 మంది మహిళా ఎంపీలు ఎన్నికయ్యారు. దక్షిణాఫ్రికాలో 46 శాతం, యునైటెడ్ కింగ్‌డమ్‌లో 35 శాతం, అమెరికాలో 29 శాతం మంది మహిళా ఎంపీలు ఉన్నారు.

ఏ పార్టీ నుంచి ఎందరంటే..

బీజేపీ	30
కాంగ్రెస్	14
తృణమూల్	11
సమాజ్‌వాది	4
డీఎంకే	3
జేడీయూ	2
ఎల్జేపీ	2

(వైఎస్సార్‌సీపీ 1, ఎన్సీపీ-ఎస్పీ 1, అకాళీదళ్ 1, అప్నాదళ్ 1, ఆర్జేడీ 1, జేఎంఎం 1, టీడీపీ 1, ఇతరులు 1)

నవీన్ పట్నాయక్ రాజీనామా

ముగిసిన 24 ఏళ్ల ప్రస్థానం

భువనేశ్వర్: ఒడిశాలో బిజూ జనతాదళ్(బీజేడీ) అధినేత నవీన్ పట్నాయక్ పరిపాలనకు తెరపడింది. 24 ఏళ్లుగా అవిచ్ఛిన్నంగా ముఖ్యమంత్రి పదవిలో కొనసాగిన నవీన్ పట్నాయక్ బుధవారం రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని రాష్ట్ర గవర్నర్ రఘువర్ దాస్‌కు సమర్పించారు. ఒడిశా శాసనసభ ఎన్నికల్లో బీజేడీ పరాజయం పాలైంది. 147 స్థానాలకు గాను కేవలం 51 స్థానాలు గెలుచుకుంది. బీజేపీ ఏకంగా 78 సీట్లు సాధించింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. నవీన్ పట్నాయక్ 2000 సంవత్సరం మార్చి 5న తొలిసారిగా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి పదవిలో కొనసాగారు. తాజా ఎన్నికల్లో ఓటమి ఎదురుకావడంతో పదవి నుంచి తప్పుకున్నారు. ఇక ప్రతిపక్ష పాత్ర పోషించబోతున్నారు.

బీజేపీని అడ్డుకున్నాం

అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్య

కన్నౌజ్/ఎటావా: ఉత్తరప్రదేశ్‌లో బీజేపీని అడ్డుకోవడంలో తాము విజయవంతం అయ్యామని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ చెప్పారు. ఎన్నికల్లో బీజేపీని కట్టడి చేయడమే లక్ష్యంగా పని చేశామని అన్నారు. అనుకున్న లక్ష్యం సాధించామని ఉద్ఘాటించారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ వ్యవస్థాపకుడు ములాయంసింగ్ యాదవ్ చూపిన బాటలో నడుస్తూ బీజేపీ దూకుడుకు అడ్డుకట్ట వేశామన్నారు. యూపీలో లోక్‌సభల్లో ఎస్పీ ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఎస్పీ సొంతంగా 37 స్థానాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే. కన్నౌజ్ లోక్‌సభ స్థానం నుంచి అఖిలేశ్ యాదవ్ 1.70 లక్షల ఓట్ల మెజార్టీతో బీజేపీ అభ్యర్థి సుబ్రతా పాఠక్‌పై విజయం సాధించారు.

దేవేంద్ర ఫడ్నవీస్ రాజీనామా!

ముంబై: లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో 48 స్థానాలకు గాను అధికార కూటమిలో భాగస్వామి అయిన బీజేపీ కేవలం 9 స్థానాలు గెలుచుకుంది. ఎన్నికల్లో పేలవమైన పనితీరును తాను బాధ్యత వహిస్తున్నానని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్ చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. తన రాజీనామాకు అంగీకారం తెలపాలని బీజేపీ అధిష్టానాన్ని బుధవారం కోరారు. మరో ఆరు నెలల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం కృషి చేస్తానని, పూర్తి సమయం పార్టీ కోసమే వెచ్చిస్తానని అన్నారు.

ప్రభుత్వం ఏర్పాటు చేద్దాం రండి

అన్ని పార్టీలకు ఖర్గే పిలుపు

- ఇండియా కూటమి నేతల భేటీ
- ప్రభుత్వ ఏర్పాటుపై మల్లగుల్లాలు
- బీజేపీ పాలన వద్దన్నది ప్రజాభీష్టం
- దాన్ని నెరవేర్చేందుకు చర్యలు: ఖర్గే

న్యూఢిల్లీ: కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై విపక్ష ఇండియా కూటమి మల్లగుల్లాలు పడుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో అందరి అంచనాలనూ మించి కూటమి 234 స్థానాలు సాధించడం తెలిసిందే. దాంతో కాంగ్రెస్‌తో పాటు భాగస్వామ్య పక్షాలన్నీ జోష్‌లో ఉన్నాయి. బుధవారం కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో కూటమి నేతల కీలక సమావేశం జరిగింది. ఇండియా కూటమిలో చేరాల్సిందిగా పార్టీలన్నింటినీ ఆహ్వానిస్తున్నట్టు ఖర్గే ఈ సందర్భంగా ప్రకటించారు. రాజ్యాంగ పరిరక్షణకు, అందులో పేర్కొన్న విలువలకు కట్టుబడ్డ పార్టీలన్నింటికీ ఇండియా కూటమిలోకి స్వాగతమన్నారు. తమ కూటమి పక్షాలన్నీ ఎన్నికల్లో అద్భుతంగా పోరాడాయంటూ ప్రశంసించారు. ''ప్రజా తీర్పు ప్రధాని మోదీకి, ఆయన విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా వెలువడింది. ఫలితాలు ఆయనకు నైతిక ఓటమి. అయినా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ద్వారా కానీ ప్రజా తీర్పును కాలరాసేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారు'' అంటూ ఖర్గే దుయ్యబట్టారు. దీన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత అన్ని పార్టీలపైనా ఉందన్నారు.

సరైన సమయంలో సరైన చర్యలు

భేటీ అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడారు. బీజేపీ పాలన వద్దని ప్రజలు స్పష్టంగా తీర్పు వెలువరించారన్నారు. దాన్ని నెరవేర్చేందుకు ఇండియా కూటమి సరైన సమయంలో చర్యలు తీసుకుంటుందంటూ నర్మగర్భంగా మాట్లాడారు. కూటమి నేతలంతా భేటీలో ఈ మేరకు ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఇప్పటికిప్పుడు ముందుకు వెళ్లడం లేదన్నారు. మోదీ సారథ్యంలోని బీజేపీ ఫాసిస్టు పాలనపై రాజీలేని పోరు కొనసాగించాలని కూటమి నేతలంతా నిర్ణయించామన్నారు. లోక్‌సభలో మెజారిటీ మార్కు 272. దాన్ని చేరేందుకు ఇండియా కూటమికి మరో 38 సీట్లు కావాలి. పాలక ఎన్డీఏ కూటమికి మెజారిటీకి మించి 292 స్థానాలొచ్చినా బీజేపీ మాత్రం 240కే పరిమితమైంది. దాంతో ప్రభుత్వ ఏర్పాటుకు టీడీపీ, జేడీ(యూ), శివసేన, ఎల్జేపీ వంటి భాగస్వాములపై ఆధారపడింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీలను తమ వైపు తిప్పుకునేందుకు ఇండియా కూటమి ఇప్పటికే జోరుగా ప్రయత్నాలు మొదలు పెట్టినట్టు చెబుతున్నారు. ఇండియా కూటమి భేటీలో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వద్రాతో పాటు భాగస్వామ్య పక్షాల నుంచి అఖిలేశ్ యాదవ్ (ఎస్పీ), అభిషేక్ బెనర్జీ (టీఎంసీ), స్టాలిన్ (డీఎంకే), సంజయ్ రౌత్ (శివసేన–యూబీటీ), శరద్ పవార్, సుప్రియా సులే (ఎన్సీపీ–ఎస్పీ), తేజస్వీ యాదవ్ (ఆర్జేడీ), చంపయ్ సోరెన్ (జేఎంఎం), సీతారాం ఏచూరి (సీపీఎం), సంజయ్ సింగ్, రాఘవ్ ఛద్దా (ఆప్), ఒమర్ అబ్దుల్లా (ఎన్సీ), ఎన్కే ప్రేంచంద్రన్ (ఆరెస్పీ) తదితరులు పాల్గొన్నారు. కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటు తదితర భావి వ్యూహాలపై నేతలంతా రెండు గంటలకు పైగా లోతుగా చర్చించారు.


ఢిల్లీలోని ఖర్గే నివాసంలో భేటీ అయిన 'ఇండియా' కూటమి పార్టీల నేతలు

వేచి చూడండి: తేజస్వీ

భేటీకి ముందు తేజస్వి మీడియాతో మాట్లాడుతూ 'ఏం జరగనుందో వేచి చూడండి' అంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. ఆయన, ఎన్డీఏ భేటీలో పాల్గొనేందుకు జేడీ(యూ) చీఫ్ నితీశ్‌కుమార్ బుధవారం పట్నా నుంచి ఢిల్లీకి ఒకే విమానంలో వెళ్లడం విశేషం! ఆ సందర్భంగా పక్కపక్కనే కూర్చుని మాటలు కలిపడంతో మీడియాలో విపరీతమైన ఆసక్తి నెలకొంది. నితీశ్‌ను తిరిగి ఇండియా కూటమిలో చేరేలా ఒప్పించేందుకు తేజస్వి ప్రయత్నించారంటూ పుకార్లొచ్చాయి. దాంతో ఢిల్లీ చేరగానే విమానాశ్రయంలో మీడియా అంతా తేజస్విని చుట్టుముట్టింది. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఇండియా కూటమి చేస్తున్న ప్రయత్నాలపై ప్రశ్నల వర్షం కురిపించింది. నితీశ్‌తో తన మాటలు కుశల ప్రశ్నలకే పరిమితమైనట్టు తేజస్వి బదులిచ్చారు.

మీ చెల్లెల్ని అయినందుకు గర్వంగా ఉంది

రాహుల్‌కు ప్రియాంక అభినందనలు

న్యూఢిల్లీ: తన సోదరుడు రాహుల్ గాంధీ ఎప్పటికీ వెనక్కి తగ్గరని, సత్యం కోసం పోరాటాన్ని ఆపబోరని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ వాద్రా ప్రశంసించారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన రాహుల్‌కు బుధవారం 'ఎక్స్'లో అభినందనలు తెలియజేశారు. ''మీరు ఎప్పుడూ తలెత్తుకొని ఉంటారు. ఎవరేం చెప్పినా, ఏం చేసినా, ఎన్నిక ప్రతికూల పరిస్థితులు ఎదురైనా మీరు వెనక్కి తగ్గరు. మీ అంకితభావాన్ని ఎవరెంతగా సందేహించినా మీరు మీపై విశ్వాసం కోల్పోరు. కోపం, విద్వేషం వంటివి మిమ్మల్ని ప్రభావితం చేయలేవు. మీరు చాలా ధైర్యవంతులు. మీ చెల్లెల్ని అయినందుకు ఎంతో గర్వంగా ఉంది'' అని ప్రియాంక పోస్టు చేశారు.

మోదీకి దేశాధినేతల శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: మూడోసారి అధికార పగ్గాలు స్వీకరిస్తున్న ప్రధాని మోదీకి పలు ప్రపంచ దేశాల అధినేతలు శుభాకాంక్షలు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, జర్మనీ చాన్స్‌లర్ ఓలాఫ్ స్కోల్జ్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలానీ ఇలా 75 దేశాలకు చెందిన అగ్రనేతలు మోదీకి శుభాకాంక్షలు తెలిపారు.

మూడోసారి అంతరిక్షంలోకి సునీత

హ్యూస్టన్: భారత సంతతికి చెందిన అమెరికా వ్యోమగామి సునీతా విలియమ్స్(58) అంతరిక్ష ప్రయాణం ప్రారంభించారు. మరో వ్యోమగామి బుచ్ విల్‌మోర్(61)తో కలిసి బోయింగ్ కంపెనీకి చెందిన స్టార్‌లైనర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో బుధవారం పయనమయ్యారు. అంతరిక్షంలోని ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌కు 25 గంటల్లో చేరుకోబోతోన్నారు. అక్కడ వారం రోజులపాటు ఉంటారు. స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్‌లోనే ఈ నెల 14న మళ్లీ భూమిపైకి చేరుకుంటారు. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' ఆధ్వర్యంలో ఫ్లోరిడాలోని కేప్ కెనావెరాల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి ఈ ప్రయాణం ఆరంభమైంది. స్టార్‌లైనర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో అంతరిక్ష ప్రయాణం చేసిన మొట్టమొదటి వ్యోమగాములుగా సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ చరిత్ర సృష్టించారు. ఈ స్పేస్ మిషన్‌కు సునీతా పైలట్‌గా, విల్‌మోర్ కమాండర్‌గా వ్యవహరిస్తున్నారు. సునీతా అంతరిక్షంలోకి వెళ్లడం ఇది మూడోసారి కావడం విశేషం. 2006లో, 2012లో అంతరిక్ష ప్రయాణం సాగించారు. 2012లో అంతరిక్షంలో ట్రయథ్లాన్ పూర్తిచేసిన తొలి మహిళగా రికార్డుకెక్కారు. వెయిట్ లిఫ్టింగ్ మెషీన్ సాయంతో శూన్య వాతావరణంలో ఈత కొట్టారు. ట్రెడ్‌మిల్‌పై పరుగెత్తారు. 2007లో ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ నుంచి బోస్టన్ మారథాన్ పూర్తిచేశారు. అమెరికా నావికాదళంలో పనిచేసిన సునీతా విలియమ్స్‌ను నాసా 1998లో ఎంపిక చేసి వ్యోమగామిగా శిక్షణ ఇచ్చింది. బోయింగ్ క్రూ ఫ్లైట్ టెస్టు మిషన్ చాలా ఏళ్లు వాయిదా పడింది. స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్ అభివృద్ధిలో కొన్ని అటంకాలు తలెత్తడమే ఇందుకు కారణం. ఎట్టకేలకు స్పేస్‌క్రాఫ్ట్ సిద్ధమైంది. బోయింగ్ కంపెనీ డెవలప్ చేసిన మొట్టమొదటి అంతరిక్ష ప్రయోగం వాహనం స్టార్‌లైనర్ కావడం విశేషం. ఎలాన్ మస్క్ స్థాపించిన స్పేస్ ఎక్స్ సంస్థ ఇలాంటి అంతరిక్ష ప్రయాణ వాహనాలు తయారు చేసే తొలి ప్రైవేట్ సంస్థగా రికార్డుకెక్కింది. తాజా ప్రయోగంతో రెండో ప్రైవేట్ సంస్థగా బోయింగ్ కంపెనీ రికార్డు సృష్టించింది.


సునీత, విల్‌మోర్

తొమ్మిది మంది పర్వతారోహకుల దుర్మరణం

మృతులంతా కర్ణాటకవాసులే

బెంగళూరు: ఉత్తరాఖండ్‌లో పర్వతారోహణకు వెళ్లిన కర్ణాటకకు చెందిన తొమ్మిది మంది పర్వతారోహకులు ప్రాణాలు కోల్పోయారు. తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితులే వారి ప్రాణాలు తోడేశాయని ఉత్తరాఖండ్ జిల్లా మేజిస్ట్రేట్ మెహర్బాన్ సింగ్ బిష్త్ చెప్పారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం 18 మంది కర్ణాటకకు చెందిన ట్రెక్కీలు, ఒక మహారాష్ట్ర వ్యక్తి, ముగ్గురు గైడ్‌లతో కూడిన 22 మంది సభ్యుల ట్రెక్కింగ్ బృందాన్ని మనేరీకి చెందిన హిమాలయన్ వ్యూ ట్రెక్కింగ్ ఏజెన్సీ ట్రెక్కింగ్‌కు పంపింది. ఉత్తరాఖండ్‌లోని సహస్రతల్ సరస్సు ప్రాంతానికి చేరుకోగానే దారి తప్పి ప్రతికూల వాతావరణంలో చిక్కుకుపోయారు. జాడ గల్లంతైన వారిలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. భారత వాయుసేన, విపత్తు స్పందన దళం రంగంలోకి దిగి మిగిలిన 13 మందిని కాపాడాయని రెవిన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి రష్మీ మహేశ్ చెప్పారు. మృతుల వివరాలను వెల్లడించలేదు.

ఏకంగా 280 కొత్త ముఖాలు

న్యూఢిల్లీ: పద్దెనిమిదో లోక్‌సభలో ఏకంగా 280 మంది ఎంపీలు మొదటిసారిగా దిగువసభకు ఎన్నికైన వారున్నారు. ఇందులో మాజీ సీఎంలు, సినీ తారలు, వారసులు, హైకోర్టు మాజీ జడ్జి తదితరులున్నారు. అత్యధికంగా 80 లోక్‌సభ స్థానాలున్న ఉత్తరప్రదేశ్ నుంచి ఏకంగా 45 కొత్తముఖాలు కనిపించనున్నాయి. వీరిలో టీవీ రాముడు అరుణ్ గోవిల్, జెయింట్ కిల్లర్ కిశోరీలాల్ శర్మ, దళిత హక్కుల ఉద్యమకారుడు చంద్రశేఖర్ ఆజాద్ తదితరులున్నారు. మహారాష్ట్రలో 48 స్థానాలుండగా 33 మంది తొలిసారిగా ఎంపీలుగా గెలిచారు. స్కూల్ టీచర్ భాస్కర్ భాగ్రే ఎన్సీపీ (పవార్) తరఫున ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం డిండోరి నుంచి గెలుపొందారు. పీయూష్ గోయల్ కూడా లోక్‌సభకు రావడం ఇదే తొలిసారి. మాజీ ముఖ్యమంత్రులు నారాయణ్ రాణే (మహారాష్ట్ర), త్రివేంద్ర సింగ్ రావత్ (ఉత్తరాఖండ్), మనోహర్‌లాల్ ఖట్టర్ (హరియాణా), బిప్లవ్‌కుమార్ దేవ్ (త్రిపుర), జితిన్‌రామ్ మాంఝి (బిహార్), బస్వరాజ బొమ్మై (కర్నాటక), జగదీశ్ షెట్టర్ (కర్నాటక), చరణ్‌జిత్ సింగ్ చన్నీ (పంజాబ్)లు తొలిసారిగా దిగువసభలో అడుగుపెట్టనున్నారు. సినీ తారల్లో సురేష్ గోపి (త్రిసూర్), కంగనా రనౌత్ (మండి)లు తొలిసారి నెగ్గినవారే. రాజకుటుంబీకుల్లో ఛత్రపతి సాహు (కొల్హాపూర్), యదువీర్ కృష్ణదత్త చామరాజ వడయార్ (మైసూర్), కీర్తి దేవి దేబ్‌బర్మన్ (త్రిపుర ఈస్ట్)లు, ఎన్నికలకు ముందు హైకోర్టు జడ్జి పదవికి రాజీనామా చేసి బీజేపీ టికెట్‌పై పశ్చిమబెంగాల్‌లోని తమ్లుక్ నుంచి పోటీ చేసిన గెలిచిన అభిజిత్ గంగోపాధ్యాయ్‌లు మొదటిసారి ఎంపీలుగా గెలిచిన వారే.

ముస్లిం ఎంపీలు 24 మంది

నూతన లోక్‌సభకు 24 మంది ముస్లిం ఎంపీలు ఎన్నికయ్యారు. మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్ (టీఎంసీ), అసదుద్దీన్ ఓవైసీ, అస్సాంలో 10 లక్షల పైచిలుకు మెజారిటీతో నెగ్గిన కాంగ్రెస్ అభ్యర్థి రకీబుల్ హుస్సేన్‌లు ఉన్నారు. ఈసారి మొత్తం 78 మంది ముస్లిం అభ్యర్థులు పోటీచేయగా 24 మంది గెలిచారు. కిందటి లోక్‌సభలో 26 మంది ముస్లిం ఎంపీలు ఉండగా.. ఈసారి వారి సంఖ్య రెండు తగ్గింది. కాంగ్రెస్ నుంచి అత్యధికంగా ఏడుగురు ముస్లిం ఎంపీలు ఎన్నికకాగా, తృణమూల్ కాంగ్రెస్ నుంచి ఐదుగురు, సమాజ్‌వాది నుంచి నలుగురు, ఇండియన్ ముస్లిం లీగ్ నుంచి ముగ్గురు ముస్లింలు ఎంపీలుగా గెలిచారు.

సాక్షి కరీంనగర్

గురువారం । 6 । జూన్ । 2024



రాజన్న సన్నిధిలో మాసశివరాత్రి

వేములవాడ: రాజన్న సన్నిధిలో బుధవారం మాసశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.



తెగుళ్ల నివారిణి ట్రైకోడర్మా

పంటలను ఆశించే తెగుళ్లను అతి తక్కువ ఖర్చుతో నియంత్రించే పద్ధతులకు జీవ నియంత్రణ ప్రయోగశాల శ్రీకారం చుట్టింది.

8లో▸

గరిష్టం/కనిష్టం
36.0/28.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



పర్యావరణ దినోత్సవంలో జడ్జి వెంకటేశ్ తదితరులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం కరీంనగర్‌లోని స్వధార్ హోమ్‌లో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ, చెట్లు కార్బన్‌డైయాక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్‌ను అందిస్తాయని పేర్కొన్నారు. ప్రతి మనిషి ఒక మొక్క నాటి పర్యావరణాన్ని రక్షించాలన్నారు. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులకు మనం చెట్లను నిర్లక్ష్యం చేయడమే కారణమన్నారు. కార్యక్రమంలో లీగల్ హెడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్, స్వధార్ హోమ్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ విధ్వంసంతో వాతావరణ మార్పులు



జ్ఞాపిక స్వీకరిస్తున్న కెప్టెన్ బుర్ర మధుసూదన్‌రెడ్డి

కరీంనగర్‌సిటీ: పర్యావరణ కాలుష్యంతో ప్రతికూల వాతావరణ మార్పులు ఏర్పడి మానవాళి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయని కెప్టెన్ డా. బుర్ర మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం శ్రీనగర్ పట్టణంలోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కశ్మీర్ సైన్స్ విభాగాలు సంయుక్తంగా నిర్వహించిన పర్యావరణ సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఐరాస సూచించిన ప్రపంచ పర్యావరణ దినం–2024 నినాదంగా 'మన భూమి, మన భవిష్యత్'ను తీసుకొని విస్తృత ప్రచారం చేయాలని విద్యావేత్తలు, యువతకు సూచించారు. అపరిమితంగా ఎరువులు, పురుగు మందుల వాడకంతో రానున్న రోజుల్లో సాగు నేలలు బీడుభూములుగా మారనున్నాయని హెచ్చరించారు. పలురకాల విష కాలుష్యాలతో పర్యావరణ విచ్ఛిన్నం ఇలాగే కొనసాగితే పేదరికం, కరువు కాటకాలు, అనారోగ్యాలు, ఆహార అభద్రత, అశాంతి, భూతాపం పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రతీ పౌరుడు బాధ్యతగా నిత్యం పర్యావరణ దినం అనుకొని రాబోయే తరానికి నివాసయోగ్య భూమిని అందించే ప్రయత్నాలు చేయాలని కోరారు. కశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య రవీంద్రనాథ్ మాట్లాడుతూ, అభివృద్ధి పేరిట పర్యావరణానికి హాని కలిగించకుండా ఐరాస సూచనల మేరకు సుస్థిరాభివృద్ధి దిశగా గ్రీన్ వ్యవస్థలతో ప్రగతి అడుగులు పడేలా మన చర్యలుండాలని తెలిపారు. ఈసందర్భంగా మధుసూదన్‌రెడ్డిని వైస్ చాన్స్‌లర్ మెమొంటోతో సన్మానించారు. లైఫ్ సైన్సెస్ డీన్ ఆచార్య హమీద్‌దర్, బాటనీ ప్రొఫెసర్ అజ్రా, ఎన్‌జీవో నిర్వాహకులు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

'బండి'కి మంత్రి పదవి ఇవ్వాలి



కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్ నుంచి వరుసగా రెండోసారి రికార్డు విజయం సాధించిన బండి సంజయ్‌కుమార్‌కు కేంద్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్ కోరారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన సంజయ్ గెలుపుతో సంఘాల్లో ఆత్మస్థైర్యం పెరిగిందన్నారు. బుధవారం పలు బీసీ సంఘాల నాయకులు ఎంపీని కలిసి సన్మానించారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించి, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ, జనాభా ప్రకారం బడ్జెట్‌లో కేటాయింపులు చేసేలా ఒత్తిడి తేవాలని ఈ సందర్భంగా సంజయ్‌ని కోరారు.

క్వింటాల్ పత్తి రూ.7,300



వేలం పాటలో పాల్గొన్న వ్యాపారులు

జమ్మికుంట: జమ్మికుంట పత్తి మార్కెట్‌లో బుధవారం క్వింటాల్ పత్తి రూ. 7,300 పలికింది. గురువారం అమావాస్య కావడంతో సెలవు ఉంటుందని, శుక్రవారం క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని కార్యదర్శి గుగూలోతు రెడ్డి నాయక్ తెలిపారు.

తేడా ఎక్కడ?



- ఎవరి లెక్కలు వారివే..
- ఓటమిపై బీఆర్ఎస్, కాంగ్రెస్ అంతర్మథనం
- రెండు ఎంపీ సెగ్మెంట్లలో కమల వికాసం
- జగిత్యాల, వేములవాడలో మోదీ సభల ప్రభావం
- పెద్దపల్లిలోనూ గట్టి పోటీ ఇచ్చిన బీజేపీ
- జాప్యమే ఓటమికి కారణమంటున్న కరీంనగర్ కాంగ్రెస్
- ఉద్యమ జిల్లాలో మూడో స్థానంలో కారు పార్టీ

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

పార్లమెంట్ ఎన్నికలు ముగిశాయి. మూడు పార్లమెంటు సెగ్మెంట్లలో విస్తరించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీజేపీ తన రెండు సిట్టింగ్ స్థానాలను నిలబెట్టుకోగా, కొత్తగా కాంగ్రెస్ పెద్దపల్లి స్థానంలో పాగా వేసింది. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ఎంతో కీలకమైన కరీంనగర్ సెగ్మెంట్‌లో ఓటమిపై ఇటు కాంగ్రెస్, అటు బీఆర్ఎస్ తీవ్ర అంతర్మథనంలో పడ్డాయి. ఉద్యమానికి ఊపిరి పోసిన గడ్డపై మూడోస్థానానికి పరిమితవడాన్ని బీఆర్ఎస్ వర్గాలు జీర్ణించుకోలేక పోతుండగా, రాష్ట్రమంతా హస్తం హవా వీస్తున్న వేళ.. కరీంనగర్, నిజామాబాద్‌లలో ఆశించిన ఫలితాలు రానందుకు కాంగ్రెస్ పార్టీ మదనపడుతోంది. తేడా ఎక్కడ జరిగిందన్న విషయంపై ఉమ్మడి జిల్లా నేతలు లెక్కలు వేస్తున్నారు.

బీఆర్ఎస్‌పై కాంగ్రెస్, బీజేపీ ఎదురుదాడి..

ఉద్యమ పార్టీ బీఆర్ఎస్‌కు ఉమ్మడి కరీంనగర్ పుట్టినిల్లు. అలాంటి కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్‌లలో ఆ పార్టీకి ప్రతికూల ఫలితాలు వచ్చాయి. అది కూడా మూడోస్థానం. అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ మరింత బలహీనపడిందని పార్లమెంట్ ఫలితాలే చెబుతున్నాయి.. మేడిగడ్డ బరాజ్ కుంగిపోవడం అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఇబ్బందికరంగా మారింది. ఎన్నికల అనంతరం ఫోన్ ట్యాపింగ్ కేసు వెలుగుచూడటం ఇరకాటంలో పడేసింది. ఈ అంశాలపై బీజేపీ, కాంగ్రెస్ చేసిన ఎదురుదాడిని బీఆర్ఎస్ తిప్పికొట్టలేదన్న విమర్శలున్నాయి.

- కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ స్థానికేతరుడంటూ బీజేపీ, కాంగ్రెస్ అటాక్ చేశాయి. ఫలితంగా ఒకప్పుడు 2.05 లక్షల మెజారిటీతో గెలిచిన ఆయన ఇప్పుడు కేవలం 2.80 లక్షల ఓట్లకు పరిమితమయ్యారు.
- అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన కొప్పుల ఈశ్వర్‌ను పెద్దపల్లి పార్లమెంట్ బరిలో నిలిపిన కారు పార్టీకి ఇక్కడా పరాభవం తప్పలేదు. ఇక్కడ కాంగ్రెస్ పాగా వేసింది. పార్లమెంట్ పరిధిలో ఎక్కడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లేకపోవడం, కాళేశ్వరం ప్రాజెక్టు ఈ సెగ్మెంట్ పరిధిలోనే ఉండటం కూడా ఆ పార్టీకి ప్రతికూలంగా మారింది.
- ఇక, నిజామాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేసిన బాజిరెడ్డి గోవర్ధన్ కూడా ఓడిపోయారు. కోరుట్ల, జగిత్యాలలో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

ఆలస్యమే కారణమా?

- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు పార్లమెంట్ ఎన్నికల్లో మంచి ప్రదర్శన కనబరిచారు. తన అభ్యర్థిత్వాన్ని ఆలస్యంగా ప్రకటించినా ప్రచారంలో దూసుకెళ్లారు. గత ఎన్నికలతో పోల్చినపుడు 1.80 లక్షల ఓట్లు అదనంగా సాధించడమే ఇందుకు నిదర్శనం. ఆయన అభ్యర్థిత్వాన్ని మరికాస్త ముందు ప్రకటిస్తే మరింత మెరుగ్గా రాణించి ఉండేవారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.
- పెద్దపల్లిలో గడ్డం వంశీకృష్ణ 4.75 లక్షల ఓట్లతో సత్తా చాటారు. తాత, తండ్రి తర్వాత మూడో తరం కూడా అదే స్థానం నుంచి గెలిచి, రికార్డు దక్కించుకున్నారు.
- నిజామాబాద్ నుంచి పోటీ చేసిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఓటమిపై పార్టీ శ్రేణులు నిరాశ చెందాయి. 4,83,077 ఓట్లు సాధించినా ఆయన విజయానికి లక్షకు పైగా ఓట్ల దూరంలోనే ఆగిపోవాల్సి వచ్చింది.

బీజేపీలో జోష్..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీజేపీ జోష్ కనిపించింది. సిట్టింగ్ స్థానాలైన కరీంనగర్, నిజామాబాద్‌లను తిరిగి కైవసం చేసుకుంది. అదే సమయంలో పెద్దపల్లి స్థానంలో గెలిచినంత పని చేసింది. ఈ మూడు స్థానాల్లో బీజేపీ ప్రదర్శనకు కారణం ఎన్నికల సమయంలో మోదీ జగిత్యాల, వేములవాడ సభలే. కేడర్‌లో జోష్ నింపడంలో బీజేపీ అధిష్టానం సక్సెస్ అయ్యింది.

- జీవన్‌రెడ్డి పోటీకి దిగడంతో ఆరంభంలో నిజామాబాద్‌లో ఆందోళన కనిపించినా.. క్రమంగా సెగ్మెంట్‌ను బీజేపీ తన చేతుల్లోకి తీసుకుంది. ఫలితంగా సిట్టింగ్ ఎంపీ అర్వింద్ రెండోసారి విజయం సాధించారు.
- ఇక, పెద్దపల్లిలో బీజేపీ అనూహ్య ఫలితాలు సాధించింది. గోమాసె శ్రీనివాస్ 3.44 లక్షల ఓట్లు సాధించి, అందరి దృష్టిని ఆకర్షించారు. ఒక దశలో గెలుస్తారన్న ప్రచారం జరిగింది. మొత్తానికి కాంగ్రెస్‌కు ప్రతీ రౌండ్‌లో గట్టి పోటీ ఇచ్చారు.
- కరీంనగర్‌లో బండి సంజయ్ 2.25 లక్షల ఓట్ల మెజారిటీలో సరికొత్త రికార్డు సృష్టించారు. ప్రత్యర్థులిద్దరూ ఓసీలవడం, బీసీల ఓటు బ్యాంకు కలిసి వచ్చిందని పార్టీ శ్రేణులు అంటున్నాయి.

బీఆర్ఎస్ ఓట్లు ఎటు పడ్డట్టు?

ఉమ్మడి జిల్లాలోని పార్లమెంట్ సెగ్మెంట్లలో రెండు బీజేపీ, ఒకటి కాంగ్రెస్ కైవసం చేసుకున్నాయి. 2019 ఎన్నికల ఫలితాలను, ప్రస్తుత ఫలితాలతో పోల్చినప్పుడు కాంగ్రెస్, బీజేపీ ఓట్లు పెరిగి, బీఆర్ఎస్ ఓట్లు అదే స్థాయిలో పడిపోయాయి. బీఆర్ఎస్‌కు గత ఎన్నికల్లో ఓటేసిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఈసారి కాంగ్రెస్ పక్షం వహించారని, బీసీలు, అగ్రవర్ణాలు బీజేపీ వైపు మళ్లారని జిల్లా రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. 2019, 2024 అసెంబ్లీ ఎన్నికల ఓట్లను పరిశీలించినపుడు బీజేపీ, కాంగ్రెస్‌లకు ఓట్లు అనూహ్యంగా పెరిగిన విషయం తేటతెల్లమవుతుంది. కారు పార్టీ ఓట్లను ఈ రెండు పార్టీలు పంచుకున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

పకడ్బందీగా గ్రూప్–1 ప్రిలిమ్స్



చామనపల్లిలో మొక్కకు సపోర్టుగా కర్ర కడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్/కరీంనగర్ రూరల్: గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అభ్యర్థులు ఈ నెల 9న ఉదయం 9 గంటల వరకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. బయోమెట్రిక్ హాజరు విధానం ఉంటుందని, 10 గంటలకు కేంద్రాల గేట్లు మూసివేస్తారని వివరించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్షకు రెండు రోజుల ముందే సెంటర్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ మాట్లాడుతూ, కేంద్రాల్లో సీసీ కెమెరాలు సరిగా పని చేస్తున్నాయో లేదో ఒకరోజు ముందే చూసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, కొండగట్టు జేఎన్టీయూ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కాశీచరణ్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కరీంనగర్ మండలం చామనపల్లిలో అమృత్ సరోవర్ వద్ద మొక్కలు నాటారు. పర్యావరణ రక్షణకు మహిళలు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్నారు. కుక్కలు, కోతులపై దయచూపి తగిన ఆహారం అందించాలని కోరారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ మాట్లాడుతూ, గ్రామాల్లో విస్తృతంగా మొక్కల పెంపకం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మయ్య, డీఆర్‌డీవో శ్రీధర్, ఏపీడీ కృష్ణ, డీపీవో రవీందర్, ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీవో శోభారాణి, ఎంఈవో మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌కు గ్రీన్ పురస్కార్



అవార్డు స్వీకరిస్తున్న ఎంపీవో కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మహేందర్‌రావు

తిమ్మాపూర్(మానకొండూర్): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి పలు సంస్థలు, పంచాయతీలు, ఆస్పత్రులకు అవార్డులు ప్రకటించింది. ఈ సందర్భంగా జిల్లాలోని తిమ్మాపూర్ ఉత్తమ గ్రీన్ పంచాయతీగా ఎంపికైంది. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పర్యావరణ విభాగ అధికారి వాణీప్రసాద్ తదితరుల చేతుల మీదుగా తిమ్మాపూర్ ఎంపీవో కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మహేందర్‌రావు అవార్డు స్వీకరించారు. వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించడంతో అవార్డు వచ్చిందని తెలిపారు. తడి, పొడి చెత్త నిర్వహణ, వర్మి కంపోస్టు తయారీ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సేకరణకు కృషి చేస్తున్నామని వివరించారు.

అధికారుల సహకారంతో..

తిమ్మాపూర్ గ్రామంలో వ్యర్థాల నిర్వహణ, పచ్చదనం పెంపు కోసం కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్, ఎంపీవో, డీఎల్‌పీవో, డీఆర్డీవో ప్రత్యేక చొరవచూపారు. ప్రత్యేకాధికారి, ఎంపీడీవో విజయ్‌కుమార్ పర్యావరణంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చారు. ఇలా సమష్టి కృషితో తిమ్మాపూర్‌కు పురస్కారం దక్కింది.

కంగ్రాట్స్ మేడం



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

కరీంనగర్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించిన కలెక్టర్ పమేలా సత్పతిని ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ప్రశంసించారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ధ్యేయంగా ఓటర్లలో చైతన్యం కల్పించడంతో పాటు పోలింగ్ శాతం పెరిగేలా కృషి చేశారని కొనియాడారు. ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వర్తించిన జిల్లా అడ్మినిస్ట్రేషన్‌కు ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా స్వేచ్ఛగా పోలింగ్ జరిగేలా చర్యలు తీసుకున్న యంగ్ అండ్ డైనమిక్ ఆఫీసర్ సీపీ అభిషేక్ మహంతికి, జిల్లా అధికారులకు, శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వాములైన ప్రతి పోలీసు ఉద్యోగికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల విజయవంతంలో ప్రతి ఉద్యోగి పాత్ర కీలకమని ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు లక్ష్మణరావు, రాగి శ్రీనివాస్, కిరణ్‌కుమార్, సర్దార్ హర్మిందర్‌సింగ్, రాజేశ్ భరద్వాజ్, నేరేళ్ల కిషన్, గూడ ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్వరరావు, సబిత, సునీత, సేవ్యా నాయక్, జీవన్‌రెడ్డి, టీజీవో నాయకులు మడిపల్లి కాళిచరణ్‌గౌడ్, గడ్డం సుధాకర్, అజయ్‌కుమార్, మనమీత్‌సింగ్, లవ కుమార్, రజినీకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ ఉంటేనే దుకాణం

- పురుగుమందులు, ఎరువుల డీలర్లకు ఇక తప్పనిసరి
- 15వరకు దరఖాస్తులకు గడువు



కరీంనగర్ అర్బన్: దుకాణాల్లో విరామం లేకుండా గడిపే డీలర్లు తరగతి గదిలో కూర్చోవాల్సిందే. ఇక విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు లెక్కలతో కుస్తీ పట్టేవారంతా నిపుణుల బోధనలు వినాల్సిందే. ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఆదేశాల ప్రకారం ప్రతీ డీలర్ వ్యవసాయ శాఖ నుంచి డీఏఈఎస్ఐ డిప్లొమా కోర్సు ధ్రువీకరణ పత్రం పొందాల్సిందేనని స్పష్టం చేసింది. లేదంటే వారికి విక్రయాలు చేసే అవకాశం ఉండదు. కట్టుదిట్టమైన శిక్షణ.. తదుపరి డిప్లొమా కోర్సు ధ్రువీకరణ పత్రం, ఆపై రైతులకు విక్రయిస్తున్న వాటిపై నిఘా వంటి ప్రత్యేక కార్యాచరణ ఉండనుంది. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) నేతృత్వంలో డిప్లొమా కోర్సు నిర్వహించనున్నారు. గతంలో జమ్మికుంట కేవీకేలో పలువురు డీలర్లకు డిప్లొమా కోర్సు శిక్షణ జరగగా ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలను సవరించింది. రైతు శిక్షణ కేంద్రంలో తర్ఫీదు ఇచ్చి ధ్రువీకరణ పత్రం ఇవ్వనున్నారు. డీలర్లు ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని రైతు శిక్షణ కేంద్రం డీడీ ఛత్రునాయక్ పేర్కొన్నారు.

48 వారాలు.. నిపుణులతో బోధన

డీలర్లకు ఏడాది పాటు శిక్షణనివ్వనున్నారు. వారంలో ఒక రోజు ప్రతీ ఆదివారం తప్పనిసరిగా హాజరు కావాల్సిందే. కృషి భవన్‌ను శిక్షణకు వేదికగా నిర్ణయించారు. జిల్లా కేంద్రంలోనే డిప్లొమా కోర్సు శిక్షణ ఉండాలని కేంద్రం నిర్దేశించగా తదనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. రైతు శిక్షణ కేంద్రం ఏడీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. శిక్షణలో 48 ఆదివారాలు తరగతి గదిలో దుక్కుల నుంచి విత్తనాలు, సస్యరక్షణ చర్యలు తదితర సమగ్ర అంశాలను వివరించనున్నారు. మిగతా 8 వారాలు క్షేత్రస్థాయి శిక్షణ ఉండనుంది. వివరాలకు 81796 49595 నంబర్‌ను సంప్రదించాలని ఏడీ సూచించారు.

ఒక్కో బ్యాచ్‌కు 40మంది డీలర్లు

విత్తన క్రిమిసంహారక, ఎరువు విక్రయ డీలర్లకు డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ టు ఇన్‌పుట్ డీలర్స్ (డీఏఈఎస్ఐ) డిప్లొమా కోర్సుకు ఒక్కో బ్యాచ్‌కు 40 మందిని ఎంపిక చేయనున్నారు. లైసెన్స్ పొందిన డీలర్ల నుంచి మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కలెక్టరేట్ వ్యవసాయ శాఖలోని రైతు శిక్షణ కేంద్రం కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలి. డీలర్ల లైసెన్స్ ప్రతిని సంబంధిత ఏడీఏ ధ్రువీకరణతో సమర్పించాలి. దరఖాస్తుదారు తప్పకుండా పదో తరగతి ఉత్తీర్ణుడై ఉండాలి. ఎంపికైన అభ్యర్థులు రూ.10వేలు డీడీ చెల్లించి, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు అందజేయాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యతనివ్వనున్నారు.

పరీక్ష పాసైతేనే ధ్రువీకరణ

ఏదో మొక్కుబడిగా కాకుండా సమగ్ర అవగాహన కలిగేలా కోర్సును ఏర్పాటు చేశారు. కాలక్షేపం చేస్తే సదరు డీలరుకు ఇబ్బందులు తప్పవు. 48 వారాలు జరిగిన కోర్సుపై పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతీ అంశంపై పట్టు సాధించాల్సిందే. పరీక్షలో ఉత్తీర్ణుడైతేనే ధ్రువీకరణ పత్రం ఇవ్వనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శిక్షణ తరగతులు జరుగనుండగా భోజన వసతి కల్పించనున్నారు.

ఫెసిలిటేటర్ నియామకానికి గడువు 15

ఇందుకు ఫెసిలిటేటర్‌ను నియమించేందుకు ఆత్మ ప్రకటన విడుదల చేసింది. బీఎస్సీ(అగ్రికల్చర్) లేదా ఎంఎస్సీ అగ్రికల్చర్ చదివి వ్యవసాయశాఖ లేదా వ్యవసాయ విశ్వవిద్యాలయం లేదా కేవీకేలో 20 ఏళ్ల అనుభవం ఉన్నవారిని ఫెసిలిటేటర్‌గా నియమించాలని ప్రభుత్వం నిర్దేశించింది. వీరికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15 గడువు. ప్రతి ఆదివారం జరిగే శిక్షణలో శాస్త్రవేత్తలు, నిపుణులతో తరగతులు నిర్వహించడం వీరి విధి. త్వరలో శిక్షణ ప్రారంభిస్తామని, డీలర్ల నుంచి దరఖాస్తులు వస్తున్నాయని రైతు శిక్షణ కేంద్రం డీడీ ఛత్రునాయక్ వివరించారు.

బడిబాటకు వేళాయే

- నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదుపై దృష్టి

కరీంనగర్: కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల పోటీ తట్టుకొని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంపొందించడమే లక్ష్యంగా గురువారం నుంచి ఈనెల 19 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు మార్గదర్శకాలతో కూడిన షెడ్యూల్‌ను విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన విడుదల చేసినట్లు డీఈవో జనార్దన్‌రావు తెలిపారు. బడిబాట కార్యక్రమాన్ని ఎంఈవోలు, హెచ్ఎంలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, యువజన సంఘాలు, కమ్యూనిటీల సాయంతో విజయవంతం చేయాలని కోరారు.

జిల్లా యంత్రాంగం సన్నద్ధం

కలెక్టర్ నేతృత్వంలో డీఈవో, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో జిల్లా స్థాయిలో కార్యాచరణ రూపొందించాల్సి ఉంటుంది. వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన ఇటీవల సమావేశం నిర్వహించారు. పాఠశాలల ప్రారంభంలోపు ఉచిత దుస్తులు, పుస్తకాలు అందించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు క్షేత్రస్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

మండల స్థాయిలో..

మండల పరిషత్ అధికారులు, ఎస్సైలు, ఇతర వర్గాల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేస్తారు. ఏ రోజు ఏం చేయాలనే కార్యాచరణను మండల పరిధిలో ఎంఈవో రూపొందిస్తారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తారు. గ్రామ స్థాయిలో కమిటీలు, బడిబాటపై అవగాహన, ప్రచార కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు నిర్వహిస్తారు.

జిల్లాలో..

ప్రాథమిక పాఠశాలలు	424
ప్రాథమికోన్నత	75
ఉన్నత	152
మొత్తం విద్యార్థులు	42,322



ఒద్యారంలో పిల్లల నమోదుకు ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

విజయవంతం చేస్తాం

కలెక్టర్ ఆధ్వర్యంలో అందరి సమన్వయంతో బడిబాటను విజయవంతం చేసేందుకు కృషి చేస్తాం. మన అమ్మ ఆదర్శ కమిటీలతో నిర్వహిస్తున్న పనులను పూర్తి చేసేలా క్షేత్రస్థాయిలో ఆదేశాలు జారీ చేశాం. – జనార్దన్‌రావు, డీఈవో

జీవన పరిణామాలకు అక్షరరూపం 'మా ఊరి వాగు'

- పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌లాల్, కవులు

కరీంనగర్‌కల్చరల్: మానవ జీవన పరిణామాలకు అక్షరరూపం 'మా ఊరి వాగు' పుస్తకం అని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ అన్నారు. కవి కాందూరి వెంకటేశ్వర్లు రచించిన మా ఊరి వాగు పుస్తకాన్ని బుధవారం సాహితీగౌతమి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాటాడుతూ, జన్మనిచ్చిన ఊరి జ్ఞాపకాలతో పాటు సామాజిక చైతన్యాన్ని ప్రవహింపజేసిన కవిత్వంతో వచ్చిన వెంకటేశ్వర్లు భవిష్యత్‌లో గొప్ప కవిగా నిలబడాలని ఆకాంక్షించారు. కవి గంద్ర లక్ష్మణరావు మాట్లాడుతూ, ఉపాధ్యాయుడు, పురోహితుడు అయిన వెంకటేశ్వర్లు ప్రస్తుతం కవిగా పరిచయం కావడం సాహితీ లోకానికి ఆనందకరమని పేర్కొన్నారు. సాహితీ గౌతమి అధ్యక్షుడు నందిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కవులు కొత్త అనిల్‌కుమార్, డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ, కేఎస్ అనంతాచార్య, గాజుల రవీందర్, వైరాగ్యం ప్రభాకర్, కేవీ శర్మ, నీలగిరి అనిత, అన్నవరం దేవేందర్, మచ్చ హరిదాసు, బీవీఎన్ స్వామి, బొమ్మకంటి కిషన్, గంగుల శ్రీకర్, సంపత్‌కుమార్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి


బైరి రాజశేఖర్ (ఫైల్)

రాయికల్: రాయికల్ పట్టణానికి చెందిన బైరి రాజశేఖర్ (65) అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఎస్సై అజయ్ కథనం ప్రకారం.. రాజశేఖర్ కొద్దిరోజులుగా గుండె సంబంధిత బాధపడుతున్నాడు. కొంతకాలంగా కుటుంబంలో ఆస్తిపంపకాల విషయమై గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి 10గంటల సమయంలో పెద్ద కొడుకు నరేశ్ తండ్రి రాజశేఖర్ మధ్య వాగ్వివాదం జరిగి పెనుగులాడుకున్నారు. దీంతో రాజశేఖర్ అక్కడే కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నంలోనే మృతిచెందాడు. గుండెనొప్పితోనే చనిపోయి ఉండవచ్చని మృతుడి భార్య కమల ఫిర్యాదు చేసిందని ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

- ఏడాది క్రితం తండ్రి మృతి
- వీధిన పడిన కుటుంబం


సాయిరాజ్ (ఫైల్)

జగిత్యాలక్రైం: ఏడాది క్రితం కుటుంబ పెద్ద గుండెపోటుతో మృతిచెందాడు. అప్పటినుంచి ఆ ఇల్లాలు కొడుకును చూసుకుంటూ జీవిస్తోంది. ఇక చేతికందుతాడని భావించిన ఆ తల్లికి కొడుకు రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడటంతో ఆ కుటుంబంలో తీరని విషాదం చోటుచేసుకుంది. రాయికల్ మండలం చింతలూరు గ్రామానికి చెందిన కండ్లపల్లి సాయిరాజ్ (22) బుధవారం ఉదయం జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామ శివారులో బొలేరో వాహనాన్ని ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. అతని తండ్రి గంగాధర్ ఏడాది క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. సాయిరాజ్ గ్రామంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఈ నేపథ్యంలో పని నిమిత్తం జగిత్యాలకు వస్తుండగా పొరండ్ల శివారులో బొలేరో వాహనం ఎదురుగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో సాయిరాజ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు బొలేరో వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


సృజన్(ఫైల్)

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మేడిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని రాజేశ్వర్‌రావుపేటకు చెందిన బైరి సృజన్ (29), జంగిటి శ్రీకాంత్ బుధవారం స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై మెట్‌పల్లి వైపు వెళ్తున్నారు. అదే సమయంలో చింతలపేటకు చెందిన మహేశ్ తన కారులో మేడిపల్లి వైపు వస్తూ జాతీయ రహదారిపై ఢీకొన్నారు. ఈ ఘటనలో సృజన్, శ్రీకాంత్ తీవ్రం గాయపడ్డారు. స్థానికులు వారిని మెట్‌పల్లిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సృజన్ మృతి చెందాడు. శ్రీకాంత్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

తెగుళ్ల నివారిణి ట్రైకోడర్మా

- తక్కువ ఖర్చుతో పంటలకు మేలు
- కలెక్టరేట్‌లో విక్రయానికి సిద్ధం


కరీంనగర్ అర్బన్: పంటలను ఆశించే తెగుళ్లను తక్కువ ఖర్చుతో నియంత్రించే పద్ధతులకు జీవ నియంత్రణ ప్రయోగశాల శ్రీకారం చుట్టింది. ఇందులో విజయవంతమైన ట్రైకోడర్మ విరిడి, సూడోమోనాస్‌ను రైతులకు విక్రయించేందుకు చర్యలు చేపట్టింది. పంటలను కాపాడుకునేందుకు రసాయన మందుల కంటే జీవ నియంత్రణ పద్ధతి మేలు. రసాయన మందులతో పర్యావరణం కూడా దెబ్బతినే అవకాశం ఉంది. జీవనియంత్రణ ప్రయోగశాల ఎరువులతో పంట దిగుబడితోపాటు పర్యావరణానికీ మేలు చేస్తుందని కరీంనగర్ డీఏవో బత్తుల శ్రీనివాస్ తెలిపారు. అలాంటి ఎరువులను తయారు చేసిన ప్రయోగశాల ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతులకు సేవలందిస్తోంది.

విత్తన దశ నుంచే..

విత్తనం మొదలు.. కాతదశ వరకు పంటలకు రక్షణ కవచంగా ట్రైకోడర్మ శిలీంద్రం, సూడోమోనాస్ పని చేయనున్నాయి. మొక్కలకు హాని కలిగించే శిలీంద్రాలను నాశనం చేసే ట్రైకోడర్మ వరి, పత్తి, కంది, పెసలు, మినుము, పసుపు, కూరగాయల పంటల ను కాపాడుతుంది. ప్రజాతికి చెందిన జీవ నియంత్రణ శిలీంద్రం ట్రైకోడర్మ విరిడి. మొక్కలకు హాని చేసే శిలీంద్రాలపై పరాన్నజీవిగా నివసిస్తూ పంటలకు మేలు చేస్తుంది. సేంద్రియ పదార్థం ఉండే ఒక గ్రాము మట్టిలో వెయ్యి వరకు ట్రైకోడర్మ శిలీంద్రాలను ఉత్పత్తి చేయొచ్చు. ప్రతికూల పరిస్థితుల్లో క్లామిడో స్పోర్లుగా మారి ఎనిమిదేళ్లపాటు నేలలో నిల్వ ఉంటాయి.

పంటలపై పనితీరు..

హీన శిలీంద్ర మొక్కపై దాడి చేయకముందే వేర్లపై స్థావరం ఏర్పాటు చేసుకుని రక్షిస్తుంది. తెగుళ్ల కలిగించే శిలీంద్రాలు మొక్క వేర్లపై దాడికి పాల్పడితే మైకో పారసిటిజమ్ ప్రక్రియతో కైటినేజ్ అనే ఎంజైమ్‌ను స్రవించి శిలీంద్రాల కణకవచాన్ని కరిగించి జీవద్రవాన్ని బయటికి తెచ్చి నాశనం చేస్తుంది. ట్రైకోడర్మ శిలీంద్రం బయోసిస్ ప్రక్రియ ద్వారా విరిడిన్ యాంటీబయోటిక్ స్రవించి పంటలను రక్షిస్తుంది.



వ్యాధికారిక శిలీంద్రాలపై ట్రైకోడర్మా పెరగడం

విత్తన శుద్ధి.. పశువుల ఎరువుతో వృద్ధి

కిలో విత్తనాలకు 10 గ్రాములు ట్రైకోడర్మవిరిడి పొడిని కలిపి వాడుకోవాలి. 100 కిలోల పశువుల ఎరువులో 2కిలోల ట్రైకోడర్మ విరిడిని కలిపి చెట్టు నీడలో వారం మాగనివ్వాలి. శిలీంద్రం బాగా వృద్ధి చెంది ఆకుపచ్చ రంగులో మారిన తర్వాత పొలంలో చల్లుకోవాలి.

బహుళ ప్రయోజనం

నేలలో పంట మొక్కలకు సంక్రమించే కాండం కుళ్లు తెగులు, వడతెగులు, నారుకుళ్లు తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలైన పిథీయం, ఫైటాఫ్‌థోర, ప్రిజేరియం, మ్యాక్రోఫామినా, రైజోక్టోనియా, స్కిల్‌రోషియంను సమర్థవంతంగా అరికడుతుంది. ఈ ప్రక్రియ వల్ల పంటల సాగులో తెగుళ్ల నివారణ జరిగి దిగుబడిని పెంచుతుంది.



మొక్క వేర్లపై విరిడి శిలీంద్రం

రైతులకు విక్రయించేందుకు సిద్ధం

జీవనియంత్రణ ఉత్పత్తులైన ట్రైకోడర్మా విరిడి కిలోకు రూ.100, సూడోమోనాస్ కిలోకు రూ.150కి విక్రయించేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేసింది. కరీంనగర్ కలెక్టరేట్‌లోని రెండో అంతస్తులో జీవ ప్రయోగశాలలో అందుబాటులో ఉంచారు. విత్తనశుద్ధికి కిలో విత్తనానికి 8 నుంచి 10 గ్రాముల పొడి సరిపోతుంది. భూమి, మట్టి ద్వారా సంక్రమించే తెగుళ్ల నియంత్రణకు కిలో పొడిని 5 తట్టల మాగిన పశువుల పేడలో కలిపి వారం రోజులు మాగనిచ్చి మొక్కల వేర్లకు అందుబాటులో ఉండేలా పాదులకుగానీ సాలుకుగానీ వేసుకోవాలి. పంటపై పిచికారీ చేయడానికి లీటరు నీటికి 10 గ్రాములు సరిపోతుందని రైతు శిక్షణ కేంద్రం డీడీ ఛత్రునాయక్ వివరించారు.

దేవుడి ముందు నిలబడలేకపోయాను

- ఓటమి బాధ్యత మరింత పెంచింది
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి


మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: శ్రీరాముడు హిందువులకే కాదని, విశ్వమానవాళికి ఆరాధ్య దైవమని, అలాంటి రాముడి పేరు చెప్పి బీజేపీ ఓట్ల రాజకీయం చేయడంతో దేవుని ముందు నిలబడలేక ఓడిపోయానని కాంగ్రెస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఓటమి బాధించిందని, అయినా నైరాశ్యం చెందలేదని, ఓటమి తన బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. 2023తో పోలిస్తే కాంగ్రెస్‌కు ఓటు బ్యాంక్ పెరిగినప్పటికీ బీఆర్‌ఎస్ ఓట్లు బీజేపీకి మళ్లడంతో త్రిముఖ పోటీ కాస్త ద్విముఖ పోటీగా మారిందని, అదే కాంగ్రెస్ ఓటమికి దారితీసిందని వెల్లడించారు. మరో 9నెలలు ఎమ్మెల్సీగా ఉంటానని, ఆ తర్వాత ఏ పదవి, హోదా లేకున్నా చివరి శ్వాస వరకు ప్రజలకు సేవచేస్తానని అన్నారు. బీజేపీ మోదీని దైవాంశసంభూతుడిగా ప్రచారం చేసినా ఉత్తరాది ప్రజలు పట్టించుకోలేదన్నారు. అక్కడ మోదీ అంటే ఏంటో తెలిసిపోయిందని, త్వరలో దక్షిణాదిలోనూ మోదీకి మొండి చేయి తప్పదన్నారు. కాంగ్రెస్ సొంతంగా 99 స్థానాల్లో విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు. తనకు అండగా నిలిచిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, నాయకులు కొత్తమోహన్, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, బండ భాస్కర్‌రెడ్డి, చంద రాధాకిషన్, ముంజాల రఘువీర్, గుండ మధు, గుంటి జగదీశ్వర్ ఉన్నారు.

రూ.6.75లక్షల నకిలీ విత్తనాల పట్టివేత


నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: మంచిర్యాల జిల్లా నీల్వాయి పోలీసు స్టేషన్ పరిధిలో రూ.6.75లక్షల విలువైన 2.05క్వింటాళ్ల నకిలీ విత్తనాలు బుధవారం పట్టుకున్నామని రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు. కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంచిర్యాల జిల్లా నీల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారని అన్నారు. ఈక్రమంలో వేమనపల్లి ఫెర్రీ పాయింట్‌కి వెళ్లి ఎడ్లబండి ద్వారా తరలిస్తున్న 2.05 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నకిలీ విత్తనాలు రవాణా చేస్తున్న కోటపల్లి మండలానికి చెందిన కోలా సాయికిరణ్(23)ను మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో పట్టుకున్నట్లు వెల్లడించారు. పోలీసులను చూసి కోటపల్లికి చెందిన మరో నిందితుడు కోలా రమేశ్(50) పరారైనట్లు పేర్కొన్నారు. మహారాష్ట్రకు చెందిన మరో ఇద్దరు నిందితులు సుమిత్, జంగ సంపత్ ద్వారా పత్తి విత్తనాలను సరఫరా చేసినట్లు వివరించారు. ఎడ్లబండితో సహా నిందితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. నకిలీ విత్తనాలు, నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన నీల్వాయి ఎస్సై శ్యామ్‌పటేల్, కానిస్టేబుళ్లు రాజేందర్, రాజశేఖర్‌ను సీపీ అభినంది రివార్డు అందించారు. సమావేశంలో మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, నీల్వాయి ఎస్సై శ్యామ్‌పటేల్ పాల్గొన్నారు.

బాబ్లీ కేసు విచారణకు ఎమ్మెల్యేల హాజరు


కోర్టు ఎదుట ఎమ్మెల్యేలు విజయరమణారావు, గంగుల కమలాకర్, ప్రకాశ్‌గౌడ్

పెద్దపల్లిరూరల్: ఎమ్మెల్యేలు విజయరమణారావు, గంగుల కమలాకర్‌తోపాటు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే హన్మంతు షిండే మహారాష్ట్రలోని బిలోలి సెషన్స్ కోర్టుకు బుధవారం హాజరయ్యారు. 2010లో మహారాష్ట్ర ప్రభుత్వం గోదావరినదిపై బాబ్లీ ప్రాజెక్టు నిర్మించి దిగువకు నీళ్లురాకుండా చేసింది. దీనిని నిరసిస్తూ ఆనాటి ప్రజాప్రతినిధులు చంద్రబాబు ఆధ్వర్యంలో ఆందోళనకు దిగిన విషయాన్ని ఎమ్మెల్యే విజయరమణారావు గుర్తు చేశారు. అప్పటి నుంచి మహారాష్ట్ర కోర్టుకు హాజరై తమ వాదనలు వినిపిస్తున్నామని ఆయన వివరించారు.

నాలుగేళ్లకే నూరేళ్లు నిండాయా బిడ్డా..

- ఆర్టీసీ బస్సు ఢీకొని నాలుగేళ్ల బాలుడు మృతి
- మోరపల్లిలో విషాదం
- పరిహారం కోసం ఆందోళన


మానస్ (ఫైల్)

జగిత్యాలక్రైం: ఆటపాటలతో ఇంట్లో అల్లరిచేసే నాలుగేళ్ల బాలుడు అమ్మా.. పుచ్చకాయ కావాలి అంటూ డబ్బులు తీసుకుని కొనుక్కుని ఇంటికి తిరిగి వస్తుండగా ఆర్టీసీ బస్సు కింద పడి నుజ్జునుజ్జయిన సంఘటన జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామంలో బుధవారం విషాదం నింపింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మోరపల్లి గ్రామానికి చెందిన మామిడాల గంగన్న, లత దంపతులకు ఇద్దరు కుమారులు. గ్రామంలోకి పుచ్చకాయలు అమ్మేందుకు రాగా చిన్న కుమారుడు మానస్ (4) తల్లిని పుచ్చకాయ కావాలని కోరాడు. దీంతో తల్లి అతడికి డబ్బులిచ్చి పంపించింది. మానస్ పుచ్చకాయ కొనుక్కుని రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో మానస్ వెనుక టైరు కింద పడి నుజ్జునుజ్జయ్యాడు. అప్పటివరకు ఆడుకుంటూ అంతలోనే అనంతలోకాలకు చేరడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మోరపల్లి గ్రామస్తులు జగిత్యాల–రాయికల్ ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్, ఎస్సై సదాకర్ మోరపల్లికి చేరుకుని బాధిత కుటుంబంతో మాట్లాడి రాస్తారోకో విరమింపజేశారు. మానస్ తల్లి లత ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. మానస్ తండ్రి గంగన్న జీవనోపాధి కోసం సౌదీ అరేబియాలో ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


పరిహారం ఇప్పించాలని ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ ఆత్మహత్య


రవికుమార్ (ఫైల్)

కరీంనగర్‌క్రైం: ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ సన్నిధి రవికుమార్ (54) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కరీంనగర్‌లోని విద్యానగర్‌లో నివాసం ఉంటున్న సన్నిధి రవికుమార్ కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం ఉదయం విధులకు హాజరై 11 గంటలకు ఇంటికి వచ్చాడు. కాగా, ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పుతో పాటు పిల్లల ఉన్నత చదువుల కోసం డబ్బు సర్దుబాటు అవుతుందో కాదేమోనన్న భయంతో మనస్తాపానికి గురై ఇంట్లో కింది పోర్షన్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అలికిడి విన్న కుటుంబ సభ్యులు కిందికి వచ్చేసరికి ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య మౌనిక ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

'పారమిత' విద్యార్థుల ప్రతిభ


శివ


అయాన్

కొత్తపల్లి(కరీంనగర్): పద్మనగర్‌లోని పారమిత-క్షేత్ర సీబీఎస్‌ఈ పాఠశాల సీనియర్ సెకండరీ విద్యార్థులు నీట్–2024 ఫలితాల్లో ప్రతిభ కనబరిచినట్లు విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు తెలిపారు. బొమ్మిడి శివ 647, ఎండీ.అయాన్ 608 మార్కులు సాధించినట్లు చెప్పారు. వారిని పాఠశాల డైరెక్టర్లు అనుకర్‌రావు, రశ్మిత, వీయూఎం.ప్రసాద్, ప్రిన్సిపాల్ శ్రీకర్, సమన్వయకర్త ఆర్.నాగరాజులతో కలిసి బుధవారం అభినందించారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య


కార్తీక్ (ఫైల్)

జమ్మికుంట: పురుగు మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టౌన్ సీఐ రవి తెలిపిన వివరాలు.. మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన పొల్సాని కార్తీక్ (26)యువకుడు హైదరాబాద్‌లోని టెక్ మహేంద్ర కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కుటుంబ సభ్యులు తిరుమల దర్శనానికి రమ్మంటే సెలవు దొరకడంలేదన్నాడు. అనంతరం తండ్రి సంపత్‌రావుకు ఫోన్ చేసి రూ.50 వేలు కావాలని అడిగ్గా ఇంటికి వచ్చిన తర్వాత ఇస్తానని తెలపడంతో బుధవారం ఇంటికి వచ్చిన కార్తీక్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా చుట్టుపక్కల గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మొబైల్ పరిశీలించగా అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసిందని, తండ్రి సంపత్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

డ్రైవర్ నిర్లక్ష్యం.. రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు

- ప్రయాణికులకు తప్పిన ప్రాణాపాయం


చెట్లను ఢీకొని ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా రోడ్డు కిందకు బస్సు దూసుకుపోయిన ఘటన తంగళ్లపల్లి మండలం పద్మనగర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం సిద్దిపేట నుంచి వేములవాడ వెళ్తోంది. పద్మనగర్ గ్రామ శివారు పెట్రోల్ పంప్ వద్దకు చేరుకోగానే బస్సు ఉన్నట్టుండి రోడ్డుకు కిందివైపు చెట్లలోకి దూసుకెళ్లింది. చెట్లను ఢీకొడుతూ కొంతదూరం దూసుకెళ్లి నిలిచిపోయింది. బస్సులో ప్రయాణిస్తున్న 35 మంది ప్రాణభయంతో కేకలు వేశారు. అదృష్టవశాత్తు ఎవరికీ ప్రాణాపాయం కలగలేదు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లనే బస్సు ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆరోపించారు. కాగా బస్సు స్టీరింగ్ లాక్ కావడంతో ప్రమాదం సంభవించిందని డ్రైవర్ పేర్కొన్నాడు.బస్సు ప్రమాదంపై అటు ఆర్టీసీ అధికారులు, ఇటు పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

నీట్‌లో 'అల్ఫోర్స్' విద్యార్థుల ప్రభంజనం



ప్రతిభ చాటిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

కొత్తపల్లి(కరీంనగర్): నీట్–2024 ఫలితాల్లో కరీంనగర్, మహారాష్ట్రలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. కరీంనగర్‌లోని టైనీటాట్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఎస్.హేమంత్ 691, వి.హాసిని 671, డి.పూజిత 650, ఎస్.కౌశిక్ రెడ్డి 647, పి.అక్షర రెడ్డి 639, వి.శ్రీముఖి, మరియాసభ 619, ఎ.శ్రీవర్ధిని, ఎం.కమాలి కాప్రీతి 613, ఎస్.జ్ఞానద 604, ఎ.అమరేందర్ 598, బి.హాసిత 595, కె.శ్రీవిద్య 582, ఎండీ.అఫ్టాన్ ఖాన్ 579, ఎస్.సాయిప్రతిజ్ఞ 573, ఎం.ప్రతిమ 571, పి.శ్రీనాథ్ 566, షేక్ ఉమ్రా 561, తేజస్విని 560, మహీన్ నజ్మీన్ 560 మార్కులు సాధించారన్నారు. కె.సుహృద్‌రాఘున పీడబ్ల్యూడీ కేటగిరీలో జాతీయస్థాయిలో 675వ ర్యాంకు పొందాడని పేర్కొన్నారు. నీట్ కోచింగ్‌లో డాక్టర్స్–30 ప్రత్యేక ప్రోగ్రాం ద్వారా కోచింగ్ ఇచ్చిన రెండో సంవత్సరంలో అల్ఫోర్స్ విజయపరంపర కొనసాగిందన్నారు. 10 మంది విద్యార్థులు 600, ఆపై మార్కులు, 20 మంది 560, ఆపైన, 41 మంది 500, ఆపైన, 86 మంది 450, ఆపైన మార్కులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల అకుంటిత దీక్ష ఫలితంగా తమ విద్యాసంస్థలు విజయాలు సాధిస్తున్నట్లు తెలిపారు.

జర్మన్ భాష శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల: జర్మనీలోని టామ్‌కామ్ ఫెడరల్ ఎంప్లాయిమెంట్ ఏజెన్సీ మధ్య కొనసాగుతున్న 'ట్రిపుల్ విన్ సాధనర్సిస్'లో భాగంగా జర్మన్ రిక్రూట్ అయ్యే నర్సులకు జర్మన్ భాష శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రత్యేక స్క్రీనింగ్ ఎన్‌రోల్‌మెంట్ ప్రోగ్రాం జరుగుతుందని, శిక్షణకు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. జీఎన్‌ఎం, బీఎస్సీ పూర్తి చేసిన 21–36 ఏళ్ల మధ్య వయస్సు అభ్యర్థులు తెలంగాణలోని గుర్తింపు పొందిన కళాశాలల నుంచి నర్సింగ్, ఐసీయూ, బెరియాట్రిక్స్ /ఆర్థోపెడిక్స్ / సైకియాట్రీ/కార్డియాలజీ /నియోనాటల్ /సంకల్ వార్డు తదితర వాటిలో ప్రొఫెషనల్ క్లినికల్ పనిచేసిన అనుభవం ఉన్న వారు, జర్మన్ భాష నైపుణ్యాలు కలిగిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఇతర వివరాలకు 9908830438, 8915047600, 7032379064, 8499990104 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'శ్రీ చైతన్య' విద్యార్థుల విజయకేతనం


విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

కరీంనగర్: నీట్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు. ముజమ్మిల్‌ఖాన్ 633, సీహెచ్.చందన 533, అజ్మీరా రాజు 530, మిట్ట సిరివెన్నెల 524, కాలబోయిన అర్జున్ 517, రెశ్వంత్ రెడ్డి 510 మార్కులు, 400, ఆపైన 15 మంది విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. పరీక్షకు హాజరైన వారిలో 60 శాతం మంది అర్హత సాధించారన్నారు. వారిని బుధవారం అభినందించారు. అనునిత్యం పర్యవేక్షణ, నీట్ నిర్వహించే వరకు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపడం వల్లే ఇంతటి ఘన విజయం సాధ్యమైందని తెలిపారు. అన్ని పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు రాణిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. మునుముందు మరిన్ని విజయాలు సాధిస్తామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, డీన్ జగన్‌మోహన్ రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాధాకృష్ణ, మోహన్‌రావు, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జంతువుల ద్వారా అంటువ్యాధులు


మాట్లాడుతున్న డాక్టర్ ఉపేందర్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: జంతువుల సేవలో ఉండేవారికి అంటువ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని మెడికవర్ క్రిటికల్ కేర్ వైద్య నిపుణులు డాక్టర్ ఉపేందర్ రెడ్డి, ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు అన్నారు. వరల్డ్ ఎన్విరాన్‌మెంట్ డే ను పురస్కరించుకొని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం డీర్ పార్క్‌లో ఉద్యోగులు, సిబ్బందికి హెల్త్‌టాక్ ద్వారా జంతువుల నుంచి వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ, మానవ వ్యాధుల మాదిరిగానే జంతువులకూ అంటువ్యాధులు, నాన్ ఇన్ఫెక్షియస్ వ్యాధులు ఉంటా యన్నారు. ఇందులో రేబిస్ అత్యంత ప్రమాదకరమైనదని వివరించారు. రేబిస్ జంతువుల కాటు ద్వారా వ్యాపిస్తుందని, ఇది సోకకుండా ఉండాలంటే జంతువులు కాటేసిన వెంటనే వైద్యం చేయించుకోవాలని సూచించారు. టీకా కూడా అందుబాటులో ఉందని తెలిపారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరి గిన కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కర్ణాకర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ట్రినిటీ విద్యార్థుల విజయ ఢంకా



విద్యార్థిని అభినందిస్తున్న దాసరి మనోహర్‌రెడ్డి


బి.నిఖిల్


ఎం.శశాంక్


సయ్యద్ అలీ


ఆదిత్య ఆనంద్

కరీంనగర్: నీట్ ఫలితాల్లో ట్రినిటీ జూనియర్ కళాశాలల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఉత్తమ మార్కులు సాధించిన బి.నిఖిల్ 681, సయ్యద్ ముజకిర్ అలీ 676, ఎం.శశాంక్ 671, ఎ.ఆదిత్య 670, ఎ.కరణ్ సింగ్ 667, పి.సందీప్ కుమార్ 665 మార్కులు, ఆర్.అజిత్ కుమార్ 657, వివేక్ సిద్ధార్థ్ 655, ఎస్.మాళవిక 651, ముజమ్మిల్ ఖాన్ 633, వి.స్ఫూర్తి 599, జె.కీర్తన 582, వి.రాహుల్ 567, సహరిశ్ ఐమన్ 558, ఎన్.గంగశ్రీ 542, ఆర్. అలేఖ్య 538, ఎం. శ్రీజ 538, పి.ప్రణయ్ 537, సీహెచ్ విఘ్నేశ్ 536, ఆయేషా మహజబీన్ 535, ఆర్.ఆశ్లేష 532, పి. శ్రీదీప 523, హెచ్ కులకర్ణి 522, సీహెచ్ సాయిమోహిత్ రెడ్డి 507, ఎస్‌కే గౌస్‌పాషా 505 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాలల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ మరింత మెరుగైన ఫలితాల కోసం కృషి జరుగుతుందని తెలిపారు. సాధారణ విద్యార్థులతో పటిష్టమైన ప్రణాళికతో, ఒత్తిడి లేని విద్యా విధానంతో ర్యాంకులు సాధించడం వీలైందని చెప్పారు. మునుముందు మరిన్ని ఫలితాలు సాధిస్తామన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఫౌండర్ చైర్మన్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ట్రినిటీ కళాశాలల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అభినందించారు.

క్లుప్తంగా

'పది' సప్లిమెంటరీ పరీక్షకు 25 మంది గైర్హాజరు

కరీంనగర్: పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా బుధవారం ద్వితీయ భాషా పరీక్షకు జిల్లాలోని రెండు పరీక్ష కేంద్రాల్లో 25 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో జనార్దన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 33 మందికిగానూ 08 మందే వచ్చినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలను రెండు తనిఖీ బృందాలు, ఒక కేంద్రాన్ని తాను సందర్శించినట్లు పేర్కొన్నారు.

తాహెర్‌కొండాపూర్‌ను సందర్శించిన డీపీవో


సేంద్రియ ఎరువు తీసుకుంటున్న డీపీవో

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని తాహెర్‌కొండాపూర్‌ను బుధవారం డీపీవో రవీందర్ సందర్శించారు. జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీ విభాగంలో పచ్చదనం–పరిశుభ్రతలో జిల్లా నుంచి తాహెర్‌కొండాపూర్‌ను అధికారులు ఎంపిక చేశారు. ఈ మేరకు గ్రామంలోని నర్సరీ, వైకుంఠధామం, కంపోస్టు షెడ్డును ఆయన పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశమై, సౌకర్యాలపై ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మమతతో చర్చించారు.

సరస్వతి శిశుమందిర్ హైస్కూల్‌కు విరాళం


విరాళం ఇస్తున్న రమణాచారి దంపతులు

విద్యానగర్: కరీంనగర్‌లోని శ్రీసరస్వతి శిశుమందిర్ హైస్కూల్లో విద్యార్థుల సౌకర్యార్థం ఓ తరగతి గది నిర్మాణం కోసం రూ.8 లక్షలను నగరానికి చెందిన ఈఎన్‌టీ డాక్టర్ చక్రవర్తుల రమణాచారి–రజనీప్రియ దంపతులు బుధవారం స్కూల్ కమిటీకి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో శ్రీసరస్వతి విద్యాపీఠం పాలకమండలి సభ్యులు, కార్యదర్శి ఎలగందుల సత్యనారాయణ, పూర్వ విద్యార్థి బొల్లం మహేశ్, పాఠశాల అధ్యక్షుడు బల్మూరి కరుణాకర్‌రావు, కార్యదర్శి కోల అన్నారెడ్డి, ప్రధానాచార్యుడు రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం



విద్యానగర్: కృత్తికా నక్షత్రం పురస్కరించుకొని బుధవారం నగునూర్ దుర్గాభవానీ దేవాలయంలోని ఉమాసుతుడైన శ్రీవల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామివారికి ఫలపంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి, వేదపండితుడు పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు పవన కృష్ణ పూజలు చేశారు. ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గ సభ్యులు

కరీంనగర్‌రూరల్: నగునూరు గ్రామ రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బోకూరి లక్ష్మారెడ్డి, అధ్యక్షుడిగా కస్తూరి రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా దామరపల్లి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కుంభం తిరుపతిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా కస్తూరి కృష్ణారెడ్డి, కోశాధికారిగా దామరపల్లి మహేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా కొమ్మిడి మల్లయ్య, దామిడి అంజిరెడ్డి, దామరపల్లి కనకారెడ్డి, లక్ష్మీనారాయణ, భూపతిరెడ్డి, రాజు ఎన్నికయ్యారు.

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: విద్యుత్ అభివృద్ధి పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు మహిళా డిగ్రీ కళాశాల, కశ్మీర్‌గడ్డ, ముకరంపుర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ సుధీర్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తీగలగుట్టపల్లి పరిధిలోని విద్యారణ్యపురి రోడ్ నంబర్ 1, 2, 3 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని కరీంనగర్ రూరల్ ఏడీఈ రాజు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

ఎన్నికలు ముగిసె.. పాలన పట్టాలెక్కాలె

- గత 8 నెలల్లో 5 నెలలు అమలులో అసెంబ్లీ, పార్లమెంట్ ఎలక్షన్ కోడ్
- నిలిచిన అభివృద్ధి పనులు, పథకాలు
- నేటితో ముగియనున్న కోడ్
- హామీలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం కసరత్తు



కరీంనగర్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల యుద్ధం ముగిసింది.. ప్రజలు తమ అభిమాన నేతకు పట్టం కట్టారు.. మంగళవారం ఓట్ల లెక్కింపుతో ఈ విషయం తేలిపోగా గురువారం ఎలక్షన్ కోడ్‌కు తెరపడనుంది. వరుసగా ఎన్నికల కోడ్ అమలుతో అభివృద్ధి పనులతోపాటు ప్రజల పనులు అటకెక్కాయి. అసెంబ్లీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అక్టోబర్‌లో మొదలై, డిసెంబర్‌లో ముగిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన కొన్ని నెలల వరకు పాలకులు, అధికారులు పాలనపై దృష్టిసారించగా అంతలోనే సార్వత్రిక ఎన్నికల కోడ్ వచ్చింది. ఈ నెల 6న రాష్ట్రంలో అది కూడా ముగియనున్న నేపథ్యంలో ప్రభుత్వ పాలన మళ్లీ పట్టాలెక్కనుంది.

గతేడాది అక్టోబర్ నుంచి మొదలు..

రాష్ట్రంలో గతేడాది అక్టోబర్ నుంచి మొదలైన అసెంబ్లీ ఎన్నికల కోడ్ డిసెంబర్ 5 వరకు సుమారు 2 నెలలపాటు కొనసాగింది. అనంతరం లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మార్చి 16 నుంచి జూన్ 6 వరకు కోడ్ అమలవుతోంది. శాసనసభ ఎన్నికలు ముగిసిన తర్వాత 3 నెలలు మినహా మిగతా కాలం కోడ్ ఉంది. అసెంబ్లీ మొదలు లోక్‌సభ ఎలక్షన్లు ముగిసేవరకు సుమారు 8 నెలల్లో 5 నెలలు కోడ్ అమల్లో ఉండటంతో ప్రభుత్వం చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు నిలిచిపోయాయి.

నిధులున్నా.. ప్రగతి నామమాత్రమే

కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన కొన్ని రోజులకే అభివృద్ధి పనులు చేపట్టేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక నిధుల నుంచి శాసనసభ నియోజకవర్గాలకు రూ.10 కోట్ల చొప్పున మంజూరయ్యాయి. వీటిలో రూ.2 కోట్లను ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు, రూ.కోటిని తాగునీటి అవసరాలకు వినియోగించాలని ప్రభుత్వం సూచించింది. ఈ నిధులకు సంబంధించి పనులు అంచనాల దశలోనే ఉన్నాయి. ఎన్నికల సంఘం అనుమతితో తాగునీరు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన వంటి పనులు మాత్రమే కొనసాగుతున్నాయి. ఎన్నికల కోడ్ ముగియగానే ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేల పర్యవేక్షణలో పూర్తిస్థాయిలో పనులు జరగనున్నాయి.

నిలిచిన ప్రజావాణి..

ఉమ్మడి జిల్లా అధికార యంత్రాంగం ఎన్నికల క్రతువులో నిమగ్నమవడంతో ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం నిలిచిపోయింది. ప్రజా సమస్యలు పేరుకుపోయాయి. ఈ నెల రెండో వారం నుంచే వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆలోపే సాగునీటి, పారిశుధ్య పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే మంజూరైన పనులు బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా మందకొడిగా సాగుతున్నాయి.

హామీల అమలుకు కసరత్తు

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే కొన్నింటిని నెరవేర్చగా.. ఎన్నికల కోడ్ కారణంగా ప్రారంభానికి నోచుకోని సంక్షేమ పథకాలు పట్టాలెక్కాల్సి ఉంది. ఆగస్టు 15లోపు రైతులకు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇదివరకే ప్రకటించారు. పింఛన్ల పెంపు, కొత్త రేషన్‌కార్డుల జారీకి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఎన్నికల కోడ్ ముగియనుండటంతో పూర్తిస్థాయిలో అభివృద్ధి, సంక్షేమంపైనే సర్కారు దృష్టిసారించనుంది.

కలెక్టరేట్ పూర్తయ్యేనా?

గత ప్రభుత్వంలో అప్పటి మంత్రి గంగుల కమలాకర్ కరీంనగర్ నూతన కలెక్టరేట్‌కు శంకుస్థాపన చేశారు. 2021 డిసెంబర్ 29న రూ. 51 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించగా ఇప్పటికీ పూర్తవలేదు. పాత భవనాన్ని సగం వరకు కూల్చివేయగా వివిధ శాఖలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఏడాదిలోపే నూతన భవనాన్ని వినియోగంలోకి తేవాల్సి ఉంది. కానీ, బిల్లుల చెల్లింపులో జాప్యం, పర్యవేక్షణ లోపం వెరసి ప్రభుత్వ యంత్రాంగం ఇబ్బందులు పడుతోంది. ఎన్నికలు ముగిసిన క్రమంలో కలెక్టరేట్ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా పర్యవేక్షించడం అత్యవసరం.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలి


అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న డీడబ్ల్యూవో సరస్వతి, సీడీపీవో లక్ష్మీనారాయణ తదితరులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని ఎలబోతారం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీడబ్ల్యూవో ఎం.సరస్వతి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములవ్వాలని కోరారు. అనంతరం పర్యావరణ రక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో కిచెన్ గార్డెన్ కోసం కూరగాయల విత్తనాలు చల్లారు. కార్యక్రమంలో సీడీపీవో లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్ నిర్మల, పంచాయతీ కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు. అలాగే, గోపాల్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాల విద్యార్థినులకు పోటీలు

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నగునూరు సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ చేపట్టారు. ప్రిన్సిపాల్ సమత, వైస్ ప్రిన్సిపాల్ సుష్మ, ఏసీవో లలితా అశ్విని, లెక్చరర్లు శ్రీలత, గీతారాణి, జ్యోతిరెడ్డి, కవిత, రాధిక, స్వాతి తదితరులున్నారు.

'బోయినపల్లి'ని కలిసిన వొడితెల, చల్మెడ



వినోద్‌కుమార్‌తో మాట్లాడుతున్న సతీశ్‌కుమార్, లక్ష్మీనర్సింహారావు

కరీంనగర్: బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, వేములవాడ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఫలితాలపై చర్చించారు.

'అసెంబ్లీ ఎన్నికల్లోనే ముస్లిం ఓట్ల ప్రభావం'

విద్యానగర్: అసెంబ్లీ ఎన్నికల గెలుపోటముల్లో మాత్రమే ముస్లిం ఓట్ల ప్రభావం ఉంటుందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఉండదని ఎంఐఎం కరీంనగర్ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ పేర్కొన్నారు. పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఐదోసారి భారీ మెజారిటీతో గెలిచి, చరిత్ర సృష్టించారని తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో నరేంద్రమోదీ చరిష్మా కంటే బీసీ, ఓసీల మధ్య వర్గపోరు మాదిరిగా ఎన్నికలు జరిగాయన్నారు. ధర్మం పేరిట ఓటర్లను ఏకం చేసి, గెలవడంలో బీజేపీ సఫలీకృతమైందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ శ్రేణుల క్రాస్ ఓటింగ్‌తో ఆ పార్టీకి లాభం చేకూరిందన్నారు.

అనుమతి లేని కాలేజీలపై చర్య తీసుకోండి



డీఐఈవోకు, విద్యాశాఖ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: అనుమతి లేని ఇంటర్ కళాశాలలపై చర్య తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేశ్, మచ్చ రమేశ్ కోరారు. బుధవారం డీఐఈవో జగన్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి లేని కళాశాలల జాబితాను బహిర్గతం చేయాలని, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో సైన్స్ విద్యార్థులకు ల్యాబ్స్, ఆధునిక టెక్నాలజీకి అనుగుణంగా కంప్యూటర్స్ వంటి పరికరాలను అందుబాటులో ఉంచి, నాణ్యమైన విద్య అందేలా చూడాలన్నారు. ఏఐఎస్‌ఎఫ్ నగర కార్యదర్శి మామిడిపెల్లి హేమంత్, నాయకులు సందీప్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని స్కూళ్లను సీజ్ చేయాలి

సప్తగిరికాలనీ: జిల్లా వ్యాప్తంగా అనుమతి లేకుండా నడుస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని టీఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల లక్ష్మణ్ కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా విద్యాశాఖ సూపరింటెండెంట్ నర్సింహస్వామికి వినతి పత్రం అందించారు. జిల్లాలో అనుమతి లేకుండా, తోక పేర్లతో నడుస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లను సీజ్ చేయాలని, వాటి వివరాలను ప్రకటించాలన్నారు. ఆయా విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. జిల్లా యూత్ అధ్యక్షుడు దీకొండ కుమారస్వామి తదితరులున్నారు.

ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్

కరీంనగర్‌రూరల్: ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమికి నైతిక బాధ్యత వహించి, ఎమ్మెల్యే పదవికి గంగుల కమలాకర్ రాజీనామా చేయాలని రైతుబంధు సమితి కరీంనగర్ రూరల్ మండల మాజీ కో–ఆర్డినేటర్, కాంగ్రెస్ నాయకుడు కాశెట్టి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం తీగలగుట్టపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే కమలాకర్ బీఆర్‌ఎస్‌లోని సీనియర్ నాయకులను పట్టించుకోక పోవడం వల్లే పలువురు పార్టీని వీడినట్లు తెలిపారు. ఆయన బీజేపీతో చీకటి ఒప్పందం చేసుకొని, బీఆర్‌ఎస్ ఓటమికి పరోక్షంగా కారణమయ్యారని ఆరోపించారు. వినోద్‌కుమార్ ప్రజలకు ఎలాంటి సేవ చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రజా సంక్షేమానికి కృషి చేస్తోందని తెలిపారు. మాజీ ఉపసర్పంచ్‌లు మూల కృష్ణారెడ్డి, రాజిరెడ్డి, మాజీ వార్డు సభ్యులు నగేశ్, సత్యం, నాయకులు దామోదర్, వినయ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'నైతిక విజయం ఇండియా కూటమిదే'


మాట్లాడుతున్న వేణుగోపాల్

విద్యానగర్: పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమిదే నైతిక విజయమని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. బుధవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇండియా కూటమికి 300 సీట్లు వస్తాయని తాను చెప్పానని, అయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీవ్ర నిర్బంధం వల్ల 70 సీట్లు తారుమారయ్యాయని పేర్కొన్నారు. బలమైన ప్రతిపక్ష పాత్రను పోషించే స్థాయిలో కాంగ్రెస్ కూటమి ఉందన్నారు. ఇది ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. కేసీఆర్, కేటీఆర్‌ల అహంకారం వల్లే బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు కూడా రాలేదన్నారు. నాయకులు చంద్రయ్య, బాపురెడ్డి, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా గెలిచిన 'బండి'కి శుభాకాంక్షలు




బండి సంజయ్‌ని సన్మానించిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు, బీసీ ఐక్యవేదిక నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు

కరీంనగర్: ఎంపీగా రెండోసారి గెలుపొందిన బండి సంజయ్‌ని బీసీ సంక్షేమ సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో సన్మానించారు. వేంకటేశ్వర స్వామి ప్రసాదం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో బీసీ కులగణన చేపట్టేందుకు కృషి చేయాలని కోరారు. అలాగే, చట్టసభల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. వీటికి ఆయన సానుకూలంగా స్పందించి, బీజేపీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారని పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు రాచమల్ల రాజు, ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్‌చారి, యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీల గొంతు వినిపించాలి

కరీంనగర్ ఎంపీగా రెండోసారి గెలిచిన బండి సంజయ్‌ని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర కో–ఆర్డినేటర్ ఆరె దశరథం బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో బీసీల గొంతు వినిపించాలని కోరారు. వేదిక రాష్ట్ర కార్యదర్శి రాజేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త అశోక్, టౌన్ కో–ఆర్డినేటర్ జంగిలి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్‌ని కలిసేందుకు బుధవారం ఆయన కార్యాలయానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అఫ్సర్ పాషా, జనగాం జిల్లా అధ్యక్షుడు దశమంత్‌రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం, ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం, యాదవ, గౌడ, మున్నూరుకాపు, రజక, దళిత, బీసీ సంఘాల నాయకులు తదితరులు సంజయ్‌ని సన్మానించారు. సాయంత్రం ఆయన హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు.

బండి సంజయ్ పరామర్శ


నరేశ్‌ను పరామర్శిస్తున్న సంజయ్

కరీంనగర్‌టౌన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ చానల్ కెమెరామెన్ నరేశ్‌ను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ బుధవారం పరామర్శించారు. అతని తల, మెడ భాగంలో నరాలు దెబ్బతిన్నాయని, కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేదని తోటి కెమెరామెన్లు సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన బాధితుడి వద్దకు వెళ్లి, ధైర్యంగా ఉండాలని చెప్పారు. వైద్యానికి అయ్యే ఖర్చు తాను భరిస్తానని బాధిత కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. డాక్టర్ కిశోర్, డాక్టర్ పవన్, సాల్లు అజయ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



కరీంనగర్‌టౌన్: కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో బండి సంజయ్ రెండోసారి విజయం సాధించినందుకు నగరంలోని 17వ డివిజన్‌లో బీజేపీ శ్రేణులు బుధవారం సంబరాలు జరుపుకున్నాయి. టపాసులు పేల్చి, కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్ రెడ్డి, నరహరి లక్ష్మారెడ్డి, విష్ణుప్రసాద్‌రావు, చంద్రగిరి వేణు, లక్ష్మీరాజం, సాయికృష్ణ, ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నాన్‌టీచింగ్ వర్కర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న సమ్మయ్య

కరీంనగర్: మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్ నాన్ టీచింగ్ వర్కర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నాన్ టీచింగ్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. ఈపీఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, అధికారుల వేధింపులు అరికట్టాలని కోరితే గత ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో ఆశలతో కాంగ్రెస్ పార్టీకి కార్మిక లోకం మద్దతు తెలిపిందని, కొత్త ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉమ్మడి జిల్లా మైనారిటీ స్కూల్స్ నాన్ టీచింగ్ కార్మికుల సంఘం కన్వీనర్‌గా ఎలుకపెల్లి శ్రీకాంత్, కో–కన్వీనర్‌గా మీరజ్ హుస్సేన్‌లతోపాటు 21 మంది సభ్యులను ఎన్నుకున్నట్లు సమ్మయ్య తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చయ్య యాదవ్, నాయకులు ఎలకపల్లి శ్రీకాంత్, స్రవంతి, నజీర్, స్వప్న అరుణ తదితరులు పాల్గొన్నారు.

'సెయింట్‌జార్జ్'లో ముగిసిన క్రికెట్ శిబిరం


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

కొత్తపల్లి: స్థానిక సెయింట్‌జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్(సీబీఎస్ఈ)లో నిర్వహించిన సమ్మర్ క్రికెట్ క్యాంపు బుధవారం ముగిసింది. విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను స్కూల్ చైర్మన్ పి.ఫాతిమారెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యకే పరిమితం కాకుండా పలు రంగాల్లో రాణించాలన్న ఉద్దేశంతో క్రికెట్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్యాంపులో పాల్గొన్న విద్యార్థులను సివిల్ ఇంజినీర్ వెంకటేశ్వర్‌రెడ్డి అభినందించారు. ప్రిన్సిపాల్ నిరంజన్, శ్రీకాంత్, అనూప్, జగన్, వెంకటేశ్, కోచ్ సరేన్ పాల్గొన్నారు.

అగ్నిపథ్ రాత పరీక్షలో 'ఎస్వీజేసీ' ప్రతిభ


విద్యార్థులను సత్కరిస్తున్న యాజమాన్యం

సప్తగిరికాలనీ: కరీంనగర్‌లోని శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాల(ఎస్వీజేసీ) ద్రోణాచార్య డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు ఇటీవల కేంద్రం నిర్వహించిన అగ్నిపథ్ రాత పరీక్షలో ప్రతిభ కనబరిచినట్లు అకాడమీ చైర్మన్ మహిపాల్ రెడ్డి తెలిపారు. 20 మంది పరీక్ష రాస్తే అందరూ ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం వారిని సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏసీ చల్లదనానికి వంతులవారీగా చిలకలు



అప్పుడప్పుడు వర్షాలు పడుతున్నా పగటి ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు రావడం లేదు. వేడిగాలులతో జనం అల్లాడుతున్నారు. కూలర్లు, ఏసీలు లేకుండా ఉండలేకపోతున్నారు. కరీంనగర్ భాగ్యనగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో ఒక గదిలో ఏసీ ఉంది. దాని గోడకు రంధ్రం ద్వారా చల్లటి గాలి వస్తుండటంతో బుధవారం రామ చిలుకలు వంతులవారీగా ఆ రంధ్రంలో దూరుతూ సేదతీరుతూ కనిపించాయి. ఈ దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

మురికికూపంలా ఇంకుడుగుంత



కరీంనగర్ మండలంలోని ఇరుకుల్ల పంచాయతీ సమీపంలో నిర్మించిన ఇంకుడుగుంత మురికికూపంలా మారింది. ఏడాది క్రితం ఉపాధిహామీ పథకంలో డ్రైనేజ్ ఎండ్ కమ్యూనిటీ సోక్‌పిట్ నిర్మించారు. అయితే, డ్రైనేజీ నీరు పైనే నిలవడంతో దుర్వాసన వస్తోంది. పందులు, కుక్కలు సంచరిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలోని నీటితొట్టి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పాకురుపట్టి నీరంతా పచ్చగా మారడంతో పశువులు తాగలేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి, సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– కరీంనగర్‌రూరల్


రాష్ట్రానికి 4 కేంద్ర మంత్రి పదవులు!

ఎన్డీఏలో కీలకంగా మారిన టీడీపీ | **కీలక శాఖలు కోరుతున్న చంద్రబాబు** | **జనసేన, ఏపీ బీజేపీ నేతలకూ చాన్స్**

సాక్షి, అమరావతి: మారిన రాజకీయ పరిణామాలతో కేంద్ర ప్రభుత్వంలో రాష్ట్రానికి సముచిత ప్రాధాన్యం దక్కనుంది. ఎన్డీఏలో టీడీపీ మద్దతు కీలకం కావడంతో జాతీయ రాజకీయాల్లో ప్రధాన పాత్ర పోషించే అవకాశం లభించింది. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును ఎన్డీఏ కన్వీనర్‌గా నియమించేందుకు బీజేపీ సుముఖంగా ఉన్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. బీజేపీ పెద్దల ప్రతిపాదనపై చంద్రబాబు ఇంకా నిర్ణయం తీసుకోలేదని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశానికి చంద్రబాబు హాజరు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. చంద్రబాబుకు ఎన్డీఏ కన్వీనర్‌గా అవకాశం వచ్చినా, రాకపోయినా టీడీపీ మద్దతు కీలకంగా మారినట్లు స్పష్టమవుతోంది. ఇకపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల్లో టీడీపీ మాట చెల్లుబాటవుతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. తాజా రాజకీయ ముఖచిత్రం నేపథ్యంలో కేంద్రంలో తమకు ప్రాధాన్యత కలిగిన మంత్రిత్వ శాఖలు కేటాయించాలని ప్రధాని మోదీని చంద్రబాబు కోరుతున్నట్లు సమాచారం. ఏపీ నుంచి నలుగురు లేదా ఐదుగురికి మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. టీడీపీ నుంచి కనీసం ఇద్దరు ముగ్గురికి అవకాశం లభిస్తుందని చెబుతున్నారు. ఏపీ బీజేపీ, జనసేన నుంచి ఒక్కరికైనా ఛాన్స్ ఉండవచ్చనే భావిస్తున్నారు. టీడీపీ తరపున గెలిచిన ఎంపీల్లో కింజరపు రామ్మోహన్‌నాయుడి పేరు కేంద్ర మంత్రి పదవికి గట్టిగా వినిపిస్తోంది. అమలాపురం ఎంపీగా గెలిచిన గంటి హరీష్ మాథుర్, నెల్లూరు నుంచి గెలిచిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బాపట్ల నుంచి గెలిచిన టి.కృష్ణప్రసాద్ పేర్లు కూడా కేంద్ర మంత్రి పదవుల రేసులో వినిపిస్తున్నాయి. బీజేపీ తరపున గెలిచిన సీఎం రమేష్, దగ్గుబాటి పురందేశ్వరి కేంద్ర మంత్రివర్గంలో స్థానం కోసం పోటీ పడుతున్నారు. సీఎం రమేష్ అటు బీజేపీ పెద్దలకు, ఇటు చంద్రబాబుకు అత్యంత సన్నిహితంగా ఉండే వ్యక్తి కావడంతో ఆయనకు ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు. జనసేన నుంచి గెలిచిన ఇద్దరు ఎంపీల్లో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి మంత్రి పదవి కోసం గట్టి లాబీయింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. జల్ శక్తి, రవాణా, వ్యవసాయం, ఆరోగ్య మంత్రిత్వ శాఖలను చంద్రబాబు అడుగుతున్నట్లు చెబుతున్నారు. లోక్‌సభ స్పీకర్ లాంటి కీలక పదవులను కూడా టీడీపీ ఆశిస్తున్నట్లు పేర్కొంటున్నారు. రెండు రోజుల్లో దీనిపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఇలాంటి పోరు ఇదే తొలిసారి

కూటమి సమష్టి కృషితో ఎన్నికల్లో విజయం: చంద్రబాబు



సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఘన విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పారు. కూటమి నేతలు, కార్యకర్తల సమష్టి కృషి వల్లే ఈ విజయం దక్కిందన్నారు. బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలు ఇచ్చింది అధికారం మాత్రమే కాదని, ఒక ఉన్నతమైన బాధ్యత అప్పగించారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని రంగాలు, ప్రజాస్వామ్య వ్యవస్థలన్నింటినీ వైఎస్ జగన్ నిర్వీర్యం చేశారని విమర్శించారు. భూమి మీద ఎవరూ శాశ్వతం కాదని, దేశం, ప్రజాస్వామ్యం, పార్టీలే శాశ్వతమన్నారు. ఈ తీర్పుతో రాష్ట్రంలో అందరికీ స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఇంత చరిత్రాత్మక ఎన్నికలను తన జీవితంలో చూడలేదని వ్యాఖ్యానించారు. విదేశాల్లో ఉండే వ్యక్తులు రూ.లక్షలు ఖర్చు పెట్టుకుని వచ్చి మరీ ఓటు వేశారన్నారు. టీడీపీ, ఏపీ చరిత్రలో ఈ విజయం సువర్ణాక్షరాలతో లిఖించదగ్గదన్నారు. టీడీపీని స్థాపించినప్పుడు జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్రంలో 200 సీట్లు వచ్చాయని, 1994లో ప్రతిపక్షానికి కొన్ని చోట్ల డిపాజిట్లు కూడా రాలేదని, వాటన్నింటినీ అధిగమించి ఇప్పుడు ఇంత విజయం చేకూరడానికి ప్రజలు అనుభవించిన బాధలే కారణమన్నారు. ఈ ఎన్నికల్లో కూటమికి 55.38 శాతం ఓట్లు లభించగా ఇందులో టీడీపీకి 45.60 శాతం ఓట్లు వచ్చాయని చంద్రబాబు చెప్పారు. వైఎస్సార్‌సీపీకి 39.37 శాతం ఓట్లు దక్కాయన్నారు. గతంలో కుప్పం, సిద్ధిపేట మెజారిటీల్లో పోటీ పడేవని, ఇప్పుడు గాజువాక, భీమిలి, మంగళగిరిలో 90 వేల మెజారిటీలు దాటాయన్నారు.

పాలకులు కాదు సేవకులం

తాము పాలకులం అని కాకుండా సేవకులం అనే నినాదానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. సూపర్ 6, ప్రజాగళం మేనిఫెస్టో అంశాలు ప్రజల్లోకి బాగా వెళ్లాయని తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని పవన్ కళ్యాణ్ ముందుకు వచ్చి కూటమికి బీజం వేసినందుకు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. అసెంబ్లీలో తనను, తన కుటుంబ సభ్యులను అవమానించారని, కౌరవసభలో ఉండబోనని నాడు చెప్పానన్నారు. గౌరవ సభగా మార్చిన తర్వాతే మళ్లీ సభకు వస్తానని చెప్పానని, తన ప్రతిజ్ఞను ప్రజలు నిజం చేశారని తెలిపారు. తాము జాతీయ స్థాయిలో ఎన్డీయేతోనే ఉన్నామని, ఉంటామన్నారు. ఏమైనా మార్పు ఉంటే చెబుతానన్నారు.

తెలంగాణ గవర్నర్‌తో చంద్రబాబు భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధానిలో బుధవారం ఎన్డీఏ పక్ష నేతల సమావేశం సందర్భంగా తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణను శబరి బ్లాక్‌లో కలుసుకున్న టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు కొద్దిసేపు చర్చలు జరపడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ పదేళ్ల గడువు ముగిసిన నేపథ్యంలో విభజనకు సంబంధించి పలు పెండింగ్ అంశాలను ఆయన గవర్నర్ దృష్టికి తెచ్చినట్లు సమాచారం. ఎన్డీఏ పక్ష నేతల సమావేశం అనంతరం కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కూడా ఆయన నివాసంలో చంద్రబాబు కలిశారు. ఎన్డీఏ పక్ష భేటీలో ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ చంద్రబాబు లేఖను అందజేశారు. తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావాలని మోదీని ఈ సందర్భంగా చంద్రబాబు ఆహ్వానించినట్లు తెలిసింది. టీడీపీ మద్దతు కీలకంగా మారిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంలో ఆరు మంత్రి పదవులతోపాటు స్పీకర్ పదవిని కూడా చంద్రబాబు కోరినట్లు జాతీయ మీడియాలో వార్తలు వెలువడ్డాయి. అనంతరం విజయవాడ వెళ్లేందుకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న చంద్రబాబు అక్కడ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌తో కొద్దిసేపు సమావేశమయ్యారు.

12న చంద్రబాబు ప్రమాణ స్వీకారం!

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జూన్ 12వ తేదీన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు ముహూర్తం ఖరారైంది. తొలుత 9వ తేదీన ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని భావించినా ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారోత్సవం నేపథ్యంలో ముహూర్తాన్ని మార్చినట్టు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. రాజధాని అమరావతి ప్రాంతంలో బహిరంగ సభ నిర్వహించి చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలుస్తోంది.

మంత్రుల రేసులో..

ఆశావహుల జాబితాపై చంద్రబాబు ప్రాథమిక కసరత్తు
పవన్ కల్యాణ్‌కు డిప్యూటీ సీఎం పదవిపై అస్పష్టత
విపక్షంగా సభలో అడుగు పెట్టి ప్రభుత్వంలో చేరతామంటున్న జనసేన అధ్యక్షుడు
ఒకేసారి రెండు పాత్రలు పోషించడం సాంకేతికంగా ఎలా సాధ్యం?



సాక్షి, అమరావతి: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మంత్రివర్గంలో ఎవరెవరికి చోటు దక్కుతుందనే అంశంపై పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కూటమి నుంచి 164 మంది ఎమ్మెల్యేలుగా గెలుపొందడంతో మంత్రి పదవులకు భారీ డిమాండ్ ఏర్పడింది. ఇప్పటికే కొందరికి మంత్రి పదవులు ఇస్తామని హామీ ఇవ్వడం, చాలామంది సీనియర్లు గెలుపొందడం, బీజేపీ, జనసేనకు అవకాశం ఇవ్వాల్సి నందున మంత్రివర్గ కూర్పు కత్తిమీద సాములా మారనుంది. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కి ఉప ముఖ్యమంత్రి పదవి లభిస్తుందని ఎన్నికలకు ముందు నుంచే ప్రచారం సాగుతుండగా బుధవారం పార్టీ నేతలతో నిర్వహించిన సమావేశంలో ప్రధాన ప్రతిపక్షంగా అసెంబ్లీలోకి అడుగుపెట్టబోతున్నట్లు ఆయన ప్రకటించడం గమనార్హం. మరోవైపు ప్రభుత్వంలోనూ భాగస్వాములుగా ఉంటామని చెప్పుకొచ్చారు. అయితే ఈ రెండు ఎలా సాధ్యమనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రధాన ప్రతిపక్షంగా ఉండాలని నిర్ణయించుకుంటే మంత్రివర్గంలో జనసేన చేరడం కుదరదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ పవన్ కల్యాణ్ ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉంటూ తన పార్టీకి చెందిన వారికి మంత్రి పదవులు ఇప్పించాలనుకున్నా సాంకేతికంగా అది సాధ్యం కాదనే వాదన వినిపిస్తోంది. దీంతో ఎలా ముందుకు వెళతారనే అంశం ఆసక్తికరంగా మారింది. జనసేన మంత్రివర్గంలో చేరితే నాదెండ్ల మనోహర్, కొణతాల రామకృష్ణ, కందుల దుర్గేష్, బొలిశెట్టి శ్రీనివాస్‌కు అవకాశం ఉంటుందని భావి స్తున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉండాలనే విష యంపై వెనక్కి తగ్గితే పవన్ కళ్యాణ్ ఉప ముఖ్య మంత్రి పదవి తీసుకునే అవకాశం ఉంది. ఇక బీజేపీ నుంచి అసెంబ్లీకి గెలిచిన వారిలో చంద్రబాబుకు అత్యంత సన్నిహితులైన సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్ పేర్లు వినిపిస్తున్నాయి. సత్యకుమార్, విష్ణుకుమార్‌రాజుకు కూడా అవకాశం దక్కవచ్చని చెబుతున్నారు.

పాతవారికే పెద్దపీట

టీడీపీలో మంత్రి పదవుల ఆశావహుల జాబితా చాంతాడంత ఉంది. 135మంది ఎమ్మెల్యేలు ఆ పార్టీ నుంచి గెలుపొందడంతో ఎవరికి అవకాశం దక్కుతుందోననే చర్చ జరుగుతోంది. సామాజిక సమీకరణలు, సీనియారిటీ ప్రాతిపదికన పలువురు నేతలు తమకు మంత్రివర్గంలో చోటు దక్కుతుందని గట్టిగా నమ్ముతున్నారు. చంద్రబాబు ఇప్పటికే దీనిపై ప్రాథమికంగా కొంత కసరత్తు చేసినట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. నారా లోకేష్, పొంగూరు నారాయణ, అచ్చెన్నాయుడు, కళా వెంకట్రావు, చింతకాయల అయ్యన్నపాత్రుడు, నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, ధూళిపాళ్ల నరేంద్రకు కచ్చితంగా మంత్రివర్గంలో స్థానం లభిస్తుందని చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలవారీగా ఆశావహుల జాబితా

శ్రీకాకుళం: కింజరపు అచ్చెన్నాయుడు, కూన రవికుమార్, బెందాళం అశోక్
విజయనగరం: కళా వెంకట్రావు, అదితి గజపతిరాజు
విశాఖపట్నం: గంటా శ్రీనివాసరావు, చింతకాయల అయ్యన్నపాత్రుడు, వంగలపూడి అనిత
తూర్పు గోదావరి: జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, గోరంట్ల బుచ్చయ్యచౌదరి
పశ్చిమ గోదావరి: నిమ్మల రామానాయుడు, చింతమనేని ప్రభాకర్, పితాని సత్యనారాయణ, కనుమూరి రఘురామకృష్ణరాజు
కృష్ణా: కొల్లు రవీంద్ర, బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, వసంత కృష్ణప్రసాద్, కేపీ సారథి
గుంటూరు: నారా లోకేష్, ధూళిపాళ్ల నరేంద్ర, ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనంద్‌బాబు
ప్రకాశం: దామచర్ల జనార్దన్, గొట్టిపాటి రవికుమార్
నెల్లూరు: పి.నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి
కర్నూలు: కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, భూమా అఖిలప్రియ, ఎన్ఎండీ ఫరూఖ్
అనంతపురం: పయ్యావుల కేశవ్, పరిటాల సునీత, కాల్వ శ్రీనివాసులు
చిత్తూరు: పులివర్తి నాని, అమర్‌నాథ్‌రెడ్డి, బొజ్జల సుధీర్
కడప: రెడ్డప్పగారి మాధవి, వరదరాజులరెడ్డి

నా నడక జగన్‌తోనే

- పేదలకు ఎంతో మేలుచేసిన వైఎస్ జగన్‌ను ప్రజలు ఓడించడం బాధగా ఉంది
- సవాల్ మేరకు నా పేరును మార్చుకునేందుకు దరఖాస్తు చేసుకున్నా
- కాపు ఉద్యమ నాయకుడు, వైఎస్సార్‌సీపీ నేత ముద్రగడ పద్మనాభం



కిర్లంపూడి: 'కోట్లాది రూపాయలు అందజేసి పేదవారికి ఆక్సిజన్ ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఓడించడం బాధగా ఉంది. నా నడక వైఎస్ జగన్‌తోనే. ఆయన వెనకాలే నేను నడుస్తా' అని కాపు ఉద్యమ నాయకుడు, వైఎస్సార్‌సీపీ నేత ముద్రగడ పద్మనాభం చెప్పారు. కాకినాడ జిల్లా కిర్లంపూడిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఈ ఎన్నికల్లో జగన్‌కు ఓటమి రావడం చాలా బాధాకరం. పేదలకు కోట్లాది రూపాయలతో సంక్షేమ పథకాలు అందజేశారు. అయినా ఆయనను ఓడించడం బాధగా ఉంది. దేశంలో ఏ ముఖ్యమంత్రీ కూడా ఈ స్థాయిలో సంక్షేమ పథకాల అమలుకు సాహసం చేయలేదు. కానీ, ప్రజలు ఎందుకు ఓడించారనేదే నా ప్రశ్న? సంక్షేమం కన్నా అభివృద్ధి మీద ఆసక్తి చూపించారా? లేకపోతే ఎదుటి పార్టీ వాళ్ల ప్రకటించిన సంక్షేమ పథకాలకు మొగ్గు చూపారా? రాబోయే ఏ ముఖ్యమంత్రి కూడా సంక్షేమ పథకాల జోలికి వెళ్లకుండా ప్రజలు ఇలా చేశారనుకుంటున్నా. ప్రజల కోసమే నిరంతరం కష్టపడిన జగన్ మోహన్‌రెడ్డిని గౌరవించుకోలేకపోవడం బాధగా ఉంది. పిఠాపురంలో పవన్‌కల్యాణ్‌ను ఓడించకపోతే నా పేరు పద్మనాభంరెడ్డిగా మార్చుకుంటానని గతంలో సవాల్ చేశా. ఆ మాటకు కట్టుబడి పేరు మార్పు కోసం దరఖాస్తు చేస్తున్నా. గెజిట్ పబ్లికేషన్‌లో మార్పుతో కూడిన పేరు చేర్చిన తర్వాత మీడియా సమావేశం పెట్టి ప్రకటిస్తా. నేను మాట్లాడితే చాలు.. ఉప్మా పద్మనాభం అంటూ అవమానించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. మా ఇంటికి వచ్చిన వారికి ఉప్మా, కాఫీ ఇవ్వడం మీకు చీప్‌గా ఉందా? మా తాత, తండ్రి నుంచి కూడా మా ఇంటికి ఎవరు వచ్చినా మర్యాద చేయడం అలవాటు. అదేదో నేరమన్నట్లు మీరంతా భూతద్దంలో చూపిస్తున్నారు. మీ ఇళ్లకు ఎవరైనా వస్తే వారికి మర్యాద చేయరా?' అని ముద్రగడ ప్రశ్నించారు. ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి నేతలకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

సింగరేణి స్కూళ్లలో 'సీబీఎస్ఈ' బోధన

- యువఉద్యోగుల రాకతో డిమాండ్
- మరింత పటిష్టం చేయాలని కార్మికనేతల వినతి



గోదావరిఖనిలోని సింగరేణి పాఠశాల

గోదావరిఖని: కార్పొరేట్‌కు దీటుగా సింగరేణి కార్మికుల పిల్లలకు విద్యాబోధన చేయాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈమేరకు సంస్థలోని తొమ్మిది స్కూళ్లలో విద్యావిధానం బలోపేతం చేయడంపై దృష్టి సారించింది. కారుణ్య నియామకాల ద్వారా 16వేల మందికిపైగా యువ ఉద్యోగులు చేరారు. వారిపిల్లల చదువు కోసం సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఈవిషయంలో కార్మిక సంఘాల నుంచి కూడా డిమాండ్ పెరుగుతోంది. దీనిపై అధ్యయనం చేయాలని సీఎండీ బలరాం ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు. సీబీఎస్ఈ విద్యావిధానంపై సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని సూచించారు. సంస్థవ్యాప్తంగా 9 స్కూళ్లు, ఒక పాలిటెక్నిక్, మరో మహిళా డిగ్రీ కళాశాల ఉంది. వీటిలో నాణ్యమైన విద్య, ఆధునిక సౌకర్యాలు ఉన్నాయి. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా చదవు కొనసాగుతోంది. అయితే, ఏటా కార్మికుల సంఖ్య తగ్గుతోంది. ఇదేక్రమంలో సింగరేణి స్కూళ్లకు ఆదరణ పడిపోతోంది. ఒకప్పుడు 1.25 లక్షల మందికిపైగా ఉన్న సింగరేణి ఉద్యోగులు.. ప్రస్తుతం 40వేలకు పరిమితమయ్యారు. కార్మికుల పిల్లలు ఉన్నత విద్యవైపు వెళ్లిపోవడంతో చిన్న పిల్లలు లేకుండాపోతున్నారు. ఈక్రమంలో కార్మికేతర పిల్లలకు కూడా సింగరేణి పాఠశాలల్లో చదువుకునే అవకాశం కల్పిస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఒకప్పుడు ఒక్కో తరగతికి మూడు సెక్షన్లు ఉండగా ప్రస్తుతం ఒకే తరగతిగదిలో కొనసాగిస్తున్నారు.

సింగరేణిలోని స్కూళ్లు	9
విద్యార్థుల సంఖ్య	6,000
సిబ్బంది	1,000

సంస్థలో పెరిగిన యువఉద్యోగులు

కారుణ్య నియామకాలతో సంస్థలో యువ ఉద్యోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈక్రమంలో యువ ఉద్యోగులకు వివాహాలు కావడం, పిల్లలు జన్మించడంతో చదువులపై అందరి దృష్టి పడింది. ప్రస్తుతం ఉన్న విద్యా విధానాన్ని సమూలంగా మార్చి సీబీఎస్ఈ పద్ధతిలో బోధన ప్రవేశపెట్టాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

కేంద్రానికి సింగరేణి దరఖాస్తు

సింగరేణి స్కూళ్లలో సీబీఎస్ఈ విధానం విద్యాబోధన ప్రవేశపెట్టడానికి అనుమతి కోరుతూ సింగరేణి యాజమాన్యం కేంద్రప్రభుత్వానికి ఇటీవల దరఖాస్తు చేసుకుంది. దీనికి త్వరలోనే అనుమతి వచ్చే అవకాశం ఉంది. అప్పటివరకు వేచచూడకుండా.. ఇప్పటినుంచే ప్రయోగాత్మకంగా కొన్ని బడుల్లో కొత్త పద్ధతి అమలు చేయాలని సింగరేణి యోచిస్తోంది.

విద్యావిధానం మార్చాలి



సింగరేణిలో పాత విద్యా విధానం స్థానంలో కొత్త విద్యా విధానం ప్రవేశపెట్టాల్సిందే. ఈవిషయంలో యాజమాన్యానికి ఇప్పటికే విజ్ఞప్తి చేశాం. ఆ దిశగా యాజమాన్యం చర్యలు చేపట్టింది.
– జనక్‌ప్రసాద్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్

త్వరలోనే అమలు



సింగరేణి పాఠశాలల్లో కార్మికుల పిల్లల చదువుకోసం సీబీఎస్ఈ విద్యా విధానం ప్రవేశపెట్టాలని మేం గెలిచిన వెంటనే కోరాం. ఈమేరకు సంస్థ అధ్యయనం చేస్తోంది. కేంద్రప్రభుత్వానికి కూడా దరఖాస్తు చేసింది. ఈఏడాది కాకున్నా వచ్చే విద్యా సంవత్సరంలో సీబీఎస్ఈ విధానంలో విద్యాబోధన ప్రారంభించే అవకాశం ఉంది.
– వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షుడు

ఆ ఈవీఎంలు గోడౌన్‌కు తరలింపు

- అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన కేసులో..
- హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఆదిలాబాద్ కలెక్టర్ చర్యలు


ఈవీఎంలను భద్రపరిచి సీల్ వేసిన గోడౌన్ వద్ద అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ నియోజకవర్గంలో వినియోగించిన ఈవీఎంలను హైకోర్టు తీర్పు నేపథ్యంలో అధికారులు ఎట్టకేలకు గోడౌన్‌కు తరలించి భద్రపరిచారు. సాధారణంగా ఎన్నికలు ముగిసిన 45 రోజుల్లో ఈవీఎంలను స్ట్రాంగ్ రూం నుంచి బయటకు తీసి గోడౌన్‌లో భద్రపరుస్తారు. 2023 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న, ఇందులో ఎమ్మెల్యేగా గెలుపొందిన పాయల్ శంకర్‌కు చెందిన అఫిడవిట్‌పై ఎన్నికల పిటిషన్ నంబర్ 26/24 ద్వారా హైకోర్టులో కేసు నమోదు చేశారు. దీనిపై మే 3వ తేదీన విచారించిన న్యాయస్థానం ఈ కేసులో ఈవీఎంలను తెరువాల్సిన అవసరం లేదని వాటిని స్ట్రాంగ్‌రూం రిలీవ్ చేసుకోవచ్చని తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ రాజర్షి షా ఆధ్వర్యంలో స్థానిక టీటీడీసీలోని స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచిన ఆదిలాబాద్ నియోజకవర్గ ఈవీఎంలను శాంతినగర్‌లోని ఈవీఎం గోడౌన్‌కు బుధవారం తరలించారు. ఆ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వాటిని గోదాంలో భద్రపరిచి సీల్ వేశారు. అనంతరం అక్కడి రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ లేకున్నా నిధుల చెల్లింపు?

- వీధి దీపాల నిర్వహణ బాధ్యతలు సంస్థకు అప్పగింత
- మున్సిపాలిటీ నిధులతోనే ఏర్పాటుతో భారం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో 2018లో ఎల్ఈడీ విద్యుత్ దీపాలు అమర్చి ఏడేళ్లపాటు నిర్వహణను ఢిల్లీకి చెందిన ఈఈసీఎల్ సంస్థకు అప్పగించారు. 18 వాట్స్ నుంచి 190 వాట్‌ల విద్యుత్ దీపాలు ఎక్కడైనా పనిచేయకున్నా వాటిని వెంటనే మార్చడంతోపాటు మరమ్మతులకు ఆ సంస్థ తరఫున ఐదుగురు సిబ్బందిని కేటాయించారు. నాలుగేళ్ల వరకు కొత్త వాటిని అమర్చడం, మరమ్మతులు బాగానే చేశారు. ఒప్పందం ప్రకారం ప్రతీ ఏడాది రూ.11 లక్షలు మున్సిపల్ నిధుల నుంచి చెల్లిస్తున్నారు. 2022 ఫిబ్రవరి నెల నుంచి ఆ సంస్థ మున్సిపాలిటీ పరిధిలోని వీధి దీపాల నిర్వహణ చేపట్టకపోవడంతో మున్సిపల్ ఎలక్ట్రీషియన్ సిబ్బందితోనే పనులు చేయిస్తున్నారు. వీధి దీపాలు పాడైతే కొత్తవాటి ఏర్పాటుకు గతంలోనే మున్సిపల్ నిధులు రూ.10లక్షలు కేటాయించి కొనుగోలు చేశారు. సంస్థ తన కార్యకలాపాలు చేపట్టకపోవడంతో రానున్న వర్షాకాలంలో పాడైన వీధి దీపాల స్థానంలో కొత్త వాటి ఏర్పాటుకు వచ్చే మున్సిపల్ సమావేశంలో మరో రూ.10 లక్షలు కేటాయించేందుకు అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. సంస్థ వీధి దీపాలు అందించకపోయినా, నిర్వహణ చేయకున్నా పెండింగ్ బిల్లుల పేరిట రూ.1.80 కోట్లు మున్సిపల్ నిధుల నుంచి చెల్లించినట్లుగా సమాచారం. ఈ ఏడాది అక్టోబర్‌లో సంస్థ కాంట్రాక్టు ముగుస్తున్నందున ఇటీవల పెండింగ్ బిల్లులు చెల్లించడంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయమై మున్సిపల్ డివిజనల్ ఇంజినీర్ మధుకర్‌ను సంప్రదించగా, సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్లనే నిర్వహణ చేయలేకపోయారని తెలిపారు. వీధి దీపాల ఏర్పాటులో ఇబ్బందులు కలగడం వల్లనే మున్సిపల్ నిధులు రూ.10 లక్షలు కేటాయించామని, వీధి దీపాలు కొనుగోలు చేసి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.


మంచిర్యాల మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ వీధి దీపాలు

పొత్కపల్లిలో చిరుత సంచారం


సీసీ ఫుటేజీలో చిరుత ఆనవాళ్లు(సర్కిల్‌లో)

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి రైల్వేలెవల్ క్రాసింగ్ సమీపంలో చిరుత సంచారం గ్రామస్తులను కలవరానికి గురిచేస్తోంది. గేట్ సమీపంలో నివాసం ఉండే యువకుడు ఖలీల్ పెంపుడు పిల్లి కనిపించకుండా పోయింది. దీంతో సమీపంలోని ఓ సీసీ ఫుటేజీలో పరిశీలించగా.. అందులో చిరుత నడుకుంటూ వెళ్తూ కనిపించింది. కంగుతున్న ఆ యువకుడు.. గ్రామస్తులకు సమాచారం చేరవేశాడు. వారుకూడా మరికొన్ని సీసీఫుటేజీలు చూడగా.. గేట్ సమీపంలోంచి చొట్లపొదల్లోకి నడుకుంటూ వెళ్తున్న చిరుత కనిపించింది. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు చేరవేశారు. కూనారం సెక్షన్ ఆఫీసర్ వాయుకుమార్, బీట్ ఆఫీసర్ తిరుపతి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చిరుత సంచిరించిన గుర్తులు పరిశీలించారు. చిరుత సంచారంపైనిఘా ఉంచామన్నారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అభాగ్యుడికి చేయూతనివ్వండి!

- వివిధ కారణాలతో కుటుంబ సభ్యులు మృతి
- రోడ్డు ప్రమాదంలో మంచానికే పరిమితం
- బాగోగులు చూసుకునేవారు లేక ఇబ్బంది
- ఆర్థికసాయం అందించాలని వేడుకోలు


బాధితుడు రవి

రామడుగు: చిన్న తనంలోనే తండ్రి చనిపోయాడు. వివిధ కారణాలతో తల్లి, అన్న కూడా మృతిచెందాడు. కూలీ పనిచేసుకుంటూ జీవిస్తుండగా రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై మంచానికే పరిమితం కాగా తన బాగోగులు చూసుకునేవారు లేక, వైద్య ఖర్చులకూ డబ్బులు లేకపోవడంతో ఓ వ్యక్తి ఇబ్బందులు పడుతున్నాడు. దాతలు తనకు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే,...మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామానికి చెందిన గజ్జెల రాజమణి – మల్లయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కాగా వీరి చిన్నతనంలోనే మల్లయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో తల్లి రాజమణి కష్టపడి కూతురు వివాహం జరిపించింది. వీరిలో పెద్ద కుమారుడు రాజు జీవనోపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లగా అక్కడ ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడగా మంచానికి పరిమితమై ఏడాది తర్వాత మృతిచెందాడు. కాగా తల్లి రాజమణి రెండ్రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. కాగా రవి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుండగా, రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై మంచానికే పరిమితమయ్యాడు. ఇప్పటిదాకా తల్లి రాజమణి తన బాగోగులు చూసుకునేది. ఇప్పుడు తల్లి మృతిచెందడంతో రవి బాగోగులు చూసుకునేవారు లేకుండా పోయారు. దీనికి తోడు వైద్యఖర్చులకు చేతిలో చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాడు. దాతలు స్పందించి తనకు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు. 9493973490 నంబర్ ద్వారా ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా ఆర్థిక సాయం అందించాలని వేడుకుంటున్నాడు.

వడూర్‌లో 'బెల్టు' వేలం @ 4.61లక్షలు

నేరడిగొండ: గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. జిల్లాలో వీడీసీల పేరిట బెల్టుషాపుల వేలం జోరుగా కొనసాగుతోంది. నేరడిగొండ మండలం వడూర్ గ్రామంలో బుధవారం బెల్టు షాపు ఏర్పాటుకు వేలం నిర్వహించగా, పది మంది పోటీపడ్డారు. ఏడాది పాటు నిర్వహణకు గాను రూ.4లక్షల 61వేలతో ఓ వ్యక్తి దక్కించుకున్నట్లు తెలుస్తోంది. గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన కమిటీలు ఇలా అనధికారికంగా వేలం నిర్వహించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ 'మామూలు'గా తీసుకోవడం అనుమానాలకు తావిస్తోంది.

ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి

కాసిపేట: ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్లాస్టిక్ వాడకం తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని, అప్పుడే భావితరాలకు భవిష్యత్‌ను ఇచ్చిన వారమవుతామని బెల్లంపల్లి ఎఫ్‌డీవో విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల శివారులో బుగ్గ ఆలయ పరిసర అటవీ ప్రాతంలో అటవీ అధికారులు ప్లాస్టిక్‌ను సేకరించి చెత్త డంపింగ్‌యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రపంచ దేశాలన్ని పోరాడుతున్నాయని, ప్లాస్టిక్ రహిత దేశానికి అందరూ పాటుపడాలని, సహజసిద్ధమైన వస్తువులు వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి ఏ.సుభాష్, డెప్యూటీ రేంజ్ అధికారులు తిరుపతి, సతీష్, ప్రవీణ్‌నాయక్, గౌరీశంకర్, ఎఫ్ఎస్‌వోలు ప్రభాకర్, శ్రీనివాస్, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.


ప్లాస్టిక్‌ను సేకరించిన అటవీశాఖ అధికారులు

లెక్కలు తారుమారు

2023 అసెంబ్లీ ఫలితాలకు భిన్నంగా లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల తీర్పు

సాక్షి, హైదరాబాద్: ఆరు నెలల క్రితం జరిగిన శాసనసభ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలకు భిన్నంగా లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తీర్పు చెప్పారు. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన కొన్ని స్థానాల్లో, బీఆర్‌ఎస్ గెలిచిన చాలా నియోజకవర్గాల్లో ఇప్పుడు బీజేపీ పైచేయి సాధించింది. కాంగ్రెస్ గెలి చిన 8 పార్లమెంటు స్థానాల్లోని 56 అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ కొన్నిచోట్ల మినహా కాంగ్రెస్సే ఆధిక్యతను కనబరిచింది. కాగా బీజేపీ గెలిచిన 8 లోక్‌సభ నియోజకవర్గాల్లోని 56 సెగ్మెంట్లలో బీజేపీతో పాటు కాంగ్రెస్ కూడా కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొదటి స్థానంలో నిలిచింది. మూడు చోట్ల బీఆర్‌ఎస్ మొదటి స్థానంలో నిలిచింది. అయి తే చివరికి స్వల్ప తేడాతోనైనా బీజేపీనే విజయం సాధించింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలిచిన 39స్థానాల్లో గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక మినహా మిగతా 36 సెగ్మెంట్లలో ఆపార్టీ ఓట్లను కాంగ్రెస్, బీజేపీ పంచుకొన్నాయి.

బీఆర్‌ఎస్‌కు 2 స్థానాల్లోనే రెండో స్థానం

లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కచోట కూడా గెలవలేకపోయిన బీఆర్‌ఎస్ మహబూబాబాద్, ఖమ్మం లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ తరువాత రెండోస్థానంలో నిలిచింది. హైదరాబాద్ ఎంపీ స్థానంలో నాలుగో స్థానానికి పరిమితమైన బీఆర్‌ఎస్ మిగతా 14 చోట్ల మూడో స్థానం దక్కించుకుంది. మెదక్ పార్లమెంటు పరిధిలోని గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీ కన్నా అధిక ఓట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. ఇందులో గజ్వేల్ కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కాగా, సిద్దిపేట హరీశ్‌రావు కంచుకోట.

బీజేపీ వైపు బీఆర్‌ఎస్ ఓటర్ల మొగ్గు

బీజేపీ గెలిచిన 8 ఎంపీ సీట్లలో చాలాచోట్ల కాంగ్రెస్ రెండోస్థానంలో నిలవగా, బీఆర్‌ఎస్ మూడోస్థానానికి పరిమితమైంది. 2023లో బీఆర్‌ఎస్ గెలిచిన స్థానాల్లో కూడా ఈసారి బీజేపీకి మెజారిటీ వచ్చింది. అంటే జాతీయ స్థాయి ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని బీఆర్‌ఎస్ ఓటర్లు కూడా ఈసారి బీజేపీ వైపే మొగ్గు చూపారన్న మాట. కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ ఎంపీ పరిధిలోని సిరిసిల్ల నియోజకవర్గంలో సైతం బీఆర్‌ఎస్ రెండోస్థానంలో నిలిచింది. ఇక్కడ బీజేపీకి మెజారిటీ ఓట్లు రావడం గమనార్హం. కరీంనగర్ లోక్‌సభ పరిధిలో గత అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కరీంనగర్, హుజూరాబాద్ సెగ్మెంట్లలో బీఆర్‌ఎస్ మూడోస్థానంలో నిలిచింది. కరీంనగర్ పరిధిలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్ సెగ్మెంట్‌లో మాత్రం కాంగ్రెస్ మొదటి స్థానంలో నిలవగా, బీజేపీ, బీఆర్‌ఎస్ రెండు, మూడుస్థానాలు దక్కించుకున్నాయి. నిజామాబాద్ లోక్‌సభ పరిధిలో బీజేపీ విజయం సాధించగా, ఇ క్కడ బీఆర్‌ఎస్ విజయం సాధించిన బా ల్కొండ, కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల్లో సై తం మూడో స్థానానికే పరిమితమైంది. ఇక హై దరాబాద్ పరిసరాల్లోని చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లో బీజేపీ విజ యం సాధించగా, 2023 నవంబర్‌లో ఈ మూ డు నియోజకవర్గాల పరిధిలో బీఆర్‌ఎస్ గెలిచిన 18 సీట్లలోనూ లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ మూడో స్థానానికే పరిమితమవడం గమనార్హం.

కాంగ్రెస్ గెలిచిన స్థానాల్లో బీజేపీకే రెండో స్థానం

కాంగ్రెస్ గెలిచిన 8 ఎంపీ స్థానాల పరిధిలోని 56 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో చాలావరకు బీఆర్‌ఎస్ రెండో స్థానంలో నిలిచింది. కానీ ఈసారి బీజేపీ బలం ఏమ్రాతం లేని ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీ స్థానాలలో మాత్రమే బీఆర్‌ఎస్ రెండోస్థానంలో నిలవగా, మిగతా ఆరు నియోజకవర్గాల్లో బీజేపీ ప్రధాన ప్రత్యర్థిగా ఉంది. దాదాపు 50 అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ మొదటి స్థానంలో ఉండి భారీగా ఓట్లు సాధించడం గమనార్హం. పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు సెగ్మెంట్లలో ధర్మపురిలో మాత్రమే కాంగ్రెస్ కన్నా బీజేపీ స్వల్ప ఆధిక్యత సాధించగా, మిగతా ఆరు చోట్ల కాంగ్రెస్ మొదటి స్థానంలో నిలిచింది. జహీరాబాద్ ఎంపీ పరిధిలోని ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల్లో బీజేపీ మొదటి స్థానంలో నిలవగా, కాంగ్రెస్‌కు రెండో స్థానం దక్కింది. నాగర్‌కర్నూల్ ఎంపీ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఆరు చోట్ల కాంగ్రెస్ ఆధిక్యత సాధించగా, గద్వాలలో మాత్రం కాంగ్రెస్ కన్నా బీజేపీకి ఎక్కువ ఓట్లు పోలవడం గమనార్హం. ఇక వరంగల్, మహబూబాబాద్, నల్లగొండ, భువనగిరి, ఖమ్మం, పార్లమెంటు స్థానాల్లో దాదాపు అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ మొదటి స్థానంలోనే నిలవగా, రెండోస్థానంలో బీజేపీ, మూడోస్థానంలో బీఆర్‌ఎస్ నిలిచింది.



వి'హంగామా'

ఆకాశమే హద్దుగా ఈ పక్షులు గాలిలో విహరించాయి. రెక్కలు చాపి ఆహ్లాదకరమైన ప్రకృతి ఒడిలో చక్కర్లు కొట్టాయి. పెద్దపల్లి జిల్లా ఎల్లంపల్లి జలాశయం వద్ద ఈ సుందర దృశ్యం స్థానికులకు కనువిందు చేసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

భూమి చుట్టూ 310 రౌండ్లు



సాక్షి, హైదరాబాద్: రైల్వే ఆధునికీకరణలో భాగంగా కొత్తగా ప్రారంభించిన వందేభారత్ రైళ్లు సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ రైళ్లకు ఇప్పుడు ఉన్న డిమాండ్ అంతాఇంతా కాదు. 2019 ఫిబ్రవరి 15న ప్రారంభమైన వందేభారత్ రైళ్లు ఇప్పటి వరకు తిరిగిన నిడివిని పరిశీలిస్తే.. 310 పర్యాయాలు భూపరిభ్రమణం చేసిన దూరంతో సమానమట. ఇది సరికొత్త రికార్డు అంటూ రైల్వే శాఖ వివరాలు వెల్లడించింది.

105.57% ఆక్యుపెన్సీ రేషియోతో

ప్రస్తుతం దేశవ్యాప్తంగా వందేభారత్ రైళ్ల సగటు 105.57 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో తిరుగుతున్నాయి. వీటిలో కేరళలో తిరుగుతున్న వందేభారత్ రైలు సర్వీసు గరిష్ఠంగా 175.3 శాతం ఆక్యుపెన్సీ రేషియోను నమోదు చేసింది. వందేభారత్ రైళ్లలో తిరుగుతున్న ప్రయాణికుల్లో 26–45 ఏళ్ల మధ్య ఉన్నవారు 45.9 శాతంగా నమోదవుతోంది. కేరళలో తిరుగుతున్న వందేభారత్ సర్వీసుల్లో అత్యధికంగా 15.7 శాతం వృద్ధులు ప్రయాణిస్తున్నట్టు తేలింది. గోవాలో తిరుగుతున్న వందేభారత్ రైళ్లలో అత్యధికంగా 42 శాతం మంది మహిళా ప్రయాణికులుంటున్నారు. జార్ఖండ్ రాష్ట్రంలోని సర్వీసుల్లో గరిష్ఠంగా 67 శాతం మంది పురుషులు ఉంటున్నట్టు నమోదైంది.

సెమీ హైస్పీడ్ రైళ్లుగా...

రైళ్ల వేగాన్ని గరిష్ఠస్థాయికి తీసుకెళ్తూ సెమీ హైస్పీడ్ రైళ్లుగా వీటిని ప్రారంభించారు. గంటకు 160 కి.మీ. వేగ సామర్థ్యమున్న ఈ రైళ్లు సగటున 130 కి.మీ. వేగంతో ప్రయాణిస్తున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 60 వరకు సర్వీసులు (స్పెషల్ రైళ్లు కలుపుకొని) సేవలు అందిస్తున్నాయి. తొలి రైలు 2019 ఫిబ్రవరిలో ప్రారంభమైంది. అన్ని వందేభారత్ రైళ్లు 18423 ట్రిప్పులు తిరిగాయి. వీటి మొత్తం నిడివి1,24,87,540 కిలోమీటర్లుగా నమోదైంది. ఇది 310 పర్యాయాలు భూమి చుట్టూ పరిభ్రమించిన దూరంతో సమానమని రైల్వే శాఖ పేర్కొంది. గత ఏడాది కాలంలో 97,71,705 కి.మీ.లు తిరిగినట్టు వెల్లడించింది.


తెలంగాణలో నాలుగు రైళ్లు

ప్రస్తుతం తెలంగాణలో నాలుగు వందేభారత్ రైళ్లు తిరుగుతున్నాయి. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో తొలుత సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య 16 కోచ్‌లతో కూడిన వందేభారత్ రైలు సేవలు గతేడాది సంక్రాంతికి ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ రైలులో 120 శాతానికి మించి ఆక్యుపెన్సీ రేషియో ఉంటుండటంతో ఇటీవల ఇదే రూట్‌లో రెండో వందేభారత్ రైలు మొదలైన విషయం తెలిసిందే. రెండోది 8 కోచ్‌ల మినీఆరెంజ్ వందేభారత్. ఒకే రూట్‌లో రెండు వందేభారత్ రైళ్లు తిరగటం తొలుత కేరళలో మొదలైంది. రెండో ప్రయత్నంగా సికింద్రాబాద్–విశాఖ మార్గం ఎంచుకోవటం విశేషం. ఈమార్గం కాకుండా, సికింద్రాబాద్–తిరుపతి, కాచిగూడ–బెంగుళూరు మధ్య మరో రెండు సర్వీసులు తిరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా వచ్చే మూడేళ్లలో 400 వందేభారత్ రైళ్లు తిప్పాలని రైల్వే లక్ష్యంగా పెట్టుకుంది. ఆమేరకు వాటి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకుంది. ఇక త్వరలో రాత్రి వేళ తిరిగే స్లీపర్ వందేభారత్ రైళ్లు ప్రారంభం కాబోతున్నాయి.


'అనర్హత'పై వివరాలు తెలుసుకొని చెప్పండి

అడ్వొకేట్ జనరల్‌కు హైకోర్టు ఆదేశం


సాక్షి, హైదరాబాద్: పార్టీ మారిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్ అనర్హతకు సంబంధించి ఇచ్చిన వినతిపత్రాలపై నిర్ణయం ఎంత వరకు వచ్చిందో స్పీకర్ కార్యాలయంలో తెలుసుకొని చెప్పాలని అడ్వొకేట్ జనరల్(ఏజీ)ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.



'2023 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున విజయం సాధించి, తర్వాత వీరు కాంగ్రెస్‌లో చేరారు. ఒక పార్టీ అభ్యర్థిత్వంపై గెలిచి శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయకుండా మరో పార్టీలో చేరిన వీరిని అనర్హులుగా ప్రకటించాలి. స్పీకర్‌ను కలవాలని ప్రయత్నించినా సమయం ఇవ్వడం లేదు. ఈ మెయిల్ ద్వారా పంపిన పిటిషన్‌పై 3 నెలల్లోగా నిర్ణయం తీసుకునేలా స్పీకర్‌ను ఆదేశించాలి' అని ఆయన కోరారు. ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ తరఫున పోటీ చేసి విజయం సాధించిన దానం నాగేందర్.. ఎమ్మెల్యే సభ్యత్వానికి రాజీనామా చేయకుండా కాంగ్రెస్‌లో చేరారని.. ఆయన్ను కూడా అనర్హుడిగా ప్రకటించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మరో పిటిషన్ వేశారు. ఈ రెండు పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. అనర్హత వినతిపత్రాలను స్పీకర్ కార్యాలయంలో నేరుగా అందజేయాలని జీపీని గతంలో న్యాయమూర్తి ఆదేశించగా, ఆయన అందజేసిన విషయం తెలిసిందే. వాటిపై నిర్ణయం ఎంతవరకు వచ్చిందో వివరాలు స్పీకర్ కార్యాలయంలో తెలుసుకొని చెప్పాలని ఏజీ సుదర్శన్‌రెడ్డిని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.



ఇది స్టెగసోరస్ అస్థిపంజరం. ఇప్పటివరకూ దొరికినవాటిల్లో ఇదే అతి పెద్దది. ఇంతకీ విషయమేమిటంటే.. 27 అడుగుల పొడవున్న దీన్ని అమ్ముతారట. న్యూయార్క్‌లోని సదబీస్ వేలం సంస్థ జూలై 17 నుంచి జరగబోయే తమ వారోత్సవాల్లో దీన్ని వేలం వేయనుంది. కనీసం రూ. 50 కోట్లు వస్తాయని అంచనా. గతంలో టీరెక్స్ డైనోసార్ల అస్థిపంజరాన్ని అమ్మారు. స్టెగసోరస్‌ది అమ్మడం మాత్రం ఇదే తొలిసారి. కొంటారా మరి..



'వలస' నేతల్లో ఒక్కరే గెలుపు

బీజేపీ పోటీ చేసిన 17 సీట్లలో 9 మంది బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నుంచి వచ్చిన వాళ్లే

- వీరిలో ఆదిలాబాద్ నుంచి గోడం నగేష్ ఒక్కరే విజయం
- గెలిచిన 8 మంది ఎంపీల్లో ఈటల, డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్ కొన్నేళ్ల కిందటే పార్టీలోకి

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై పోటీచేసిన 'వలస' నేతల్లో ఒకే ఒక్కరే విజయతీరానికి చేరుకుని సత్తా చాటారు. మొత్తం 17 ఎంపీ సీట్లలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నుంచి సరిగ్గా ఎన్నికలకు ముందు పార్టీలో చేరి బీజేపీ టికెట్ తెచ్చుకున్నవారు లేదా పార్టీకి ప్రత్యక్షంగా సంబంధం లేని వారు మొత్తంగా 9 మంది పోటీచేశారు. ఈ వలస నేతల్లో బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన మాజీ ఎంపీ గోడం నగేష్.. గతంలో తాను ప్రాతినిధ్యం వహించిన ఆదిలాబాద్ నుంచే గెలుపొందారు. మిగతా ఎనిమిది మంది పరాజయం పాలయ్యారు. జహీరాబాద్ నుంచి బీఆర్‌ఎస్ ఎంపీ బీబీ పాటిల్, నాగర్‌కర్నూల్ నుంచి బీఆర్‌ఎస్ ఎంపీ పి.రాములు (ఆయన తన కుమారుడు భరత్ ప్రసాద్‌కు టికెట్ ఇప్పించుకున్నారు), మహబూబాబాద్ నుంచి బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ డా.సీతారాంనాయక్, వరంగల్ నుంచి బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆరూరు రమేశ్, నల్లగొండ నుంచి బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, పెద్దపల్లి నుంచి కాంగ్రెస్‌నేత గోమాస శ్రీనివాస్, ఖమ్మం నుంచి సంఘపరివార్ క్షేత్రాల్లో పనిచేస్తూ గుర్తింపు పొందిన తాండ్ర వినోద్‌రావు, హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేసిన మాధవీలత (సంఘపరివార్‌తో ఉన్న సంబంధాలు కలిసిరాగా, టికెట్ వచ్చే నాటికి బీజేపీ సభ్యత్వం లేకపోయినా ఆమెకు సీటు) వలసనేతల జాబితా కోవలోకి వస్తారు.

గెలిచిన 8 ఎంపీల విషయానికొస్తే...

ప్రస్తుతం బీజేపీ గెలిచిన 8 సీట్లలో సిట్టింగ్ ఎంపీలు జి.కిషన్‌రెడ్డి (సికింద్రాబాద్), బండి సంజయ్ (కరీంనగర్), అర్వింద్ ధర్మపురి (నిజామాబాద్), గోడం నగేశ్ (ఆదిలాబాద్–బీఆర్‌ఎస్ నుంచి ఎన్నికలకు ముందు బీజేపీలో, చేరారు), ఈటల రాజేందర్ (మల్కాజిగిరి), డీకే అరుణ (మహబూబ్‌నగర్), ఎం.రఘునందన్‌రావు (మెదక్), కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (చేవెళ్ల) ఉన్నారు. వీరిలో అర్వింద్ 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందుగానే బీజేపీలో చేరి ఆ ఎన్నికల్లో నిజామాబాద్ సిట్టింగ్ ఎంపీ కల్వకుంట్ల కవితపై సంచలన విజయాన్ని నమోదు చేసుకున్నారు. మహబూబ్‌నగర్ నుంచి డీకే అరుణ గత లోక్‌సభ ఎన్నికల్లోనే బీజేపీ టికెట్‌పై పోటీచేసినా, ఆమె ఎక్కువకాలం కాంగ్రెస్‌లో కొనసాగినందున కొత్తగా కమలం గుర్తుతో ఆమెను ఓటర్లు గుర్తించలేదు. దాంతో ఆమె బీజేపీ టికెట్‌పై మళ్లీ 2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి సత్తా చాటి తొలిసారి పార్లమెంట్‌లోకి అడుగు పెడుతున్నారు. మెదక్ నుంచి ఎంపీగా గెలిచిన రఘునందన్‌రావు బీజేపీలో చేరి పదేళ్లకు పైగానే కాగా, 2018–23 మధ్యలో జరిగిన దుబ్బాక ఉప ఎన్నికల్లో బీజేపీ తరఫున గెలుపొందారు. 2023 చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడి నుంచే ఓటమిపాలయ్యారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ నుంచి గెలిచి తొలిసారి ఎంపీ అయ్యారు. ఇక కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విషయానికొస్తే...2014 లోక్‌సభ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ ఎంపీగా గెలిచారు. 2019లో చేవెళ్ల నుంచే కాంగ్రెస్ అభ్యర్థిగా ఓడారు. ఆ తర్వాత బీజేపీలో చేరి మళ్లీ 2024 పార్లమెంట్ ఎన్నికల్లో అక్కడి నుంచే ఆ పార్టీ టికెట్‌పై ఎంపీగా విజయం సాధించారు. టీఆర్‌ఎస్‌లో నెంబర్–టుగా ప్రాధాన్యత గల నేతగా గుర్తింపు పొందిన ఈటల రాజేందర్ కేబినెట్ నుంచి ఉద్వాసనకు గురయ్యాక బీజేపీలో చేరారు. ఎమ్మెల్యేగా రాజీనామాతో వచ్చిన హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో మంచి మెజారిటీతో గెలుపొంది సంచలనం సృష్టించారు. ఐతే 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజురాబాద్, గజ్వేల్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. మళ్లీ 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ టికెట్ పై మల్కాజిగిరి నుంచి భారీ మెజారిటీతో గెలిచి తొలిసారిగా ఎంపీగా ఎన్నికయ్యారు. ఇదిలా ఉంటే...బీజేపీలోనే పుట్టి పెరిగి ఒరిజనల్, పక్కా కమలనాథులుగా ఉంటూ ఎంపీలుగా గెలిచిన వారు మాత్రం కిషన్ రెడ్డి, బండి సంజయ్ మాత్రమేనని పాతతరం పార్టీ నాయకులు పేర్కొంటుండడం కొసమెరుపు.



గోడం నగేష్

మా ఓట్లు ఏమయ్యాయి?

టీడీపీ ఓడిపోతుందనుకున్న చోట భారీ మెజారిటీలా!

గొడవలు జరిగినా రీ పోలింగ్ అడగంది ఇందుకేనా? • వైఎస్సార్‌సీపీకి బాగా పట్టున్న గ్రామాల్లోనూ టీడీపీకి మెజారిటీ ఎలా?

సాక్షి, అమరావతి : ''మేం జగన్‌కే ఓటేశాం.. మా ఓట్లన్నీ ఏమైపోయాయి.. ఏదో జరిగింది.. లేకపోతే అధికార పార్టీకి ఇంత దారుణంగా సీట్లు రావడమేంటి? బంఫర్ మెజారిటీతో గెలుపొందుతాం అనుకున్న చోట టీడీపీకి మెజారిటీ రావడం ఏమిటి? వైఎస్సార్‌సీపీ ఓట్లు పక్కాగా 90 శాతం పైగా ఉన్న ఒక బూత్ పరిధిలో టీడీపీకి మెజారిటీ రావడాన్ని ఏమనుకోవాలి? ఏదో జరిగింది.. ఆ ఓటింగ్ మిషన్లను ఏదో చేశారు.. లేకపోతే ఇంత దారుణంగా ఫలితాలెలా వస్తాయి?'' అని రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ చూసినా ఈ చర్చే నడుస్తోంది. ఇంతలా ఫలితాలను తాము కలలో కూడా ఊహించలేదని టీడీపీ నేతలే ఆశ్చర్యపోతున్నారంటే ఏం జరిగి ఉంటుందనేది సర్వత్రా చర్చనీయాంశమైంది. కూటమి గెలిచిందనే ఆనందం కంటే జగన్ ఓడిపోయారనే బాధ అత్యధికుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. 'మా గ్రామంలో 3 వేల ఓట్లు ఉంటే అందులో కనీసం 2100 ఓట్లు వైఎస్సార్‌సీపీకే పడ్డాయి.. ఇలా ఒక నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ జరిగితే జగన్ ఓడిపోవడమేంటి' అంటూ అనేక గ్రామాల్లో ప్రజలు లెక్కలు వేస్తున్నారు. పలువురు రైతులు పల్లెల్లో ఒక చోట చేరి 'మనకు ఎంతో మేలు చేసిన జగన్‌కే కదా మనం ఓటేశాం. ఇలా అన్ని ఊళ్లలోనూ జరిగింది.. మరి మనందరి ఓట్లు ఏమైపోయాయి?' అని ఆవేదన పంచుకుంటున్నారు. జగనన్నకే మేమూ ఓటేశాం అన్నకు మరీ ఇంత తక్కువ సీట్లు రావడమేంటంటూ అక్కచెల్లెమ్మలు కన్నీరు మున్నీరవుతున్నారు. బంధువులకు, స్నేహితులకు, తెలిసిన వారికి ఫోన్లు చేసి ఏం జరిగి ఉంటుందంటూ ఆరా తీస్తున్నారు. ఉద్యోగులు సైతం ఈ ఫలితాల పట్ల విస్మయం చెందుతున్నారు. సచివాలయాల ఉద్యోగులు, కొన్ని సామాజిక వర్గాల ఉద్యోగులు, వలంటీర్లు వైఎస్సార్‌పార్టీకి ఓటేశారని, వీరందరి ఓట్ల వల్ల అనేక సీట్లు వచ్చే అవకాశం ఉందని వారు చర్చించుకుంటున్నారు.

కుట్ర జరిగిందనిపిస్తోంది..

కొందరైతే గెలుపు ఓటములు సహజం, కానీ గెలిచిన వారికి ఇంత భారీ మెజారిటీలు రావడం, వైఎస్సార్‌సీపీకి అత్యంత పట్టున్న అనేక జిల్లాల్లోనూ కూటమి క్లీన్ స్వీప్ చేయడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కచ్చితంగా ఏదో జరిగిందని వారంతా భావిస్తూ సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు. ఈవీఎంల సాంకేతికత, హ్యాకింగ్, ట్యాంపరింగ్ వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. కొన్ని ఈవీఎంలలో ఓట్ల లెక్కల్లో తేడాలు రావడం, వాటిని రిటర్నింగ్ అధికారులు ఆ తర్వాత సరిచేయడం వంటి ఉదాహరణలు అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయని చెబుతున్నారు. ఎన్నికల తర్వాత టీడీపీ అధినేత గుట్టుగా విదేశాలకు వెళ్లిపోవడం కూడా కుట్రలో భాగమనే వాదనలు వినిపిస్తున్నాయి. విదేశాల నుంచి ఈవీఎంలను ప్రభావితం చేసేలా ఏదో జరిగిందని పలువురు నాయకులు సైతం ఆరోపణలు చేయడం ప్రజల అనుమానాలకు బలం చేకూర్చింది. మరోవైపు జగన్‌కు ప్రజా మద్దతు ఏ మాత్రం తగ్గడం లేదు. సోషల్ మీడియా మొత్తం జగన్‌కు అనుకూల పోస్టులతో నిండిపోయింది. కూటమి ఏదో కుట్ర చేసి గెలిచి ఉండవచ్చని, జగన్ మళ్లీ సీఎం అవుతారని పోస్టులు షేర్ చేస్తున్నారు. సామాన్య జనం కూడా జగన్‌కు తమ మద్దతు ఎప్పటికీ ఉంటుందని, విద్య, వైద్యం, సంక్షేమంలో ఆయన తీసుకువచ్చిన విప్లవాత్మక సంస్కరణలు ఎప్పటికీ మరచిపోలేమని అంటున్నారు. కచ్చితంగా ఏదో జరిగితే తప్ప కూటమికి ఇంత ఘన విజయం సాధ్యం కాదని ప్రజల్లో భారీగా చర్చ జరుగుతుండటం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. ఇదే అంశం న్యాయ స్థానం వరకు చేరితే పరిస్థితి ఏమిటనే ప్రశ్న కూటమిని కలవరానికి గురిచేస్తోంది. వైఎస్సార్‌సీపీని ఇంతలా ఓడించేంత వ్యతిరేకత ప్రజల్లో లేదనే విషయం ఈ చర్చలతో స్పష్టమవుతోంది.

టీడీపీ, జనసేన విధ్వంసం

- స్వైరవిహారం చేసిన నేతలు, కార్యకర్తలు
- విగ్రహాలు, శిలాఫలకాల ధ్వంసం, వాహనాల దహనం
- సచివాలయ బోర్డుల తొలగింపు .. పలుచోట్ల కూటమి జెండాల ఆవిష్కరణ
- వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

కుట్ర జరిగిందనిపిస్తోంది..



ఈ ఫలితాలపై ఎవ్వరికీ నమ్మకం కలగడం లేదు. మా గ్రామంలో అత్యధిక శాతం మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేశారు. కానీ ఎన్నికల ఫలితాల తర్వాత చూస్తే తారుమారైనట్లు కనిపించింది. సంక్షేమపథకాలు అందుకున్నకున్న అనేక కుటుంబాలు జగన్ వెంటే నడిచాయి. ఎక్కువ మంది మహిళలు, రైతులు, వృద్ధులు వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారు. కానీ ప్రతిరౌండులోనూ ఫలితాల్లో మెజార్టీ ఓట్లు ఏకపక్షంగా టీడీపీకి వచ్చాయి. జగన్‌ను అధికంగా అభిమానించే గ్రామాల్లోనే ఇలా టీడీపీకి ఓట్లు పడటం చూస్తుంటే ఎన్నో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

– దుంపల ఉమ (రైతు), కమలనాభపురం, కోటబొమ్మాళి మండలం, శ్రీకాకుళం జిల్లా

మోసం జరిగిందనడానికి ఇదే సాక్ష్యం



ఇచ్ఛాపురం మండలం బూర్జపాడు గ్రామంలోని 78వ బూత్ నెంబర్ మాది. ఈ బూత్‌లో ఓటు వేసిన వాళ్లంతా మా వాళ్లే. సుమారు 250 మంది వరకు ఉంటారు. వీరంతా వైఎస్సార్‌సీపీకే వేశారు. అలాగే వలంటీర్లు, వారి కుటుంబ సభ్యులు మరో 200 మంది వరకు వైసీపీ అభిమానులు ఉన్నారు. 746 ఓట్లు పోలైన మా బూత్‌లో ఎంత తక్కువగా అనుకున్నా 500 పైగా మెజార్టీ వస్తుందని భావించాం. ఓట్ల లెక్కింపులో అనూహ్యంగా టీడీపీకి 200 పైచిలుకు ఓట్లు మెజార్టీ రావడంతో టీడీపీ వాళ్లే ఆశ్చర్యపోయారు. ఏదో టెక్నికల్‌గా మోసం జరిగిందని ప్రతీ ఒక్కరం నమ్ముతున్నాం.

– దున్న గురుమూర్తి, వైస్ ఎంపీపీ, ఇచ్ఛాపురం మండలం, శ్రీకాకుళం జిల్లా

వైఎస్సార్‌సీపీ హవా ఉన్న గ్రామంలో కూటమికి మెజార్టీ!?



వైఎస్సార్‌సీపీ హవా ఉన్న పసపాం గ్రామంలో 809 ఓట్లు పోలైతే వాటిలో 594 ఓట్లు జనసేన అభ్యర్థికి వచ్చాయి. కేవలం 215 ఓట్లు మాత్రమే వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి పడ్డాయి. గ్రామంలో 60–77 శాతం మంది ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారు. గత ఎన్నికలన్నింటిలో 70 శాతం ఓట్లు వైఎస్సార్‌సీపీకి పోలయ్యాయి. ఏదో తేడా జరిగినట్లు అనిపిస్తోంది.

– మహంతి కల్యాణి, పసపాం ఎంపీటీసీ, పూసపాటిరేగ మండలం, విజయనగరం జిల్లా

క్లుప్తంగా...

బీజేపీ సంకీర్ణేతర కూటమికి మద్దతు ఇస్తాం

బీఆర్ఎస్ తీరుతోనే బీజేపీ లాభపడింది: ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: బీజేపీ సంకీర్ణయేతర ప్రభుత్వం ఏర్పాటయ్యే అవకాశాలుంటే కచ్చితంగా మద్దతు ఇస్తామని ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ప్రకటించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నాన్ బీజేపీ, నాన్ఎన్డీయే కూటమికి తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కాలేని పరిస్థితి తలెత్తితే, అవసరమైతే ప్రభుత్వం ఏర్పాటు చేసే కూటమికి సహకారం అందిస్తామన్నారు. బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకోవడమే తమ లక్ష్యమని చెప్పారు. తెలంగాణలో బీఆర్ఎస్ తీరుతోనే బీజేపీ లాభపడిందని ఒవైసీ అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ అనేక స్థానాల్లో బీజేపీకి బహిరంగంగా మద్దతిచ్చిందని, వారి వ్యూహం వెనుక కారణమేంటో తెలియడం లేదన్నారు. దేశంలో ఉన్న ప్రస్తుత పరిస్థితుల ప్రకారం బీజేపీకి ఇన్ని సీట్లు రాకూడదని, బీజేపీ సంకీర్ణేతర పక్షాలు సరిగ్గా పనిచేసి ఉంటే సీట్ల సంఖ్య 150కు మించేది కాదని పేర్కొన్నారు.

వలస నేతలకు 'ఓటమి'

దానం, రంజిత్, సునీత, నీలం మధుకు తప్పని పరాజయం

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన వలస నేతలు ఓటమి పాలయ్యారు. ఈ సారి అప్పటికప్పుడు పార్టీలోకి వచ్చిన ఐదుగురికి కాంగ్రెస్ పార్టీ పోటీ చేసే అవకాశం కల్పించింది. ఇందులో దానం నాగేందర్ (సికింద్రాబాద్), రంజిత్‌రెడ్డి (చేవెళ్ల), సునీత మహేందర్‌రెడ్డి (మల్కాజ్‌గిరి), నీలం మధు (మెదక్) పరాజయం పాలయ్యారు. కేవలం కడియం కావ్య (వరంగల్) మాత్రమే విజయం సాధించారు. టీచర్‌గా పనిచేస్తూ రాజకీయాల్లోకి వచ్చి ఆదిలాబాద్ నుంచి పోటీ చేసిన ఆత్రం సుగుణ కూడా ఓటమి పాలు కావడం గమనార్హం.

అయోధ్యలోనే బీజేపీని ఓడించారు

రానున్న రోజుల్లో దేశంలో సంకీర్ణ ప్రభుత్వం తప్పదు: నారాయణ



సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ ఎన్ని వేషాలు వేసినా బీజేపీ ప్రకటించిన 400 సీట్లు సాధించలేకపోయిందని, చివరకు రామాలయాన్ని నిర్మించామని గొప్పగా ప్రచారం చేసుకున్న అయోధ్య లోనే ఆ పార్టీని ప్రజలు ఓడించారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పలు రాష్ట్రాల్లో బీజేపీకి వ్యతిరేకంగా అన్ని రాజకీ య పార్టీలను కాంగ్రెస్ కలుపుకుపోలేదని, ఏకపక్షంగా వ్యవహరించిందని విమర్శించారు. తమిళనాడును చూసి కాంగ్రెస్ నేర్చుకోవాలని, అక్కడి ఫార్ములాను దేశవ్యాప్తంగా అమలు చేసి ఉంటే కాంగ్రెస్ అధికారంలో ఉండేదని చెప్పారు. రానున్న రోజుల్లో దేశంలో సంకీర్ణ ప్రభుత్వం తప్పదన్నారు. చంద్రబాబుకు హైదరాబాద్‌పై ఆశ ఉన్నదని, కానీ రాజధాని మాత్రం ఏపీలోనే ఉండాలని చెప్పారు. గతంలో జగన్ ఇచ్చిన సంక్షేమ పథకాలు ఎవ్వరూ ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కన పెట్టి, సొంత ప్రయోజనాల కోసం ఎటువంటి కార్యక్రమాలు చేపట్టినా చంద్రబాబు మరోసారి తప్పు చేసినట్టేనని నారాయణ వ్యాఖ్యానించారు.

సీఎం రేవంత్‌తో సీపీఐ బృందం భేటీ. లోక్‌సభ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో సీఎం రేవంత్‌ను సీపీఐ నాయకులు కలిశారు. బుధవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి కూనంనేని సాంబశివరావు, చాడ వెంకట్ రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, పశ్య పద్మ, ఇ.టి.నర్సింహలు వెళ్లారు. రాష్ట్రంలో కూటమి తరఫున కాంగ్రెస్ 8 లోక్‌సభ స్థానా లు, ఉప ఎన్నికలో ఒక ఎమ్మెల్యే స్థానం గెలుచుకోవడం పట్ల సీఎంకు అభినందనలు తెలిపారు.



శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన భువనగిరి లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

పోలీస్ కస్టడీకి నటి హేమ

బనశంకరి: బెంగళూరు రేవ్ పార్టీలో డ్రగ్స్ తీసుకున్నారనే కేసులో అరెస్టు అయిన సినీ నటి హేమను సీసీబీ పోలీసులు బుధవారం నగర శివార్లలోని ఆనేకల్ నాల్గోవ అదనపు సివిల్ జేఎంఎఫ్‌సీ కోర్టులో హాజరుపరిచారు. మరింత విచారణ నిమిత్తం తమ కస్టడీకి అప్పగించాలని సీసీబీ న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు. ఇరువర్గాల వాదనలను విన్న న్యాయమూర్తి 24 గంటల పాటు సీసీబీ కస్టడీకి అనుమతించారు. కాగా, పోలీస్ వాహనంలో ఆనేకల్ కోర్టుకు రాగానే హేమ 'నేను హత్య చేశానా? అర్ధరాత్రి తీసుకెళ్లి అడవిలో సంతకం చేయించుకున్నారు. నేను ఏమి చేశానని అర్ధరాత్రి పూట తీసుకెళ్తున్నారు?' అని మీడియా ముందు వాపోయారు.

కేంద్ర కేబినెట్‌లో ఇద్దరికి చాన్స్?

తెలంగాణ నుంచి ఒక రెడ్డి, ఒక బీసీకి బెర్త్‌లు దక్కే అవకాశం

రేసులో కిషన్‌రెడ్డి, డీకే, బండి, ఈటల, ధర్మపురి



కిషన్‌రెడ్డి | డీకే అరుణ | బండి సంజయ్ | ఈటల రాజేందర్ | ధర్మపురి అరవింద్

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలో మూడోసారి కొలువు దీరనున్న ఎన్‌డీఏ ప్రభుత్వంలో ఈసారి తెలంగాణకు రెండు కేబినెట్ బెర్త్‌లు దక్కే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. భవిష్యత్‌లో రాష్ట్రంలో ఎదిగేందుకు ఉన్న అవకాశాలను పరిగణనలోకి తీసుకుంటూ ఈ మేరకు పార్టీలో అంతర్గత నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. దీనిపై ఇప్పటికే ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలు జాతీయ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాతో చర్చించినట్టు తెలిసింది. పార్టీలో సీనియారిటీ, విధేయత, కులాల సమీకరణలు దృష్టిలో పెట్టుకొని ఒక రెడ్డి, మరొక బీసీ సామాజికవర్గ నేతకు కేబినెట్‌లో చోటు కల్పించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెడ్డి సామాజిక వర్గం నుంచి ఇదివరకే కేబినెట్ మంత్రిగా పనిచేసిన జి.కిషన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ నుంచి గెలిచిన డీకే అరుణ పోటీలో ఉండే అవకాశం ఉంది. అయితే కిషన్‌రెడ్డినే మరోమారు కేబినెట్‌లోకి తీసుకునే అవకాశం ఉందని పార్టీవర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఆయన్ను పార్టీ అధ్యక్షుడిగా కొనసాగించాలని నిర్ణయిస్తే అరుణకు అవకాశాలుంటాయని చెబుతున్నారు. ఇక బీసీ సామాజికవర్గం నుంచి బండి సంజయ్, ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్‌లలో ఒకరికి అవకాశం ఉంటుందని అంటున్నారు. ఇందులో వరుసగా రెండోసారి గెలిచిన బండికే ఎక్కువ అవకాశాలున్నాయని తెలుస్తోంది. మోదీ పట్ల ఉన్న విధేయత, 2 లక్షలకుపైగా మెజారిటీ, రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో పార్టీ పటిష్టతకు చేసిన కృషికి గుర్తింపుగా ఆయన్ను కేబినెట్‌లోకి తీసుకుంటారని అంటున్నారు. ఆయనకు సంఘ్ కుటుంబం నుంచి మద్దతు లభిస్తుందనే వాదన ఉంది. ఇక సీనియర్ నేతగా ఈటలకు సైతం అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నా, తొలిసారి ఎంపీగా ఎన్నికవడం, పార్టీలో చేరి ఎక్కువకాలం కాకపోవడం వంటి అంశాలు ఆయనకు ప్రతికూలంగా మారే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. కేబినెట్‌లో తీసుకునే వారి పేర్లపై గురువారం లేక శుక్రవారాల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఈ నెల 8 లేదా 9న ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణస్వీకారం ఉంటుంది. అంతకుముందే మంత్రి పదవులపై స్పష్టత రావొచ్చని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి బదిలీ

▶ మొదటి పేజీ తరువాయి

చేశాడు. అక్కడ రఘునందన్‌రావుకు 63 వేలు వస్తే బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి 65 వేలు మాత్రమే వచ్చాయి. కేసీఆర్, హరీశ్‌లిద్దరూ బీఆర్ఎస్ ఓట్లను పూర్తిగా రఘునందన్ రావుకు బదిలీ చేయించి మెదక్‌లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన బలహీన వర్గాల అభ్యర్థిని ఓడించారు. నమ్మి బీఆర్ఎస్ తరఫున నిలబడిన వెంకట్రామిరెడ్డిని మోసం చేశారు. సిద్దిపేటలో జరిగిన నష్టం కారణంగానే కాంగ్రెస్ మెదక్‌లో ఓడిపోయింది. మా ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు కేసీఆర్ నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటాడు. ఆయన తెలంగాణ రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రంలో ఉన్నంత కాలం కుట్రలు కొనసాగుతాయి. ఆయన రాజకీయ జూదగాడు. బూడిద అయిన బీఆర్ఎస్ మళ్లీ పుట్టేది లేదు.' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

మాకివి ఉగాది పచ్చడి లాంటి ఫలితాలు

'లోక్‌సభ ఎన్నికల్లో మాకు ఉగాది పచ్చడి లాంటి ఫలితాలు వచ్చాయి. కొంత తీయగా, కొంత చేదుగా, కొంత పుల్లగా ఉంది. కానీ పచ్చడి మంచిది. ఇప్పుడొచ్చిన ఫలితాలను పీసీసీ అధ్యక్షుడిగా, ముఖ్యమంత్రిగా ఉగాది పచ్చడిలా స్వీకరిస్తున్నా. అసెంబ్లీ ఎన్నికల్లో 39.5 శాతం ఓట్లతో 65 ఎమ్మెల్యే స్థానాల్లో కాంగ్రెస్, సీపీఐలు విజయం సాధించాయి. ఇప్పుడు 41 శాతం ఓట్లతో 64 స్థానాల్లో ఆధిక్యతను నిలబెట్టుకోవడంతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ సెగ్మెంట్‌ను గెలుచుకున్నాం. అయితే ఫలితాలు మేము, అభిమానులు ఆశించిన స్థాయిలో మాత్రం లేవు. ఇప్పటివరకు 18 గంటలు పనిచేశాం. ఇంకా రెండు గంటలు అదనంగా పనిచేస్తాం..' అని సీఎం చెప్పారు.

మా పాలనను ప్రజలు సమర్థించారు

'ఈ ఎన్నికలు మా పాలనకు రిఫరెండం అని చెప్పాం. మా పాలనను మెచ్చుకున్న ప్రజలు ఓట్లు, సీట్లను పెంచి మమ్మల్ని ఆశీర్వదించారు. ఈ ఎన్నికల్లో కష్టపడిన మంత్రివర్గ సహచరులు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర, జిల్లా స్థాయి నేతలు, మండల, గ్రామ స్థాయి కార్యకర్తలు, నేతలకు ధన్యవాదాలు. వారి శ్రమ, కష్టం, ప్రయత్నం వల్లనే ఓట్ల శాతం, పార్లమెంటు సీట్లు, ఎమ్మెల్యే స్థానాల్లో మెజార్టీ వచ్చింది. మా గౌరవాన్ని, రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని పార్టీ శ్రేణులు నిలబెట్టాయి. రాహుల్‌గాంధీ చేపట్టిన దేశవ్యాప్త యాత్రలు, ఇండియా కూటమి ఏర్పాటు, నేతల మధ్య సమన్వయంతో పాటు మోదీ, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను, పరిపాలనా వైఫల్యాలకు దేశ స్థాయిలో ప్రచారం కల్పించడం ద్వారా ఈ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించాం..' అని రేవంత్ అన్నారు.

గెలుపోటములకు నాదే బాధ్యత

'మల్కాజిగిరి సిట్టింగ్ ఎంపీ సీటు కోల్పోయినా కంటోన్మెంట్ అసెంబ్లీని గెలుచుకున్నాం. మహబూబ్‌నగర్‌లో కూడా ఓడిపోయాం. ఇవన్నీ ప్రజాతీర్పులో భాగం. ప్రజలు ఏ తీర్పునిచ్చినా శిరసావహిస్తాం. నేను రాష్ట్రానికి ముఖ్యమంత్రిని.. జిల్లాకు కాదు. అలాగే పీసీసీ అధ్యక్షుడిని కూడా రాష్ట్రానికే. ఈ రాష్ట్రంలో ఏ సీటు ఓడినా, గెలిచినా నాదే బాధ్యత. రాష్ట్ర సమస్యలను పరిష్కరించడమే నా మొదటి ప్రాధాన్యత..' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.



బుధవారం జూబ్లీహిల్స్ క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మహేశ్‌కుమార్, కడియం శ్రీహరి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్

మోదీ మళ్లీ ప్రధాని పదవి చేపట్టకూడదు

'2024లో మోదీ గ్యారంటీ అంటూ ఏకవ్యక్తి నాయకత్వంతో ప్రజల దగ్గరికెళితే బీజేపీని దేశ ప్రజలు తిరస్కరించారు. ఆ గ్యారంటీకి వారంటీ అయిపోయిందని, మోదీకి కాలం చెల్లిందని తీర్పిచ్చారు. ఆయన నాయకత్వాన్ని తిరస్కరించారు. మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీని చీల్చడం ద్వారా కుట్రలు, కుతంత్రాలు చేసి ప్రభుత్వం ఏర్పాటు చేయడాన్ని ప్రజలు తిరస్కరించారు. అక్కడ తలెత్తుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. తెలంగాణలో బీజేపీ ఇదే రకమైన ప్రయోగం చేస్తుందో లేదో చూడాలి. ప్రపంచంలోనే కేసీఆర్ అత్యంత అవినీతిపరుడని, అవినీతి కుటుంబమని ఆరోపణలు చేసిన బీజేపీ వారితోనే ఎలా జట్టు కడుతోందో, ఎలా సమర్థిస్తోందో ఆ పార్టీ నాయకులు ప్రజలకు వివరించాలి. మోదీ తక్షణమే ప్రధాని పదవికి రాజీనామా చేసి మళ్లీ ఆ పదవిని చేపట్టకూడదు..' అని సీఎం అన్నారు.

ఏపీతో సమస్యలు చర్చలతో పరిష్కరించుకుంటాం

'ఏపీ ప్రజల తీర్పును జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబులు స్వాగతించిన తర్వాత మాదేముంటుంది. ఏ ప్రభుత్వం ఏర్పడినా స్నేహపూర్వక వాతావరణంలో చర్చలతో సమస్యలు పరిష్కరించుకుంటామని ముందే చెప్పా. ఇప్పుడు కూడా దానికే కట్టుబడి ఉన్నా. ఏపీకి ఇచ్చిన ప్రత్యేక హోదా హామీకి కట్టుబడి ఉన్నాం..' అని సీఎం చెప్పారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన మల్లురవి, చామల కిరణ్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు పాల్గొన్నారు.


ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు సాధిస్తా

మోదీ హవాతో పాటు నా కృషి నన్ను గెలిపించింది: ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోనూ ప్రధాని మోదీ హవా పనిచేయడంతో పాటు, తాను సాగించిన కృషి ఫలించడంతో ఎంపీగా గెలిచానని బీజేపీ నేత, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఎంపీగా తన వంతు కష్టపడి పనిచేసి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం తన నివాసంలో మీడియా ప్రతినిధులతో విశ్వేశ్వర్ రెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తన గెలుపునకు అనేక అంశాలు కలిసి వచ్చాయన్నారు. గతంలో చేవెళ్లలోని గ్రామీణ ప్రాంతాల్లో పార్టీకి, తనకు అంతగా మద్దతు లేకపోగా ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో ఆ లోటు కూడా తీరిపోయిందన్నారు. గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు గ్రామగ్రామాన పర్యటించి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టానని చెప్పారు. ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన అనుభవం ఈ సారి కూడా తనకు పనికి వచ్చిందన్నారు. ఎన్నికలు ముగియడంతో ఇక రాజకీయాలు పక్కనపెట్టి చేవెళ్ల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. పార్లమెంట్‌లో జాతీయ, రాష్ట్ర అంశాలతో పాటు చేవెళ్లకు సంబంధించిన అంశాలు కూడా లేవనెత్తి వాటి సత్వర పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని చెప్పారు. గతంలో తాను ఎంపీగా ఉన్న నియోజకవర్గానికి హైవే ప్రాజెక్ట్ తీసుకు వచ్చానని, ఇప్పుడు కూడా రాష్ట్రానికి, నా నియోజకవర్గానికి వివిధ ప్రాజెక్ట్‌ల సాధనకు కృషిచేస్తానని విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మ్యాచింగ్ గ్రాంట్లు, నిధులతో చేవెళ్ల నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. వ్యక్తిగతంగానూ ఈ లోక్‌సభ పరిధిలో ఉపాధి కల్పనా చర్యలు చేపట్టి ప్రజలకు మేలు కలిగేలా చూస్తామన్నారు. సెక్యూరిటీ, మందీ మార్బలంతో హడావుడి చేయకుండా ప్రజల వద్దకెళ్లి వారి సమస్యల పరిష్కారానికి పాటుపడతానని విశ్వేశ్వర్ రెడ్డి చెప్పారు.

లక్ష మందికిపైగా నోటాకే ఓటేశారు



సాక్షి, మంచిర్యాల డెస్క్: తెలంగాణలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నోటాకు 1,04,244 ఓట్లు పోల్ అయ్యాయి. వీటిలో 1,583 ఓట్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వచ్చాయి. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో సరైనవారు లేరని ఓటర్లు భావిస్తే.. నోటాకు ఓటువేసే అవకాశం ఎన్నికల సంఘం 2013 నుంచి కల్పించింది. ఈవీఎంలో అభ్యర్థుల గుర్తుల తర్వాత చివరిగా నోటా గుర్తు ఉంటుంది. చాలాచోట్ల రిజిస్టర్ పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు కూడా ఓట్లు సాధించడంలో నోటా కంటే వెనుకబడ్డారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల తర్వాత నోటాకు ఓట్లు పడగా నాలుగో స్థానంలో నిలవడం గమనార్హం. మల్కాజిగిరి నియోజకవర్గంలో అత్యధికంగా 13,206 ఓట్లు నోటాకు పడగా, అత్యల్పంగా జహీరాబాద్ నియోజకవర్గంలో 2,933 ఓట్లు పడ్డాయి. పోస్టల్ ఓట్లలో కూడా మల్కాజిగిరిలో అత్యధికంగా 160 ఓట్లు వచ్చాయి.

నియోజకవర్గం	పోస్టల్	ఈవీఎం	శాతం	స్థానం	పోటీపడిన అభ్యర్థులు
ఆదిలాబాద్	112	11,650	0.95	4	12
పెద్దపల్లి	120	5,591	0.52	5	42
కరీంనగర్	65	5,373	0.41	9	28
నిజామాబాద్	43	4,440	0.36	7	29
జహీరాబాద్	44	2,933	0.24	10	19
మెదక్	35	4,582	0.33	9	44
మల్కాజిగిరి	160	13,206	0.69	4	22
సికింద్రాబాద్	74	5,092	0.49	4	45
హైదరాబాద్	39	2,867	0.27	5	30
చేవెళ్ల	110	6,313	0.38	4	43
మహబూబ్‌నగర్	44	4,286	0.35	6	31
నాగర్‌కర్నూల్	69	4,511	0.38	7	19
నల్లగొండ	217	5,869	0.47	7	22
భువనగిరి	75	4,571	0.33	10	39
వరంగల్	171	8,209	0.66	6	42
మహబూబాబాద్	80	6,511	0.59	8	23
ఖమ్మం	125	6,657	0.54	7	35

ఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి ఉత్సవాలు

మీడియాతో ఇష్టాగోష్టిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- ఈసారి ప్రారంభ వేడుకలకు సోనియాను ఆహ్వానిస్తామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి ఉత్సవాలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఉత్సవాల ప్రారంభం సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని, ఉత్సవాల ప్రారంభానికి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీని ఆహ్వానిస్తామని చెప్పారు. బుధవారం తన నివాసంలో విలేకరులతో ఇష్టాగోష్టిగా రేవంత్ మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేస్తామన్నారు. సచివాలయం లోపల, బయట అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్సవాలు ఘనంగా చేపడతామని చెప్పారు.

రేవంత్‌కు టీపీసీసీ కార్యవర్గం అభినందనలు

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఫలితాలపట్ల సంతోషం వ్యక్తం చేసిన టీపీసీసీ కార్యవర్గం.. సీఎం రేవంత్‌ను అభినందించింది. ఈ మేరకు సీఎం క్యాంపు కార్యాలయంలో బుధవారం టీపీసీసీ కార్యవర్గ సభ్యులు మహేశ్‌కుమార్ గౌడ్, వేం నరేందర్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్, అనిల్‌కుమార్ యాదవ్, మల్లు రవి, రోహిణ్‌రెడ్డి, ఫహీం ఖురేషీ, ఈరవత్రి అనిల్ రేవంత్‌ను కలిసి అభినందించారు. గతంలో మూడు స్థానాల్లో గెలిచిన కాంగ్రెస్ ఇప్పుడు రేవంత్ కృషి వల్ల 8 స్థానాల్లో గెలిచిందని ఈ సందర్భంగా వారు చెప్పారు.

సీఎంను కలిసిన ఎంపీ విజేతలు చామల, కడియం కావ్య

లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన చామల కిరణ్ కుమార్ రెడ్డి (భువనగిరి), కడియం కావ్య (వరంగల్) బుధవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో రేవంత్‌ను కలిశారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించడంతోపాటు తమ విజ యానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఓటుకు కోట్ల కేసులో నోట్ల కట్టలతో దొరికిన దొంగ

రేవంత్‌రెడ్డిపై రఘునందన్ ఫైర్

- సొంత జిల్లాలో ఎమ్మెల్సీ, ఎంపీ సీట్లు గెలిపించుకోలేకపోయారు
- నాకు హరీశ్‌రావు ఓట్లు వేయించారని గుడిలో ప్రమాణం చేయాలి
- మీలో తెలంగాణ పౌరుషం ఉంటే కేసీఆర్, హరీశ్‌రావులను అరెస్టు చేయించాలి

సాక్షి, హైదరాబాద్: ఓటుకు కోట్లు కేసులో పట్టపగలు నోట్ల కట్టలతో దొరికిన దొంగ రేవంత్‌రెడ్డి అనేది సమాజానికి తెలుసునని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు. సీఎంగా తన సొంత జిల్లాల్లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, ఎంపీ సీటు గెలిపించుకోలేని రేవంత్‌రెడ్డి పొంకణాలు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. బుధవారం పార్టీ కార్యాల యంలో బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 'నేను ఎవరి దయాదాక్షిణ్యాల మీద గెలవలేదు. నా గెలుపునకు మాజీ మంత్రి హరీశ్‌రావు మద్దతు ఇచ్చారని తప్పుడు ప్రచారం చేయడం సరైంది కాదు. హరీశ్‌రావు నాకు ఓట్లు వేయించారని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి వచ్చి రేవంత్‌రెడ్డి ప్రమాణం చేయాలి..' అని రఘునందన్‌రావు సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డిలో తెలంగాణ పౌరుషం ఉంటే 25 రోజుల్లో ఫోన్ ట్యాపింగ్, ఎన్నికల్లో డబ్బు పంపిణీ, ఇతర కేసుల్లో మాజీ పోలీస్ అధికారులు రాధాకిషన్‌రావు, భుజంగరావు, తదితరులు ఇచ్చిన వాంగ్మూలాలు, సాక్ష్యాల ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులను అరెస్టు చేయించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హరీశ్‌రావును ఇంకా ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. తాను ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి సీటును ఎంతకు అమ్ముకున్నారో రేవంత్ చెప్పాలన్నారు. సిట్టింగ్ సీటు మల్కాజిగిరిలో కాంగ్రెస్ ఓడిపోతే మాట్లాడని రేవంత్‌రెడ్డికి మెదక్ ఎంపీ సీటు గురించి ఎందుకని నిలదీశారు. 'కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు హరీశ్‌రావు శిష్యుడు కాదా? నీలం మధును బలి పశువును చేసింది మీరు కాదా?' అని రఘునందన్‌రావు నిలదీశారు. నీలం మధును హరీశ్‌రావు, రేవంత్‌రెడ్డి కలిసి బకరాను చేశారని వ్యాఖ్యానించారు.



పార్టీ కార్యాలయంలో ఈటల రాజేందర్‌ను అభినందిస్తున్న రఘునందన్‌రావు

ఎన్ని ప్రగల్భాలు పలికినా కాంగ్రెస్‌కు భంగపాటు తప్పలేదు

- 6 నెలల్లోనే ప్రజలతో ఛీ అనిపించుకున్న రేవంత్
- కాంగ్రెస్‌కు బలమే ఉంటే మల్కాజిగిరి, మహబూబ్‌నగర్‌లో ఎందుకు గెలవలేదు
- బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, మల్కాజిగిరి ఎంపీ ఈటల

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని ప్రగల్భాలు పలికినా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భంగపాటు తప్పలేదని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. రేవంత్ మల్కాజిగిరి తన సీటు అంటే.. ప్రజలు తమ తీర్పు ద్వారా స్పష్టమైన సమాధానం ఇచ్చారన్నారు. ఆరునెల ల్లోనే ప్రజలతో ఛీ అనిపించుకున్నారని చెప్పారు. తనపై కాంగ్రెస్ పార్టీ ఎన్ని విషప్రచారాలు చేసినా, సీఎం కుటుంబసభ్యులు స్వయంగా డబ్బులు పంపిణీ చేసినా మల్కాజిగిరిలో అధికారపార్టీకి ఓటమి తప్పలేదన్నారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబులతో కలిసి ఈటల మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ గెలిచింది కేసీఆర్‌పై వ్యతిరేకతతో తప్ప సొంత బలంతో కాదని, ఆ పార్టీకి బలమే ఉంటే మల్కాజిగిరి, మహబూబ్‌నగర్ స్థానాల్లో ఎందుకు గెలవలేకపోయారని ప్రశ్నించారు. ఈ సీట్లలో తప్పక గెలవాలని రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నా భంగపడాల్సి వచ్చిందని, ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే తెలంగాణ ప్రజలు బండకేసి కొడతారని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓట్లు 22 శాతం పెరిగితే.. కాంగ్రెస్‌కు ఒక్కశాతం కూడా పెరగలేదని చెప్పారు. అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలు పెట్టినా, డబ్బులు పంచినా వారి ఓటుశాతం పెరగలేదన్నారు. దీనిని బట్టి రాబోయే రోజుల్లో రాష్ట్రంలో కూడా బీజేపీ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టమైందన్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో రేవంత్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే దాకా తాము పోరాడతామన్నారు. బీజేపీ నుంచి 8 మంది ఎంపీలుగా అనుభవజ్ఞులను గెలిపించారని, గ్రామీణ రోడ్లు, నేషనల్ హైవేలు పూర్తిచేయడం, నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. బీజేపీ అభ్యర్థులు ఖమ్మం, మహబూబాబాద్‌లలో తప్ప మిగతా చోట్ల గెలుపు లేదా సెకండ్ ప్లేస్‌లో నిలిచారని విశ్లేషించారు. 'ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్ల పాలన కొనసాగించాలని కోరుకుంటున్నాం. వారంతట వారు కొట్లాట పెట్టుకొని పడిపోతే మేమేం చేయలేం. ప్రజలకు నచ్చకపోతే బండకేసి కొడతారు' అని హెచ్చరించారు. ఎన్డీఏలో భాగంగా ఎన్నికలకు ముందు పొత్తులు పెట్టుకున్న భాగస్వామ్యపార్టీలు, ఆ తర్వాత విడిపోతాయని అనుకోవడం లేదని ఒక ప్రశ్నకు ఈటల బదులిచ్చారు.

'పాలమూరు - రంగారెడ్డి'పై కొత్త డీపీఆర్ కావాలి

- రంగారెడ్డిని తీసివేయాలి.. డిండికి పాలమూరు నుంచి నీళ్లు వద్దు
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ వ్యాఖ్యలు

సాక్షి, హైదరాబాద్: పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టులో రంగారెడ్డి జిల్లాను తీసివేసి కేవలం పాలమూరు లిఫ్ట్ కోసం కొత్త డీపీఆర్ తయారు చేయాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. డిండికి పాలమూరు నుంచి నీళ్లు తీసుకోకూడదని ఆమె స్పష్టం చేశారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో అరుణ ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'పాలమూరు లిఫ్ట్ ప్రాజెక్టు డీపీఆర్ తయారు చేయాలని సీఎం రేవంత్‌ను కోరుతున్నాను.. వలసలు తగ్గాలంటే పాలమూరు లిఫ్ట్ తోనే 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు నీళ్ళు ఇవ్వాలి'' అని సూచించారు. ఈ నెల 7న తాను ఢిల్లీ వెళ్తానని, 8న ఎంపీగా ప్రమాణం చేస్తానని తెలియజేశారు. కేంద్ర మంత్రి పదవి ఎవరికి ఇవ్వాలనేది పార్టీ పెద్దలు నిర్ణయిస్తారని, దాని కోసం తాను లాబీయింగ్ చేయబోనని తెలిపారు. పార్టీ తనకు ఏ పదవి అప్పగించినా నిర్వర్తిస్తానని చెప్పారు.

రేవంత్ రాజీనామా కోరం

'ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి హద్దులు దాటి రిజర్వేషన్లపై అబద్ధాలు ప్రచారం చేశారు. ప్రజల్లో లేనిపోని అనుమానాలు సృష్టించారు.. 'మహబూబ్‌నగర్ ఎంపీ సీటుపై రేవంత్ ప్రత్యేక దృష్టి పెట్టి తానే అభ్యర్థి అన్నట్లుగా ప్రచారం చేశారు. ఇప్పుడు బీజేపీ ఎంపీగా నేను గెలిచాక ఓటమికి కారణాలు వెతుకుతున్నారు బీజేపీ కోసం బీఆర్ఎస్ పనిచేసిందని కుంటి సాకులు చెబుతున్నారు. లోక్‌సభ ఫలితాల్లో కాంగ్రెస్ పరాజయంపై రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని తాము కోరడం లేదు'' అని డీకే అరుణ చెప్పారు. ఎన్నికలు అయిపోయినందున. ఇక రాజకీయాలు పక్కన పెట్టి రాష్ట్ర అభివృద్ధికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పరస్పర సహకారంతో ముందుకెళ్లాలని సూచించారు.

మగ్గం పనిలో ముత్తులక్ష్మి



''ఇంట్లో మగ్గం ఉంది, చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంది. నా గ్రామం నుంచి విదేశాలతో అనుసంధానం కావడానికి ఇవి చాలు. నేను నేసిన చీరను ఈ కామర్స్ వేదికల ద్వారా నేనే మార్కెట్ చేసుకోగలుగుతున్నాను. నా చేతుల్లో తయారైన చీరను ధరించే వారి చేతికి చేర్చే సాంకేతిక మార్గాలను నేర్చుకున్నాను. వందల మంది మహిళలం సంఘటితమయ్యాం. మాలోని నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటుతున్నాం. మేము గౌరవప్రదమైన ఉపాధిని పొందుతున్నాం'' అంటోంది తమిళనాడుకు చెందిన ముత్తులక్ష్మి. ఆమె మాటలు అక్షరసత్యాలు.

సాధికార మహిళలు

వైవిధ్యతే ఉపాధి

భాషలు, వస్త్రధారణ, ఆహారపు అలవాట్లలో మాత్రమే కాదు మనదేశంలో ఉన్న వైవిధ్యత... కళలు, కళాత్మకతల్లోనూ ఉంది. దాదాపుగా ప్రతి ఇంట్లోనూ ఆ కళాత్మకత ఉంటుంది. స్థానికంగా లభించే వస్తువులతో మహిళల చేతిలో రూపుదిద్దుకునే అనేక వస్తువులు ఇప్పుడు వారికి ఉపాధిమార్గాలవుతున్నాయి. దేశంలో దాదాపుగా ఏడు కోట్ల మంది చేతిలో కళ ఉంది. ఆ చేతుల్లో అందమైన హస్తకళాకృతులు తయారవుతున్నాయి. అందులో సగానికి పైగా మహిళలే. ఒకప్పుడు ఆ పని తమకు ఉపాధినిస్తుందని, గుర్తింపును తెస్తుందని తెలియదు వాళ్లకు. తెలిసినా సరే, మధ్య దళారుల దోపిడీకి గురవుతూ అరకొరగా లభించే రుసుముతోనే సంతృప్తి చెందే వాళ్లు. ఇప్పుడు మహిళలు చురుగ్గా ఉన్నారు. తమ ఉత్పత్తులను మార్కెట్‌లోకి ప్రవేశ పెట్టే మాధ్యమాల పట్ల అవగాహన పెంచుకుంటున్నారు. హస్తకళాకృతులు తయారు చేసే కుటుంబాల్లోని మగవారు మెరుగైన ఉపాధి కోసం ఆ వృత్తులను వదిలేస్తున్న తరుణంలో ఆ ఇళ్లలోని మహిళలు తమ వారసత్వ కళను కొనసాగిస్తూ తమ కంటూ ప్రత్యేకమైన గౌరవాన్ని, అదే స్థాయిలో ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. ముత్తులక్ష్మి ఇంట్లో పవర్‌లూమ్ ఉంది. ఆ మరమగ్గం మీద ఆమె నెలకు పది చీరలను నేయగలుగుతోంది. తమిళనాడులోని అరుపోకోటాయ్ బ్లాక్ చేనేత చీరలకు ప్రసిద్ధి. అక్కడ నేసే చీరలను కూడా అదే పేరుతో అరుప్పుకోటాయ్ చీరలుగానే పిలుస్తారు. ఆమె నేసిన చీరలను ఫొటో తీసి తానే స్వయంగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ కామర్స్ వెబ్‌సైట్‌లలో అప్‌లోడ్ చేస్తుంది. ఉత్పత్తిదారులకు– వినియోగదారులకు మధ్య మరో వ్యక్తి అవసరం లేదని, సాంకేతికతను ఒంటపట్టించుకోవడానికి పెద్ద చదువులు అక్కరలేదని నిరూపిస్తోంది.





బుట్టల అల్లికలో మహిళలు

సాధికారత సాధించాం!

''ఒక్కో ప్రాంతంలోని మహిళల్లో ఒక్కో కళ ఉంటుంది. మా దగ్గర మహిళలు చేనేతతోపాటు తాటి, కొబ్బరి ఆకులతో బుట్టలు అల్లుతారు. కర్ణాటక, రాయచూర్ వాళ్లు అందమైన దండలు, ఊలు, క్రోషియో వైర్‌తో ఇంటి అలంకరణ వస్తువులు అల్లుతారు. గుజరాత్, దహోద్ వాళ్లు ముత్యాల ఆభరణాలతోపాటు వెదురుతో రకరకాల వస్తువులు తయారు చేయడంలో నిష్ణాతులు. వాళ్లందరికీ డిజిటల్ లిటరసీ, ఫైనాన్షియల్ లిటరసీ, ఎంటర్‌ప్రెన్యూరల్ స్కిల్స్‌తోపాటు ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కల్పిస్తే అద్భుతాలు చేయగలరని నమ్మాను. అది నిజమైంది కూడా. ఇప్పుడు మొత్తం తొమ్మిది వందల మందిమి నాస్కామ్ నిర్వహించిన పదిరోజుల నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో పాల్గొని సొంతంగా అన్ని పనులూ చక్కబెట్టుకోగలుగుతున్నాం. మహిళా సాధికారత సాధనకు మా చేతిలో ఉన్న పని, సాంకేతిక పరిజ్ఞానం తోడైంది'' అన్నది ముత్తులక్ష్మి.



గౌరీ కిర్లోస్కర్

ఫిఫ్త్ జనరేషన్

గోల్డెన్ స్పూన్‌తో పుట్టిన గౌరీ కిర్లోస్కర్ తమ కుటుంబ వ్యాపార విజయాల వెలుగులో మాత్రమే కనిపించాలనుకోలేదు.
'కొత్తగా నేను ఏమీ చేయకపోయినా జీవితం సాఫీగా సాగిపోతుంది' అనుకోలేదు.
'ఇంత పెద్ద వ్యాపార సామ్రాజ్యంలో నేను ఎక్కడ?' అని ప్రశ్నించుకుంది.
ఆ ప్రశ్నే ఆమెతో ఎన్నో ప్రయాణాలు చేయించింది.
ప్రతి ప్రయాణంలో విలువైన పాఠాలు నేర్చుకునేలా చేసింది.
తమ కుటుంబ వ్యాపార చరిత్రలో తన కంటూ కొన్ని పుటలు ఉండాలనుకుంది.
ఆమె ప్రయత్నం, కష్టం ఫలించాయి.
ఫిఫ్త్ జెనరేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రసిద్ధ వ్యాపార సామ్రాజ్యమైన 'కిర్లోస్కర్'లోకి అడుగుపెట్టిన గౌరీ కిర్లోస్కర్ తనను తాను నిరూపించుకుంది.
తమ వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరించింది.

సగౌరవంగా... గౌరీ విజయం

కుటుంబ వ్యాపారంలోకి అడుగు పెట్టినంత మాత్రానా ఎంటర్‌ప్రెన్యూర్‌గా వారిది నల్లేరు మీద నడక అనుకోవడానికి లేదు. తమను తాము నిరూపించుకొని ఫ్యామిలీ బిజినెస్‌కు మరింత బలాన్ని ఇచ్చేవారితో పాటు నిరూపించుకోలేక వెనుతిరిగేవారు కూడా ఉంటారు. గౌరీ కిర్లోస్కర్ మొదటి కోవకు చెందిన మహిళ.

లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్(ఎల్ఎస్ఈ)లో చదువుకుంది. అమెరికాలోని కార్నెగీ మెలన్ యూనివర్శిటీలో ఫైనాన్స్‌లో డిగ్రీ చేసింది.

చదువు పూర్తి కాగానే తమ కుటుంబ వ్యాపారంలోకి అడుగు పెట్టి పెద్ద హోదాలో వెలిగిపోవచ్చు. అలా కాకుండా ఉద్యోగం చేయాలనుకుంది గౌరి.

ఉద్యోగం చేయాలనుకోవడానికి కారణం....తనను తాను నిరూపించుకోవడం.

ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ అనలిస్ట్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించింది. ఆ తరువాత 'పియర్సన్ కార్పొరేట్ ఫైనాన్స్'లో స్ట్రాటజీ గ్రూప్‌లో చేరింది. ఉద్యోగజీవితంలో విలువైన అనుభవాలను సొంతం చేసుకుంది. ఈ అనుభవాలు ఎంటర్‌ప్రెన్యూర్‌గా తన విజయాలకు బలమైన పునాదిగా నిలిచాయి.

మన దేశానికి తిరిగివచ్చిన గౌరి కుటుంబ వ్యాపారంలోకి అడుగుపెట్టింది. ఇక అప్పటినుంచి 'కిర్లోస్కర్ గ్రూప్'లో వ్యూహాత్మక విధానాలపై దృష్టి పెట్టింది. బోర్డ్ మెంబర్‌గా సమీక్ష సమావేశాల్లో చురుగ్గా పాల్గొనడం ఒక కోణం అయితే ఎనర్జీ సెక్టర్‌లో ఇన్వెస్ట్‌మెంట్ అవకాశాలను అన్వేషించడం మరో కోణం.

'ఆర్క్ ఫిన్ క్యాప్'కు సంబంధించి టీమ్ ఏర్పాటు, బిజినెస్ ప్లానింగ్‌లో కీలకంగా వ్యవహరించింది.

పుణెలో కంపెనీకి సంబంధించిన రియల్ ఎస్టేట్ బిజినెస్ ప్రధాన బాధ్యతను కూడా సమర్థవంతంగా నిర్వహించింది. ఇంటర్నేషనల్ ప్రాపర్టీ కన్సల్టెంట్స్‌తో కలిసి పనిచేసింది.

హెచ్ఆర్, బ్రాండింగ్, కార్పొరేట్ కమ్యూనికేషన్స్‌లో తనదైన ముద్ర వేసింది.

పర్యావరణ కోణంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)పై ప్రత్యేక దృష్టి పెట్టింది.

గౌరీ నాయకత్వంలో కిర్లోస్కర్ ఆయిల్ ఇంజిన్స్ గణనీయమైన వృద్ధిని సాధించింది.

'ఇది కుదరదు' అనుకునే చోట ప్రత్యామ్నాయాలు అన్వేషించి విజయం సాధించే నైపుణ్యం గౌరీలో ఉంది.

'మేము ఇంజిన్ మాన్యుఫాక్చరింగ్‌లోకి వచ్చినప్పుడు గ్లోబల్ కంపెనీలతో టై అప్ అయ్యే అవకాశం లేదు. ఒక వేళ ఉంటే టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ద్వారా ఇంజిన్‌లను స్థానికంగానే తయారు చేసుకునే పరిస్థితి ఉండేది. ఇలాంటి అవకాశం లేకపోవడంతో సొంతంగా మాన్యుఫాక్చరింగ్ మొదలుపెట్టాం. సొంతంగా ఏదైనా చేయడం మొదలుపెట్టినప్పుడు మనదైన ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ వృద్ధి చెందుతుంది' అంటుంది గౌరీ.

గౌరీ కంపెనీ బీ2బీ, బీ2సి, ఫైనాన్షియల్ సర్వీసెస్ అనే మూడు ప్రధానమైన బిజినెస్ సెగ్మెంట్‌లపై దృష్టి పెట్టింది. బీ2బీ బిజినెస్ ఇంటర్నల్ కంబాషన్ ఇంజిన్స్‌పై, బీ2సి బిజినెస్ వాటర్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్, వ్యవసాయ సంబంధిత వ్యాపారాలపై దృష్టి పెడుతుంది. ఇక 'అర్క' గ్రూప్ అనేది ఫైనాన్షియల్ సర్వీసెస్ సెగ్మెంట్.

స్థూలంగా చెప్పాలంటే...

ఉన్నత విద్యాలయాల్లో చదువుకున్న చదువు, ప్రయాణంలో నేర్చుకున్న పాఠాలు, వ్యూహాత్మక దృక్పథం వ్యాపార ప్రపంచంలో గౌరీని ఉన్నత స్థానంలో నిలిపాయి. మూలాలకు తిరిగి రావడం అనేది గణనీయమైన వ్యాపార విజయానికి ఎలా దారితీస్తుందో చెప్పడానికి గౌరీ కిర్లోస్కర్ పేరును ప్రముఖంగా ప్రస్తావించవచ్చు.

ఉత్సాహ బలం

వ్యాపార ప్రపంచానికి అవతలి విషయానికి వస్తే... గౌరీ కిర్లోస్కర్‌కు యోగా చేయడం, స్క్వాష్, డైవింగ్ అంటే ఇష్టం. ప్రకృతి ప్రేమికురాలైన గౌరీకి తన కుటుంబ సభ్యులతో కలిసి కొత్త ప్రదేశాలకు వెళ్లడం అంటే ఇష్టం. ఎప్పటికప్పుడు సరికొత్త ట్రెండ్‌ల గురించి తెలుసుకోవడానికి సోషల్ మీడియాపై కూడా ఆసక్తి ప్రదర్శిస్తుంది. ఒక పుస్తకం చదివినప్పుడో, ఉపన్యాసం విన్నప్పుడో తనకు నచ్చిన వాక్యాన్ని, మాటను నోట్ చేసుకోవడం గౌరీకి ఇష్టం. 'ఏ పని చేసినా ఉత్సాహంతో చేయాలి. ఉత్సాహమే అనంతమైన శక్తి' అంటుంది గౌరీ కిర్లోస్కర్.

బ్యూటిప్స్

పాలలో బ్రెడ్ ముక్కలు నానవేసి వాటిని మెత్తగా మెదిపి ముఖానికి రాసుకుని పది నిమిషాల తర్వాత కడిగేస్తే ముఖం మృదువుగా మిలమిలలాడుతుంది.

- కొబ్బరి నూనె, ఆలివ్ ఆయిల్, నిమ్మరసం కలిపి ముఖానికి రాసుకుని పావు గంట తర్వాత కడిగేసుకోవాలి. తర్వాత శెనగపిండితో గానీ, నలుగుపిండితో గానీ రుద్ది ముఖాన్ని శుభ్రం చేసుకుంటే ముఖం మీద ముడతలు లేకుండా తాజాగా కనిపిస్తుంది.
- పులిపిర్లు రాలిపోయిన తర్వాత ఆ మచ్చలు పోవటానికి తేనె, నిమ్మరసం కలిపి ఆ మచ్చల మీద రాస్తూ ఉండాలి.
- తులసి ఆకులను మెత్తగా గ్రైండ్ చేసి ఆపేస్టును కాని రసాన్ని కానీ ముఖానికి రాసిఆరిన తర్వాత చన్నీటితో కడగాలి. క్రమంతప్పకుండా రోజూ చేస్తుంటే మొటిమలు,వాటి మచ్చలు పూర్తిగా పోవడంతో పాటుచర్మం నునుపుదేలుతుంది.
- తేనెను గోరువెచ్చగా చేసి అందులో నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించి ఆరినతర్వాత కడగాలి. తేనెను ఎప్పుడూ నేరుగామంట మీద వేడి చేయకూడదు. తేనె ఉన్నపాత్రను ఎండలో కాని, వేడి నీటి గిన్నెలోకాని పెట్టి వేడి చేయాలి.



పదహారో శతాబ్దంలోకి వెళ్లివద్దామా?!





రాజాంతఃపురాలను, కోటలను సినిమాలలో తప్ప స్వయంగా చూడటం సాధ్యం కాదేమో అని బెంగపడే వాళ్లకు ఆహ్వానం పలుకుతోందీ ప్యాలెస్. ఇది మహారాష్ట్రలోని సావంత్‌వాడి ప్యాలెస్. గోవాకు దగ్గరలో ఉంది. పదహారవ శతాబ్దంలో నిర్మించిన ఈ ప్యాలెస్‌లోకి అతిథులకు ఆత్మీయ స్వాగతం పలుకుతున్నారు సావంత్ రాజవంశీకులు. యువరాజు లఖమ్ సావంత్ భోంస్లే, యువరాణి శ్రద్ధా సావంత్ భోంస్లేలు తమ ప్యాలెస్‌ను పర్యాటకులకు హోమ్‌స్టేగా మార్చారు.





''మేము మా ప్యాలెస్‌తో వ్యాపారం చేయడం లేదు, మనదేశ చరిత్రను తెలియచేస్తున్నాం. స్వాతంత్ర్యోద్యమ సమయంలో గాంధీజీ ఆధ్వర్యంలో ఉప్పు సత్యాగ్రహం ఇక్కడ జరిగింది. మరో సందర్భంలో నెహ్రూ కూడా బస చేశారు. ఈ ప్యాలెస్‌లో అడుగుపెట్టిన క్షణం నుంచి మా కొంకణ సంప్రదాయ ఆహ్వానం, ఆత్మీయతలు, భోజనంతో పదహారవ శతాబ్దంలోకి వెళ్లిపోతారు'' అని చెబుతున్నారు ఈ ఇంటి వాళ్లు.








టైమ్ మెషీన్‌లో కాలంలో వెనక్కి వెళ్లడం సినిమాల్లో చూడడం కాదు ఇక్కడ స్వయంగా అనుభూతి చెందవచ్చు, అంతేకాదు... మొఘలులు పర్షియా నుంచి మన దేశానికి తీసుకువచ్చిన గంజిఫా ఆట ఆడడం వంటివి ఇక్కడివి వచ్చిన వాళ్లకు నేర్పిస్తామని చెబుతున్నారు. రాజసాన్ని చూపిస్తుంది. కళాత్మక లాలిత్యంతో కనువిందు చేస్తుంది. అమ్మ ఒడిలా ఆప్యాయతనిస్తుంది. అమ్మమ్మ చేతి స్పర్శలోని మృదుత్వాన్ని గుర్తు చేస్తుంది. పర్యటన రొటీన్‌కి భిన్నంగా ఉండాలని కోరుకునే వాళ్లకు చక్కటి వెకేషన్ అవుతుంది.





విశేషం



పడమటి చంద్రిక రాగం

అల్లరి అమ్మాయిగా పేరు తెచ్చుకున్న చంద్రికా రవి డ్యాన్సర్‌గా అంతకంటే ఎక్కువ పేరు తెచ్చుకుంది.

మోడలింగ్‌లోనూ మంచి మార్కులు కొట్టేసింది.

నటనలో 'వాహ్వా' అనిపించింది.

ఆస్ట్రేలియాలో పుట్టి పెరిగిన చంద్రికా రవి భారతీయ మూలాలను మాత్రం ఎప్పుడూ మరచిపోలేదు.

ఆమె మాట, పాట, నటన, నృత్యంలో భారతీయత ప్రతిఫలిస్తుంది.

తాజా విషయానికి వస్తే...

యూఎస్ రేడియో షోకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న తొలి భారతీయ నటిగా చంద్రికా రవి చరిత్ర సృష్టించింది. అమెరికన్ టాక్ షో 'ది చంద్రికా రవిషో'కు ఆమె వ్యాఖ్యాతగా వ్యవహరిస్తోంది.

ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో పుట్టింది చంద్రికా రవి. మల్లిక, రవి శ్రీధరన్‌లు తల్లి దండ్రులు. మూడు సంవత్సరాల వయసులోనే డ్యాన్స్, యాక్టింగ్‌లలో చంద్రికకు శిక్షణ ఇప్పించారు తల్లిదండ్రులు.

చిన్న వయసులోనే సింగపూర్‌లో నృత్య ప్రదర్శన ఇచ్చింది.

కొత్తప్రాంతాలకు వెళ్లడం అంటే చంద్రికకు ఎంతో ఇష్టం. టీనేజ్‌లోనే ఎన్నో దేశాలు చుట్టేసి వచ్చింది.

ఆస్ట్రేలియా నుంచి లాస్ ఏంజెల్స్‌కు వెళ్లి యాక్టింగ్, మోడలింగ్‌లో కెరీర్ మొదలుపెట్టింది.

'సెయి' అనే తమిళ చిత్రంతో భారతీయ చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టింది.

ఈ సినిమాలో భారతీయ, పాశ్చాత్య సంస్కృతులపై బాగా పరిచయం ఉన్న యువతి పాత్రలో నటించింది. నిజానికి నిజజీవితంలోనూ ఆమెకు రెండు సంస్కృతులపై గాఢమైన పరిచయం ఉంది.

'నా మూలాలు దక్షిణ భారతంలో ఉన్నాయి' అని తనను తాను గర్వంగా పరిచయం చేసుకుంటుంది చంద్రిక.

మోడలింగ్ చేసినప్పటికీ తన తొలి ప్రాధాన్యత మాత్రం నటనే.

> ఒత్తిడితో కూడుకున్నదైనప్పటికీ ఇదొక గొప్ప అనుభవం. నటిగా మాత్రమే పరిచయం అయిన నా గురించి పూర్తిగా తెలుసుకోవడానికి ఈ రేడియో షో ఉపయోగపడుతుంది.
> – చంద్రికా రవి

'ఫిల్మ్ మేకింగ్, యాక్టింగ్‌లో యూఎస్‌లో శిక్షణ తీసుకున్నాను. విదేశాల్లో కొన్ని ఫీచర్ ఫిల్మ్‌లు చేశాను. నటన అంటే ఇష్టం అయినప్పటికీ ఒకేరకమైన పాత్రలు చేయడం ఇష్టం లేదు. వైవిధ్యం ఉన్న పాత్రలు చేయడానికే ప్రాధాన్యత ఇస్తాను' అంటున్న చంద్రిక పాత్రల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తోంది.

సిల్క్ స్మిత బయోపిక్‌లో లీడ్ రోల్‌లో నటించింది.

'అచ్చం స్మితలాగే ఉంది' అనిపించుకుంది.

రేడియో టాక్ షో విషయానికి వస్తే...

'ది చంద్రికా రవి షో'లో తన వ్యక్తిగత జీవితంలో ఎదురైన రకరకాల అనుభవాలు, సవాళ్లు, పోరాటాలను పంచుకోనుంది. చంద్రిక పోరాట నేపథ్యం గురించి విన్న రూక్స్ అవెన్యూ రేడియో వ్యవస్థాపకుడు సామీ చంద్ ఆమెకు వ్యాఖ్యాతగా అరుదైన అవకాశం ఇచ్చాడు.

'ఒత్తిడితో కూడుకున్నదైనప్పటికీ ఇదొక గొప్ప అనుభవం. నటిగా మాత్రమే పరిచయం అయిన నా గురించి పూర్తిగా తెలుసుకోవడానికి ఈ షో ఉపయోగపడుతుంది' అంటుంది చంద్రిక. అమెరికాలోని అతి పెద్ద నెట్‌వర్క్‌లలో ఒకటైన 'ఐహార్ట్' రేడియోలో ఈ షో ప్రసారం కానుంది. తన షోను ఆషామాషీగా తీసుకోవడం లేదు చంద్రిక. షో సక్సెస్ కోసం డిజైన్, ప్రొడక్షన్, ప్రమోషన్‌లకు సంబంధించి బాగా కష్టపడింది

యూఎస్‌లో రేడియో షోను హోస్ట్ చేస్తున్న మొదటి భారతీయ నటిగా ప్రత్యేకత సాధించిన చంద్రిక...

'నన్ను నేను వ్యక్తీకరించుకోవడానికి, ప్రపంచంతో నా వ్యక్తిగత అనుభవాలను పంచుకోవడానికి ఈ షో నాకు వరం లాంటిది' అంటుంది.



భారత్ తరపున చివరిసారి బరిలోకి సునీల్ ఛెత్రి... నేడు కువైట్‌తో భారత్ పోరు

ప్రపంచకప్ 2026 ఫుట్‌బాల్ టోర్నీ రెండో రౌండ్ ఆసియా జోన్ క్వాలిఫయర్స్‌లో భాగంగా నేడు కువైట్ జట్టుతో భారత జట్టు తలపడనుంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే మూడో రౌండ్‌కు అర్హత పొందే అవకాశాలు మెరుగవుతాయి. కోల్‌కతాలోని సాల్ట్‌లేక్ స్టేడియంలో రాత్రి 7 గంటల నుంచి జరగనున్న ఈ మ్యాచ్ భారత దిగ్గజం, కెప్టెన్ సునీల్ ఛెత్రి అంతర్జాతీయ కెరీర్‌లో చివరి మ్యాచ్ కానుంది. 2005లో తొలిసారి భారత సీనియర్ జట్టుకు ఆడిన 39 ఏళ్ల ఛెత్రి ఇప్పటి వరకు 150 మ్యాచ్‌లు పూర్తి చేసుకొని 94 గోల్స్ సాధించాడు. జాతీయ జట్టు తరఫున అత్యధిక గోల్స్ చేసిన ఫుట్‌బాలర్స్ జాబితాలో ఛెత్రి నాలుగో స్థానంలో ఉన్నాడు. క్రిస్టియానో రొనాల్డో (పోర్చుగల్; 206 మ్యాచ్‌ల్లో 128 గోల్స్), అలీ దాయ్ (ఇరాన్; 149 మ్యాచ్‌ల్లో 109 గోల్స్); లయనెల్ మెస్సీ (అర్జెంటీనా; 180 మ్యాచ్‌ల్లో 106 గోల్స్) వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నారు. ఆసియా క్వాలిఫయర్స్ గ్రూప్ 'ఎ'లో ప్రస్తుతం ఖతర్ 12 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... భారత్, అఫ్గానిస్తాన్ జట్లు నాలుగు పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాయి.

ఆడుతూ పాడుతూ...

తొలి మ్యాచ్‌లో భారత్ ఘన విజయం

- 8 వికెట్లతో ఐర్లాండ్ చిత్తు
- రాణించిన బౌలర్లు, రోహిత్
- ఆదివారం పాకిస్తాన్‌తో 'ఢీ'

భారీ అంచనాలతో టి20 వరల్డ్ కప్ బరిలోకి దిగిన భారత్ తొలి పోరులో తమ స్థాయి ప్రదర్శనతో సత్తా చాటింది. సంచలనాల రికార్డు ఉన్న ఐర్లాండ్‌పై ఏమాత్రం ఉదాసీనత కనబర్చకుండా పూర్తిగా పైచేయి సాధించి భారీ విజయాన్ని అందుకుంది. బ్యాటింగ్‌కు అంతగా అనుకూలించని పిచ్‌పై ప్రత్యర్థిని 96 పరుగులకే పరిమితం చేసిన టీమిండియా ఆ తర్వాత మరో 46 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యం చేరింది. మన బౌలర్లలో ఐదుగురు కనీసం ఒక్కో వికెట్‌తో తమ వంతు పాత్ర పోషించారు. అనంతరం రోహిత్, పంత్ చక్కటి బ్యాటింగ్ టీమిండియాను ఎలాంటి ఇబ్బంది లేకుండా గెలిపించాయి. ఇక ఆదివారం పాకిస్తాన్‌తో మ్యాచ్ రూపంలో తర్వాతి సవాల్‌కు భారత్ సిద్ధమైంది.


రోహిత్

న్యూయార్క్: టి20 వరల్డ్ కప్‌లో రోహిత్ బృందం శుభారంభం చేసింది. బుధవారం నాసా కౌంటీ స్టేడియంలో జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ 16 ఓవర్లలో 96 పరుగులకే కుప్పకూలింది. గారెత్ డెలానీ (14 బంతుల్లో 26; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు)దే అత్యధిక స్కోరు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జస్‌ప్రీత్ బుమ్రా (2/6), అర్ష్‌దీప్ చెరో 2 వికెట్లు తీయగా, హార్దిక్ పాండ్యాకు 3 వికెట్లు దక్కాయి. అనంతరం భారత్ 12.2 ఓవర్లలో 2 వికెట్లకు 97 పరుగులు సాధించి గెలిచింది. రోహిత్ శర్మ (37 బంతుల్లో 52 రిటైర్డ్‌హర్ట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), రిషభ్ పంత్ (26 బంతుల్లో 36 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రెండో వికెట్‌కు 44 బంతుల్లో 54 పరుగులు జోడించారు.

టపటపా...

స్వింగ్‌కు అనుకూల వాతావరణం, అనూహ్య బౌన్స్, నెమ్మదైన అవుట్‌ఫీల్డ్... ఇలాంటి స్థితిలో బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ ఏ దశలోనూ భారత బౌలర్ల ముందు నిలవలేకపోయింది. మూడో ఓవర్లో కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ (2), బల్బర్నీ (5)లను అవుట్ చేసి అర్ష్‌దీప్ ముందుగా దెబ్బ కొట్టడంతో మొదలైన ఐర్లాండ్ పతనం వేగంగా సాగింది. పవర్‌ప్లేలో 26 పరుగులు రాగా, వాటిలో 9 ఎక్స్‌ట్రాలే ఉన్నాయి. పాండ్యా తన తొలి రెండు ఓవర్లలో టకర్ (10), కాంఫర్ (12)లను వెనక్కి పంపించగా, టెక్టర్ (4)ను బుమ్రా అవుట్ చేశాడు. సిరాజ్ ఖాతాలో డాక్‌రెల్ (3) వికెట్ చేరడంతో 10 ఓవర్లు ముగిసేసరికి ఐర్లాండ్ 49/6 వద్ద నిలిచింది. అక్షర్ పటేల్ కూడా తన తొలి ఓవర్లో మెక్‌కార్తీ (0) పని పట్టగా, బుమ్రా బౌలింగ్‌లో లిటిల్ (14) బౌల్డయ్యాడు. అయితే చివర్లో డెలానీ కొన్ని పరుగులు జోడించగలిగాడు. అర్ష్‌దీప్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ కొట్టిన అతను అదే ఓవర్ చివరి బంతికి రనౌట్ కావడంతో ఐర్లాండ్ ఆట ముగిసింది.

ఆకట్టుకున్న పంత్...

ఓపెనర్‌గా వచ్చిన విరాట్ కోహ్లి (1) ప్రభావం చూపలేకపోగా, మరోవైపు రోహిత్ ధాటిగా ఆడాడు. మూడో స్థానంలో బరిలోకి దిగిన పంత్ కూడా అదే తరహాలో వేగంగా బ్యాటింగ్ చేశాడు. పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 39 పరుగులకు చేరింది. లిటిల్ ఓవర్లో రెండు వరుస సిక్స్‌లతో జోరు పెంచిన రోహిత్ 36 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే అంతకుముందు లిటిల్ వేసిన ఓవర్లో బంతి భుజానికి బలంగా తగిలిన కారణంగా నొప్పితో మైదానం వీడాడు. 21 పరుగులు చేయాల్సిన స్థితిలో బ్యాటింగ్‌కు వచ్చిన సూర్యకుమార్ (2) విఫలమైనా... మెక్‌కార్తీ బౌలింగ్‌లో రివర్స్ స్కూప్ సిక్సర్‌తో పంత్ మ్యాచ్ ముగించాడు. ఇటీవలే ఐపీఎల్‌లో ఆడిన పంత్‌కు ఏడాదిన్నర తర్వాత ఇదే తొలి అంతర్జాతీయ మ్యాచ్.



600 రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్‌లో 600 సిక్సర్లు కొట్టిన తొలి ఆటగాడిగా నిలిచాడు. రోహిత్ టెస్టుల్లో 84, వన్డేల్లో 323, టి20ల్లో 193 సిక్స్‌లు బాదాడు.

4000 రోహిత్ అంతర్జాతీయ టి20ల్లో 4 వేల పరుగులు (4026) దాటాడు. కోహ్లి (4038), బాబర్ (4023) తర్వాత ఈ మైలురాయిని చేరిన మూడో ఆటగాడిగా నిలిచాడు.

స్కోరు వివరాలు

ఐర్లాండ్ ఇన్నింగ్స్: బల్బర్నీ (బి) అర్ష్‌దీప్ 5; స్టిర్లింగ్ (సి) పంత్ (బి) అర్ష్‌దీప్ 2; టకర్ (బి) పాండ్యా 10; టెక్టర్ (సి) కోహ్లి (బి) బుమ్రా 4; కాంఫర్ (సి) పంత్ (బి) పాండ్యా 12; డాక్‌రెల్ (సి) బుమ్రా (బి) సిరాజ్ 3; డెలానీ (రనౌట్) 26; అడెయిర్ (సి) దూబే (బి) పాండ్యా 3; మెక్‌కార్తీ (సి అండ్ బి) అక్షర్ 0; లిటిల్ (బి) బుమ్రా 14; వైట్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (16 ఓవర్లలో ఆలౌట్)** 96. **వికెట్ల పతనం:** 1-7, 2-9, 3-28, 4-36, 5-44, 6-46, 7-49, 8-50, 9-77, 10-96. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-35-2, సిరాజ్ 3-0-13-1, బుమ్రా 3-1-6-2, పాండ్యా 4-1-27-3, అక్షర్ పటేల్ 1-0-3-1, జడేజా 1-0-7-0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (రిటైర్డ్‌హర్ట్) 52; కోహ్లి (సి) వైట్ (బి) అడెయిర్ 1; పంత్ (నాటౌట్) 36; సూర్యకుమార్ (సి) డాక్‌రెల్ (బి) వైట్ 2; దూబే (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (12.2 ఓవర్లలో 2 వికెట్లకు)** 97. **వికెట్ల పతనం:** 1-22, 2-91. **బౌలింగ్:** అడెయిర్ 4-0-27-1, లిటిల్ 4-0-42-0 మెక్‌కార్తీ 2.2-0-8-0, కాంఫర్ 1-0-4-0, వైట్ 1-0-6-1.

టి20 ప్రపంచకప్‌లో నేడు
పాపువా న్యూ గినీ X ఉగాండా
వేదిక: గయానా; ఉదయం గం. 5 నుంచి
ఆస్ట్రేలియా X ఒమన్
వేదిక: బ్రిడ్జ్‌టౌన్; ఉదయం గం. 6 నుంచి
పాకిస్తాన్ X అమెరికా
వేదిక: వేదిక: డాలస్; రాత్రి గం. 9 నుంచి
నమీబియా X స్కాట్లాండ్
వేదిక: బ్రిడ్జ్‌టౌన్; అర్ధరాత్రి గం. 12:30 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

సబలెంకాకు చుక్కెదురు

ప్రపంచ రెండో ర్యాంకర్‌పై రష్యా టీనేజర్ మిరా ఆంద్రీవా సంచలన విజయం


సబలెంకా

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో సంచలన ఫలితాలు నమోదయ్యాయి. ప్రపంచ రెండో ర్యాంకర్ సబలెంకా (బెలారస్), నాలుగో ర్యాంకర్ రిబాకినా (కజకిస్తాన్) క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగారు. రష్యాకు చెందిన 17 ఏళ్ల మిరా ఆంద్రీవా 2 గంటల 29 నిమిషాల పోరులో 6-7 (5/7), 6-4, 6-4తో సబలెంకాను బోల్తా కొట్టించగా... ఇటలీకి చెందిన 12వ సీడ్ జాస్మిన్ పావ్లిని 2 గంటల 3 నిమిషాల్లో 6-2, 4-6, 6-4తో రిబాకినాను ఓడించింది. ఆంద్రీవా, జాస్మిన్ తమ కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరుకున్నారు.

సెమీస్‌లో బోపన్న జోడీ

పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. క్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 7-6 (7/3), 5-7, 6-1తో సాండర్ గిలె-జొరాన్ వ్లీగెన్ (బెల్జియం) జంటను ఓడించింది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో మూడో ర్యాంకర్ అల్‌కరాజ్ (స్పెయిన్) సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. క్వార్టర్ ఫైనల్లో అల్‌కరాజ్ 6-3, 7-6 (7/3), 6-4తో తొమ్మిదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్)పై గెలిచి రెండో ర్యాంకర్ యానిక్ సినెర్ (ఇటలీ)తో సెమీఫైనల్ పోరుకు సిద్ధమయ్యాడు.

వైశాలి విజయం... హంపి, ప్రజ్ఞానంద పరాజయం



స్టావెంజర్: నార్వే చెస్ టోర్నీ మహిళల విభాగం ఎనిమిదో రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు వైశాలి, కోనేరు హంపిలకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. వైశాలి 'అర్మగెడాన్' గేమ్‌లో తెల్ల పావులతో ఆడుతూ అనా ముజిచుక్ (ఉక్రెయిన్)పై 59 ఎత్తుల్లో నెగ్గింది. వీరిద్దరి మధ్య క్లాసికల్ గేమ్ 47 ఎత్తుల్లో 'డ్రా' కావడంతో విజేతను నిర్ణయించేందుకు 'అర్మగెడాన్' గేమ్ నిర్వహించారు. టింగ్జీ లె (చైనా)తో జరిగిన క్లాసికల్ గేమ్‌లో కోనేరు హంపి 66 ఎత్తుల్లో ఓడిపోయింది. ఎనిమిదో రౌండ్ తర్వాత వైశాలి 11.5 పాయింట్లతో మూడో స్థానంలో, హంపి 8 పాయింట్లతో ఐదో స్థానంలో ఉన్నారు. పురుషుల విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)తో జరిగిన క్లాసికల్ గేమ్‌ను భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద 75 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. 'అర్మగెడాన్' గేమ్‌లో కార్ల్‌సన్ తెల్లపావులతో ఆడుతూ 67 ఎత్తుల్లో ప్రజ్ఞానందపై గెలుపొందాడు.

తొలి రౌండ్‌లోనే సింధు ఓటమి

జకార్తా: ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో మహిళల సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారిణుల పోరాటం ముగిసింది. బరిలో దిగిన భారత స్టార్ పీవీ సింధు, రైజింగ్ స్టార్ ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. ప్రపంచ 12వ ర్యాంకర్ సింధు 15-21, 21-15, 14-21తో ప్రపంచ 26వ ర్యాంకర్ వెన్ చి సు (చైనీస్ తైపీ) చేతిలో... ఆకర్షి కశ్యప్ 18-21, 6-21తో ప్రపంచ మాజీ చాంపియన్ రచనోక్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయారు. వెన్ చి సుతో గతంలో ఆడిన మూడుసార్లూ నెగ్గిన సింధు నాలుగోసారి మాత్రం ఓటమి మూటగట్టుకుంది. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నిర్ణాయక మూడో గేమ్‌లో సింధు కీలకదశలో అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకుంది.



మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా (భారత్) ద్వయం 21-15, 21-15తో జాకీ డెంట్-క్రిస్టల్ (కెనడా) జోడీపై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. రుతపర్ణ-శ్వేతపర్ణ (భారత్) జంట 12-21, 9-21తో సో యోంగ్ కిమ్ -హీ యోంగ్ కాంగ్ (కొరియా) జోడీ చేతిలో ఓడిపోయింది.

సినిమా


● ప్రభాస్

ట్రైలర్ రెడీ

ప్రభాస్ హీరోగా నటించిన సైన్స్ ఫిక్షన్ అండ్ ఫ్యూచరిస్టిక్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను ఈ నెల 10న విడుదల చేస్తున్నట్లుగా వెల్లడించి, ఓ కొత్త పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు మేకర్స్. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం : సంతోష్ నారాయణన్.

పాటలోనే కథ ఉంది - చేతన్ భరద్వాజ్



''హరోం హర' 1989లో జరిగే కథ. ఇప్పుడున్న యువతకు అప్పుడున్న ఓ జీవితాన్ని చూపిస్తున్నారు డైరెక్టర్ సాగర్. ఇందులో విజువల్స్ చాలా గ్రాండ్‌గా ఉంటాయి. విజువల్‌కి తగ్గట్టే మ్యూజిక్ చాలా గ్రాండియర్‌గా చేశాను. సౌండ్ డిజైన్ అద్భుతంగా ఉంటుంది'' అని సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్ అన్నారు. సుధీర్ బాబు హీరోగా జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించిన చిత్రం 'హరోం హర'. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్‌పై సుమంత్ జి. నాయుడు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్ మాట్లాడుతూ– ''హరోం హర' 1989లో జరిగే కథ కాబట్టి ఆ రెట్రో కల్చర్‌ని మిళితం చేసి, ఈ సినిమా చేశాం. నాకు రెట్రో జానర్ ఇష్టం కావడంతో సవాల్‌గా తీసుకుని, చేశాను. 'హరోం హర'లో యాక్షన్‌తో పాటు బలమైన ఎమోషన్స్ ఉంటాయి. ఎమోషనల్ మ్యూజిక్ చేయడానికి కూడా స్కోప్ దొరికింది. ఇప్పటివరకు విడుదలైన ఈ చిత్రం పాటలకు మంచి స్పందన లభించింది. ఇంకో ఎమోషనల్ సాంగ్ ఉంది. సినిమా విడుదల తర్వాత పాటను లాంచ్ చేస్తాం. ఆ పాటలో సబ్జెక్ట్ ఉంది. సుధీర్‌బాబుగారి డైనమిక్ యాక్టింగ్, డైరెక్టర్ టైకింగ్... ఇలా అన్నీ బాగా కుదిరాయి. ప్రస్తుతం గోపీచంద్ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వం వహిస్తున్న 'విశ్వం' సినిమాకి సంగీతం అందిస్తున్నాను'' అన్నారు.


● సమంత

పోటీని వ్యతిరేకంగా తీసుకోను

''పోటీని నేను వ్యతిరేకంగా తీసుకోను... ఓ ప్రేరణగా తీసుకుని నన్ను నేను మరింత మెరుగుపరచుకోవడానికి కష్టపడతాను'' అని అంటున్నారు సమంత. సినిమా ఇండస్ట్రీలో ఉండే పోటీని మీరు ఎలా తీసుకుంటారు? అనే ప్రశ్నకు సమాధానంగా సమంత స్పందించారు. ''మనుషులుగా మనమందరం పోటీ పడాలనుకుంటాం. అది సహజం కాబట్టి పోటీని నేను నెగటివ్‌గా తీసుకోను. చెప్పాలంటే నా తోటివారి విజయాల నుంచి కూడా స్ఫూర్తి పొందుతాను. విజయాలు సాధించిన వారిలా నేను మరింత కష్టపడి అద్భుత విజయాలను సాధించాలని ఆశపడతాను. నా ఆలోచనల్నీ ఇలానే ఉంటాయి'' అని చెప్పుకొచ్చారు సమంత. ఇక సినిమాల విషయానికి వస్తే.. సమంత నటించాల్సిన తాజా చిత్రం 'మా ఇంటి బంగారం'పై అప్‌డేట్ రావాల్సి ఉంది. అలాగే వరుణ్ ధావన్‌తో కలిసి సమంత నటించిన ఇండియన్ వెర్షన్ 'సిటాడెల్' వెబ్ సిరీస్ స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది.

ఎయిర్‌పోర్టులో ఫైట్!


● కమల్ హాసన్

పాండిచ్చేరిలో ఫైట్ చేస్తున్నారు రంగరాయ శక్తివేల్ నాయకర్. మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతున్న 'థగ్ లైఫ్' చిత్రంలో రంగరాయ శక్తివేల్ నాయకర్ పాత్ర చేస్తున్నారు కమల్‌హాసన్. 1987లో వచ్చిన 'నాయగన్' సినిమా తర్వాత కమల్ హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'థగ్ లైఫ్'. ఈ పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ డ్రామాలో త్రిష, శింబు, అశోక్ సెల్వన్, ఐశ్వర్యాలక్ష్మి, జోజూ జార్జ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం పాండిచ్చేరి ఎయిర్‌పోర్టులో జరుగుతోందని కోలీవుడ్ సమాచారం. కమల్‌హాసన్, శింబుతో పాటు ఇతర ముఖ్య తారాగణం పాల్గొంటుండగా యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట మణిరత్నం. ఈ ఫైట్ క్లైమాక్స్‌లో వస్తుందని సమాచారం.

పెళ్లయితే కెరీర్ మారాలా? - కాజల్ అగర్వాల్



''నన్ను టాలీవుడ్ చందమామ అని పిలుస్తుంటారు. 'సత్యభామ' విడుదల తర్వాత సత్యభామ అని పిలిచినా సంతోషిస్తాను. చందమామ అందమైన పేరు. సత్యభామ పవర్‌ఫుల్ నేమ్. ఈ రెండూ నాకు ఇష్టమే'' అని కాజల్ అగర్వాల్ అన్నారు. సుమన్ చిక్కాల దర్శకత్వంలో కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'సత్యభామ'. నవీన్ చంద్ర కీలక పాత్ర చేశారు. 'మేజర్' చిత్ర దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరించి, స్క్రీన్ ప్లే అందించారు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా కాజల్ అగర్వాల్ పంచుకున్న విశేషాలు...


● 'సత్యభామ' కథని సుమన్ చెప్పిన వెంటనే ఒప్పుకున్నా. ఈ స్టోరీ అంత నచ్చింది. ఈ మూవీని నా వ్యక్తిగత జీవితంతో పోల్చుకోవచ్చు. సమాజంలో ఏదైనా ఘటన జరిగితే నిజ జీవితంలో నేనూ స్పందిస్తుంటా. బయటకు వచ్చి ర్యాలీలు చేయకున్నా ఆ ఘటన గురించి ఆలోచనలు వస్తుంటాయి.. డిస్ట్రబ్ చేస్తుంటాయి. 'సత్యభామ' సినిమా లాంటి భావోద్వేగాలున్న చిత్రం చేయడం ఇదే తొలిసారి. ఈ మూవీలో నటిస్తున్నప్పుడు ఇప్పటిదాకా ఫీల్ కాని కొన్ని భావోద్వేగాలను అనుభూతి చెందాను. ● 'సత్యభామ'లో ఎమోషన్, యాక్షన్ ఉన్న పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తా. యాక్షన్ సీక్వెన్సుల కోసం ఎంతో కష్టపడ్డా. ఆ ఫైట్స్ సహజంగా ఉంటాయి. రామ్ చరణ్‌లా (మగధీర మూవీని ఉద్దేశించి) వంద మందిని నేను కొడితే ప్రేక్షకులు నమ్మరు.. నా ఇమేజ్‌కు ప్రేక్షకులు ఇష్టపడేలా స్టంట్స్ ఉంటాయి. ఈ మూవీలో యువత, బెట్టింగ్ అంశంతో పాటు ఓ మతం గురించిన కీ పాయింట్స్ ఉంటాయి. ● పెళ్లయ్యాక ఒక హీరోయిన్ కెరీర్ ఎందుకు మారాలో అర్థం కాదు. అందరికీ వ్యక్తిగత జీవితం ఉంది. అలాగే హీరోయిన్లకు కూడా. గతంలో పెళ్లయ్యాక కథానాయికలకి అవకాశాలు తగ్గాయేమో? కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. పెళ్లయ్యాక ఎంతోమంది హీరోయిన్లు అంతకుముందు కంటే బిజీగా సినిమాలు చేస్తున్నారు. నేను నా వ్యక్తిగత జీవితాన్ని, సినీ కెరీర్‌ను బ్యాలెన్స్ చేసుకుంటున్నాను. ఈ ప్రయాణంలో నా భర్త గౌతమ్ కిచ్లు, నా ఫ్యామిలీ సపోర్ట్ ఎంతో ఉంది. నా భర్తకు ఇష్టమైన కథానాయికల్లో నాతోపాటు సమంత, రష్మిక మందన్న, రాశీ ఖన్నా ఉన్నారు. 'భారతీయుడు 2' విడుదల కోసం ఎగ్జయిటెడ్‌గా ఎదురు చూస్తున్నాను. 'భారతీయుడు 3' లోనూ నా పాత్ర ఉంటుంది. ప్రస్తుతం రెండు కొత్త సినిమాలు ఒప్పుకున్నాను.

ఆర్ఆర్ఆర్ సీక్వెల్‌కి స్కోప్ ఉంది కానీ... - అవనీంద్ర



నవదీప్ హీరోగా నటించిన చిత్రం 'లవ్ మౌళి'. అవనీంద్ర దర్శకత్వంలో నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్ బ్యానర్స్‌తో కలిసి సి స్పేస్ నిర్మించిన ఈ చిత్రం రేపు రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా బుధవారం విలేకర్ల సమావేశంలో దర్శకుడు అవనీంద్ర మాట్లాడుతూ –''వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందిన సినిమా ఇది. ఓ రిలేషన్‌లో ఒక జంట రెండేళ్లు హ్యాపీగా ఉన్న తర్వాత.. వారిద్దరి మధ్య మొదట్లో ఉన్నంత ప్రేమ ఎందుకు ఉండటం లేదు? ఎందుకు వారి రిలేషన్ బ్రేక్ అవుతుంది? అనే అంశాలను ఈ సినిమాలో చర్చించాం. ఈ సినిమాలో బోల్డ్ సాంగ్స్, లిప్‌లాక్స్ ఉన్నాయి. కానీ ఇవన్నీ కథకు అవసరమై పెట్టినవే. వైజాగ్‌లో ప్రివ్యూ వేస్తే మంచి స్పందన వచ్చింది. అమ్మాయిలు కూడా ఈ సినిమా చూశారు. చెప్పాలంటే వారికే ఈ సినిమా ఎక్కువగా కనెక్ట్ అవుతుంది'' అని అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''రాజమౌళిగారి 'ఆర్ఆర్ఆర్' సినిమాకు అసోసియేట్ రైటర్‌గా చేశాను. ఆ టైమ్‌లోనే 'లవ్ మౌళి' కథ రాశాను. ఇక 'ఆర్ఆర్ఆర్' సినిమాకు సీక్వెల్ చేసే స్కోప్ ఉంది. అయితే చేస్తారా? లేదా అనేది రాజమౌళిగారి నిర్ణయం'' అన్నారు.

టామీ షెల్బీ రిటర్న్స్



టామీ షెల్బీగా సిలియన్ మర్ఫీ మళ్లీ రానున్నాడు. విశేష ఆదరణ పొందిన టెలివిజన్ సిరీస్ (2013 -2022) 'పీకీ బ్లైండర్స్'లో మర్ఫీ పోషించిన టామీ షెల్బీ ప్రేక్షకులను ఆకటుకుంది. ఈ బ్రిటిష్ పీరియాడికల్ క్రైమ్ సిరీస్‌ను స్టీవెన్ నైట్ క్రియేట్ చేశారు. ఓ యువకుల ముఠా చేసే దొంగతనాల నేపథ్యంలో ఈ సిరీస్ సాగుతుంది. ఈ ముఠాలో కీలకమైన వాడే టామీ షెల్బీ. ఇప్పుడు ఈ సిరీస్‌ను సినిమాగా తీయనున్నారు స్టీవెన్. అయితే స్టీవెన్ నైట్ స్క్రిప్ట్ రాస్తారు. టామ్ హార్పర్ డైరెక్ట్ చేస్తారు. కాగా సిరీస్‌లో టామీ షెల్బీ పాత్రను చేసిన సీలియన్ మర్ఫీనే సినిమాలోనూ ఆ పాత్ర చేయనున్నారు. 'పీకీ బ్లైండర్స్' సిరీస్‌ను సినిమాగా నిర్మించనున్నట్లు, నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానున్నట్లు బుధవారం అధికారిక ప్రకటన వెల్లడైంది. ఈ సంగతి ఇలా ఉంచితే.. ఈ ఏడాది మార్చిలో జరిగిన 96వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవంలో 'అపెన్‌హైమర్' సినిమాకుగానూ సీలియన్ మర్ఫీ ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే.

లక్ష్మి ఎవరయ్యా...


● విజయ్ సేతుపతి

''నా పేరు మహారాజ సార్.. కేకే నగర్‌లో సెలూన్ షాప్ పెట్టుకున్నాను. ఇంట్లో ఉన్న లక్ష్మిని దొంగిలించారు. ఎఫ్ఐఆర్ ఫైల్ చేద్దామని వచ్చా'' అనే డైలాగ్‌తో మొదలవుతుంది 'మహారాజ' సినిమా ట్రైలర్. విజయ్ సేతుపతి హీరోగా నటించిన 50వ చిత్రం ఇది. నితిలన్ సామినాథన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని ఈ నెల 14న ఏపీ, తెలంగాణలో ఎన్‌వీఆర్ సినిమా విడుదల చేయనుంది. ''నీ కూతురు, భార్య, అక్కా చెల్లెలు కాదంటున్నావ్.. మరి.. లక్ష్మి అంటే ఎవరయ్యా' అనే డైలాగ్స్ విడుదలైన తెలుగు ట్రైలర్‌లో ఉన్నాయి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	2,303	74,382
నిఫ్టీ ▲	736	22,620

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	17,122	▲ 265
డోజోన్స్	38,732	▲ 21
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,247	▲ 15
డాక్స్	18,576	▲ 170
షాంఘై	3,065	▽ 26
నికాయ్	38,490	▽ 347

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,986 ▲	17
బంగారం (99.5 స్వచ్ఛత)	71,698 ▲	17
వెండి (కిలో)	88,530 ▽	307

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.05	84.07
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.47	108.03
€	యూరో	ఎస్‌బీఐ	89.72	92.09
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.19	54.37
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.68	56.62
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.75	63.97
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.34	22.89
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.82	23.59
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.37	12.37



మార్కెట్ యూటర్న్..

కేంద్రంలో బీజేపీ నేతృత్వంలో మూడోసారి ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని ఖరారు కావడంతో నేలక్కొట్టిన బంతిలా దేశీ స్టాక్ మార్కెట్లు బౌన్స్‌బ్యాక్‌ను సాధించాయి. ఇన్వెస్టర్లు మూకుమ్మడిగా కొనుగోళ్లకు ఎగబడటంతో సెన్సెక్స్ ఇంట్రా డేలో 2,456 పాయింట్ల 'పోల్'వాల్ట్ చేసింది. నిఫ్టీ సైతం 786 పాయింట్లు జంప్‌చేసింది. దీంతో సెన్సెక్స్ తిరిగి 74,530 పాయింట్లను అధిగమించగా.. నిఫ్టీ 22,670ను దాటేసింది. వెరసి ఇన్వెస్టర్ల సంపదగా పిలిచే లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ. 13 లక్షల కోట్లకుపైగా బలపడింది!

- సెన్సెక్స్ 2,303 పాయింట్ల ర్యాలీ
- మళ్లీ 74,000 మైలురాయిపైకి..
- అన్ని రంగాలు లాభాల దూకుడు

ముంబై: సార్వత్రిక ఎన్నికల ఫలితాల రోజున గత నాలుగేళ్లలోనే అత్యధిక స్థాయి పతనాన్ని చవిచూసిన స్టాక్ మార్కెట్లు మళ్లీ పుంజుకున్నాయి. బీజేపీ కూటమి మరోసారి అధికారాన్ని చేపట్టే వీలుండటంతో సెంటిమెంటు బలపడింది. ఒక్కసారిగా ఇన్వెస్టర్లు పెట్టుబడులకు ఉపక్రమించడంతో ఇండెక్సులు లాభాల పరుగు అందుకున్నాయి. సెన్సెక్స్ 2,303 పాయింట్లు జంప్‌చేసి 74,382 వద్ద నిలిచింది. నిఫ్టీ 736 పాయింట్లు పురోగమించి 22,620 వద్ద ముగిసింది. ఫలితంగా బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్‌కు రూ. 13.22 లక్షల కోట్లు జమయ్యింది. మొత్తం విలువ రూ. 408 లక్షల కోట్ల(4.89 ట్రిలియన్ డాలర్లు)కు చేరింది!

ఎఫ్‌పీఐ అమ్మకాలు

బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 4.4%, 3% చొప్పున ఎగశాయి. కాగా.. నగదు విభాగంలో విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) తాజాగా రూ. 5,656 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించగా.. దేశీ ఫండ్స్ రూ. 4,555 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి. మంగళవారం ఎఫ్‌పీఐలు రూ. 12,436 కోట్లు, దేశీ ఫండ్స్ రూ. 3,319 కోట్లు చొప్పున పెట్టుబడులను వెనక్కి తీసుకున్న విషయం విదితమే. దీంతో బీఎస్‌ఈ మార్కెట్ విలువలో రూ. 31 లక్షల కోట్లకుపైగా తగ్గింది.

బ్లూ చిప్స్ దన్ను...

ఎన్‌ఎస్‌ఈలో అన్ని రంగాలూ 6-2 శాతం మధ్య ఎగశాయంటే కొనుగోళ్ల జోరును అర్థం చేసుకోవచ్చు! ప్రధానంగా మెటల్, ఆటో, బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ, ఫార్మా, కన్జూమర్ డ్యురబుల్స్ 4 శాతం పైగా బలపడ్డాయి. సెన్సెక్స్, నిఫ్టీ దిగ్గజాలలో దాదాపు అన్ని షేర్లూ లాభపడ్డాయి.

అదానీ షేర్లు అప్

మార్కెట్ల బౌన్స్‌బ్యాక్‌తో ఒక్క అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ మినహా (–2.6%) అదానీ గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీలలో అత్యధికం మళ్లీ లాభపడ్డాయి. దీంతో అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల విలువ రూ. 15.57 లక్షల కోట్లను అధిగమించింది.

ఎన్‌ఎస్‌ఈ ప్రపంచ రికార్డ్



ఒకే రోజు 1,971 కోట్ల లావాదేవీలు

న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్‌ఎస్‌ఈ బుధవారం ప్రపంచ రికార్డును సాధించింది. ఒకే రోజు 1,971 కోట్ల లావాదేవీలకు వీలు కల్పించడం ద్వారా తాజా ఫీట్‌ను సాధించినట్లు ఎక్స్ఛేంజీ ఎండీ, సీఈవో ఆశిష్ కుమార్ చౌహాన్ వెల్లడించారు. జూన్ 5న నిర్వహించిన 6.15 గంటల ట్రేడింగ్‌లో ఎన్‌ఎస్‌ఈ 19.71 బిలియన్ ట్రాన్సాక్షన్లకు వేదికైనట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌ఈలో ట్రేడింగ్ ఉదయం 9.15కు ప్రారంభమై 3.30కు ముగుస్తుంది.

బీహెచ్‌ఈఎల్‌కు రూ.3,500 కోట్ల ఆర్డర్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీహెచ్‌ఈఎల్ తాజాగా అదానీ పవర్ నుంచి రూ.3,500 కోట్లకుపైగా విలువ చేసే భారీ ఆర్డర్‌ను దక్కించుకుంది. ఇందులో భాగంగా చత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ వద్ద అదానీ పవర్ కోసం సూపర్ క్రిటికల్ సాంకేతికతతో బొగ్గు ఆధారిత విద్యుత్ ప్రాజెక్ట్‌ను బీహెచ్‌ఈఎల్ నిర్మించనుంది. బాయిలర్, టర్బైన్ జనరేటర్ సరఫరాతోపాటు 800 మెగావాట్ల సామర్థ్యంగల రెండు యూనిట్ల ఏర్పాటు, పర్యవేక్షణకు ఒప్పందం కుదిరినట్లు బీహెచ్‌ఈఎల్ తెలిపింది.

మేలో 'సేవలు' పేలవం



న్యూఢిల్లీ: భారత్ సేవల రంగం మేనెల్లో ఐదు నెలల కనిష్ట స్థాయికి పడిపోయింది. ఏప్రిల్ నెల్లో 60.8 వద్ద ఉన్న హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ మే లో 60.2కు తగ్గింది. కాగా, కొత్త ఎగుమతుల ఆర్డర్లు 10 సంవత్సరాల గరిష్టానికి చేరడం హర్షణీయ పరిణామం.

సంకీర్ణ ప్రభుత్వం..

తగ్గనున్న సంస్కరణల వేగం..

- మిత్రపక్షాలపై బీజేపీ ఆధారపడాల్సి రావడమే కారణం
- అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీల అంచనాలు



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడం, కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మిత్రపక్షాలపై ఆధారపడాల్సి వస్తుండటం వంటి పరిణామాలు భారత్‌పై అంతర్జాతీయ ఇన్వెస్టర్లలో సందేహాలు రేకెత్తిస్తున్నాయి. సంకీర్ణ ప్రభుత్వం కారణంగా సంస్కరణల వేగం తగ్గే అవకాశం ఉందని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీలు అంచనా వేస్తున్నాయి. దీనివల్ల భూ, కార్మిక సంస్కరణలకు క్షోభం పడవచ్చని, ఆర్థిక క్రమశిక్షణ పురోగతికి విఘాతం కలగవచ్చని ఆందోళన వ్యక్తపర్చాయి. 2014 తర్వాత తొలిసారిగా ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని బీజేపీ మెజారిటీని కోల్పోవడానికి సంబంధించిన ప్రభావాలపై ఫిచ్ రేటింగ్స్, మూడీస్ రేటింగ్స్ వేర్వేరుగా నివేదికలు ఇచ్చాయి.




ఆర్థిక క్రమశిక్షణకు బ్రేక్..

పటిష్టమైన ఆర్థిక వృద్ధి సాధించే దిశగా మౌలిక సదుపాయాలపై వ్యయాలు పెంచడం, దేశీయంగా తయారీ రంగానికి తోడ్పాటునివ్వడం వంటి పాలసీపరమైన విధానాలు ఇకపైనా కొనసాగవచ్చని మూడీస్ అభిప్రాయపడింది. అయితే, బీజేపీకి మెజారిటీ తగ్గడం వల్ల కీలకమైన ఆర్థిక, ద్రవ్యపరమైన సంస్కరణల అమల్లో జాప్యం జరగొచ్చని, ఆర్థిక క్రమశిక్షణ పురోగతికి విఘాతం కలగవచ్చని పేర్కొంది. 2025–26లో జీ20 కూటమిలోని మిగతా దేశాలతో పోలిస్తే భారత్ అత్యధిక వృద్ధి సాధించగలదని భావిస్తున్నప్పటికీ దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలకు రిస్కులు ఉన్నాయని తెలిపింది. 'వివిధ రంగాల్లో నిరుద్యోగ యువత సంఖ్య భారీ స్థాయిలో ఉండటం, వ్యవసాయ రంగంలో ఉత్పాదకత వృద్ధి బలహీనంగా ఉండటం వంటి అంశాలు ప్రతికూల ప్రభావాలు చూపడాన్ని కొనసాగించవచ్చు'అని మూడీస్ వివరించింది. ఇక ద్రవ్యలోటు విషయానికొస్తే 2024–25లో నిర్దేశించుకున్న విధంగా దీన్ని 5 శాతానికి తగ్గించుకోగలిగితే, 2025–26లో 4.5% స్థాయిని సాధించవచ్చని పేర్కొంది. కాగా, ద్రవ్య, రుణపరమైన కొలమానాల విషయంలో ఇండొనేషియా, ఫిలిప్పీన్స్, థాయ్‌ల్యాండ్‌తో పోలిస్తే భారత్ బలహీనంగానే ఉన్నట్లు పేర్కొంది.

ల్యాండ్, లేబర్ సంస్కరణల అమలు కష్టమే

'బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ తదుపరి ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ప్రధానిగా మోదీ మూడోసారి పగ్గాలు చేపట్టినప్పటికీ మెజారిటీ తగ్గిపోవడమనేది, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్దేశించుకున్న సంస్కరణల అజెండాకు సవాలుగా పరిణమించవచ్చు' అని ఫిచ్ పేర్కొంది. పూర్తి మెజారిటీ రాకపోవడంతో మిత్రపక్షాలపై ఎక్కువగా ఆధారపడాల్సి రావడం వల్ల 'వివాదాస్పద సంస్కరణలను, ముఖ్యంగా ల్యాండ్, లేబర్ సంస్కరణలను అమలు చేయడం కష్టంగా మారొచ్చు. దేశీ తయారీ రంగ పోటీతత్వాన్ని పెంచేందుకు ఇవే తమకు అత్యంత ప్రాధాన్య అంశాలంటూ బీజేపీ ఇటీవలే పేర్కొంది' అని ఫిచ్ తెలిపింది. మరోవైపు, ప్రభుత్వం తమ జీవనోపాధిని మెరుగుపర్చాలని సూచించేలా ప్రజలు తీర్పునిచ్చిన నేపథ్యంలో మోదీ ప్రభుత్వం హిందుత్వ జాతీయవాదాన్ని పక్కన పెట్టి ప్రజాభీష్టానికి అనుగుణంగా నడుచుకోవాల్సి ఉంటుందని ఫిచ్ గ్రూప్‌లో భాగమైన బీఎంఐ పేర్కొంది. అయితే, మధ్యకాలికంగా చూస్తే భారత్‌పై సానుకూల అంచనాలు పటిష్టంగానే ఉన్నాయని, ఈ దశాబ్దం ఆఖరు నాటికి భారత్ ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఎకానమీగా ఆవిర్భవించగలదని బీఎంఐ ఏషియా హెడ్ (కంట్రీ రిస్క్) డారెన్ టే తెలిపారు. బీజేపీ ఎక్కడెక్కడైతే హిందుత్వ జాతీయవాదంపై గట్టిగా ప్రచారం చేసిందో ఆయా రాష్ట్రాలన్నీ దానికి ప్రతికూల ఫలితాలు ఇచ్చాయని, ఉత్తర్ ప్రదేశ్‌లాంటి రాష్ట్రాలు ఇందుకు నిదర్శనమని చెప్పారు.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-6-2024	
విశాఖ	450-00
చిత్తూరు	533-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	445-00
విజయవాడ	450-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	430-00
వరంగల్	432-00
రిటైల్ ధర	4.90

పెరూలో యూపీఐ చెల్లింపులు



న్యూఢిల్లీ: ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ తాజాగా సెంట్రల్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ పెరూ భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) వంటి రియల్ టైమ్ చెల్లింపుల వ్యవస్థను పెరూలో అందుబాటులోకి తేనున్నాయి. ఈ సాంకేతికత అందుబాటులోకి వస్తే దక్షిణ అమెరికాలో దీన్ని ప్రవేశపెట్టిన తొలి దేశంగా పెరూ స్థానం సంపాదించనుంది. రియల్ టైమ్ పేమెంట్ సిస్టమ్‌ను ఆ దేశంలో స్థాపించడంతోపాటు వ్యక్తులు, వ్యాపార సంస్థల మధ్య తక్షణ చెల్లింపులను అందించేందుకు సెంట్రల్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ పెరూకు ఈ భాగస్వామ్యం దోహదం చేస్తుంది.

హైదరాబాద్, తిరుపతి షోరూమ్‌లలో

భీమా జ్యువెల్స్ ఫెస్టివల్



హైదరాబాద్: భీమా జ్యువెల్స్ హైదరాబాద్, తిరుపతిల్లోని తన షోరూమ్‌లలో స్టడ్స్ అండ్ డ్రాప్స్ జ్యువెలరీ ఫెస్టివల్‌ను ప్రారంభించింది. ఈ నెల 16వ తేదీ వరకూ ఈ జ్యువెలరీ ఉత్సవాలు కొనసాగుతాయని ఒక ప్రకటన పేర్కొంది. ఈ సందర్భంగా తమ కస్టమర్లకు 5000కుపైగా అద్భుతమైన డిజైన్‌లు, ఆకర్షణీయమైన ఆఫర్లు అందుబాటులో ఉంటాయని చైర్మన్ బీ బిందు మాధవ్ ప్రకటనలో పేర్కొన్నారు.

రియల్‌మీ నుంచి నార్జో ఎన్63



న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ రియల్‌మీ తాజాగా నార్జో ఎన్63 ఫోన్‌ను ఆవిష్కరించింది. దీని ఫస్ట్ సేల్ జూన్ 10 నుంచి 14 వరకు రియల్‌మిడాట్‌కామ్, అమెజాన్ వెబ్‌సైట్లలో ఉంటుంది. ఇందులో రెండు స్టోరేజ్ వేరియంట్స్ ఉంటాయి. 4జీబీ ప్లస్ 64 జీబీ ధర రూ. 8,499గా, 4జీబీ ప్లస్ 128 జీబీ ఫోన్ ధర రూ. 8,999గా ఉంటుంది. సేల్ సందర్భంగా రెండు వేరియంట్స్‌పై కొనుగోలుదారులు రూ. 500 విలువ చేసే కూపన్లను పొందవచ్చు. ఈ ఫోన్లలో 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, 50 ఎంపీ ఏఐ కెమెరా, 45లు సూపర్‌వూక్ చార్జ్, ఎయిర్ జెస్చర్స్, మినీ క్యాప్సూల్, 2.0 తదితర ఫీచర్స్ ఉంటాయి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏఎన్‌యూ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్-2024

గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి సెల్ఫ్ సపోర్ట్ విధానంలో బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్, బీ డిజైన్, బీప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» **బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్:** 510 సీట్లు.
» **విభాగాలు:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, సైబర్ సైక్యూరిటీ.
» **బీడిజైన్ అండ్ బీప్లానింగ్ ప్రోగ్రామ్:** 80 సీట్లు.
» **అర్హత:** కనీసం 45 శాతం మార్కులతో మ్యాథమేటిక్స్,ఫిజిక్స్,కెమిస్ట్రీతో 10+2ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్,కౌన్సిలింగ్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **పరీక్ష విధానం:** మొత్తం 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు.
» **పరీక్ష కేంద్రాలు:** విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, కడప, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 12.06.2024
» **ప్రవేశ పరీక్ష తేది:** 15.06.2024.
» **వెబ్‌సైట్:** http://www.anucet.in

ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్శిటీలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

గుంటూరు లాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్శిటీ.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్,అనుబంధ పాలిటెక్నిక్ కాలేజీలలో నాలుగు డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం సీట్ల సంఖ్య:** ప్రభుత్వ-688, అనుబంధ -2530.

కోర్సులు, సీట్ల వివరాలు

» **డిప్లొమా ఇన్ అగ్రికల్చర్(రెండేళ్లు):** సీట్లు: ప్రభుత్వ కళాశాలలు-578, అనుబంధ కళాశాలలు-1900.
» **డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ(రెండేళ్లు):** సీట్లు: ప్రభుత్వ కళాశాలలు-25, అనుబంధ కళాశాలలు-260.
» **డి ప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్(రెండేళ్లు):** సీట్లు: ప్రభుత్వ కళాశాలలు-25, అనుబంధ కళాశాలలు-40.
» **డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్(మూడేళ్లు):** సీట్లు: ప్రభుత్వ కళాశాలలు-60, అనుబంధ కళాశాలలు-330.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 31.08.2024 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** పదో తరగతిలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 01.06.2024.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 20.06.2024.
» **వెబ్‌సైట్:** https://angrau.ac.in

ఐఐఎస్‌టీ తిరువనంతపురంలో యూజీ కోర్సుల్లో ప్రవేశాలు

తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ).. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం సీట్ల సంఖ్య:** 140

కోర్సుల వివరాలు

» **బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ(బీటెక్):** 120 సీట్లు. **విభాగాలు:** ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఏవియానిక్స్)
» **డ్యూయల్ డిగ్రీ(బీటెక్+మాస్టర్ ఆఫ్ సైన్స్/మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ):** 20 సీట్లు. **విభాగాలు:** ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్, సాలిడ్ స్టేట్ ఫిజిక్స్, ఎర్త్ సిస్టమ్ సైన్స్, ఆప్టికల్ ఇంజనీరింగ్.
» **అర్హత:** కనీసం 75 శాతం మార్కులతో 12వ తరగతి ఉత్తీర్ణతతో పాటు జేఈఈ (అడ్వాన్స్‌డ్) 2024 స్కోరు సాధించి ఉండాలి.
» **వయసు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులు 01.10.1999న లేదా ఆ తర్వాత జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు 01.10.1994న లేదా ఆ తర్వాత జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** జేఈఈ(అడ్వాన్స్‌డ్) 2024 స్కోర్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 03.06.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.06.2024.
» **ఐఐఎస్‌టీ అడ్మిషన్ ర్యాంక్ జాబితా వెల్లడి:** 15.06.2024.
» **బ్రాంచ్ ప్రాధాన్యాల సవరణల నమోదుకు చివరి తేది:** 16.06.2024.
» **సీట్ల కేటాయింపు:** 17.06.2024 నుంచి 08.07.2024 వరకు
» **ఐఐఎస్‌టీలో ప్రవేశాల ప్రారంభం:** 22.07.2024
» **వెబ్‌సైట్:** https://www.iist.ac.in

అడ్వాన్స్‌డ్ కటాఫ్ 80!

ఐఐటీల్లో బీటెక్‌లో ప్రవేశాలకు మే 26న జేఈఈ అడ్వాన్స్‌డ్-2024 పరీక్ష నిర్వహించారు. దేశవ్యాప్తంగా దాదాపు 2 లక్షల మంది హాజరైనట్లు అంచనా! తెలుగు రాష్ట్రాల నుంచి 45 వేల మందికిపైగా ఈ పరీక్ష రాసినట్లు సమాచారం!! మరోవైపు ఐఐటీలు, నిట్‌లు తదితర 121 ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశాల కౌన్సెలింగ్ కోసం జోసా (జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ) వెబ్‌సైట్ తాజాగా అందుబాటులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో.. జేఈఈ అడ్వాన్స్‌డ్ విశ్లేషణతోపాటు కటాఫ్ అంచనా, కౌన్సెలింగ్ విధానం, టాపర్లు ఆసక్తి చూపుతున్న బ్రాంచ్‌లు, ఇన్‌స్టిట్యూట్స్ తదితర వివరాలు..

» పరీక్ష కఠినంగానే ఉందంటున్న విద్యార్థులు
» కటాఫ్ 80 మార్కులుగా ఉంటుందని అంచనా
» జూన్ 9న వెలువడనున్న ఫలితాలు
» 10 నుంచి జోసా కౌన్సెలింగ్‌కు అవకాశం!



జేఈఈ అడ్వాన్స్‌డ్-2024 పరీక్షను రెండు పేపర్లుగా నిర్వహించారు. ఒక్కో పేపర్‌లో 51 ప్రశ్నలు అడిగారు. ప్రతి పేపర్‌లోనూ మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి 17 ప్రశ్నలు చొప్పున వచ్చాయి. ఒక్కో పేపర్‌కు 180 మార్కులు చొప్పున రెండు పేపర్లను కలిపి 360 మార్కులకు పరీక్ష జరిగింది.

పేపర్-1 మోస్తరు క్లిష్టత

జేఈఈ అడ్వాన్స్‌డ్ పేపర్-1 ఓ మోస్తరు క్లిష్టంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. ముఖ్యంగా మ్యాథమెటిక్స్ ప్రశ్నలు కొంత కఠినంగా ఉన్నాయని విద్యార్థులు అంటున్నారు. ఫిజిక్స్ విభాగం కూడా క్లిష్టంగానే ఉందని పేర్కొంటున్నారు. జేఈఈ-మెయిన్స్ సిలబస్‌లో లేని అంశాలు అడ్వాన్స్‌డ్‌లో ఉండడం వల్లనే విద్యార్థులు ప్రశ్నలు కఠినంగా ఉన్నట్లు భావిస్తున్నారని సబ్జెక్ట్ నిపుణులు పేర్కొంటున్నారు.

పేపర్-2.. క్లిష్టంగా

పేపర్-1 కంటే పేపర్-2 బాగా కఠినంగా ఉందని విద్యార్థులు చెబుతున్నారు. మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ విభాగాల ప్రశ్నలు క్లిష్టంగా ఉన్నాయని అంటున్నారు. ఆర్గానిక్, ఇనార్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీలకు సమాన వెయిటేజీ కల్పించే ప్రశ్నలు అడిగారని చెబుతున్నారు. ఫిజిక్స్‌లోనూ ఓ మోస్తరు క్లిష్టతతో ప్రశ్నలు ఎదురయ్యాయని సబ్జెక్ట్ నిపుణులు పేర్కొన్నారు. ఈ విభాగంలో ప్రశ్నలు కొంత సుదీర్ఘంగా, క్యాలిక్యులేషన్స్‌కు ఎక్కువ సమయం పట్టే విధంగా ఉండడంతో సమయాభావ సమస్య ఎదురైందని చెబుతున్నారు.

మ్యాథమెటిక్స్

రెండు పేపర్లలోనూ మ్యాథమెటిక్స్ విభాగం ప్రశ్నలు కఠినంగా ఉన్నాయి. వీటికి అంచెలవారీగా సమాధానాలు రాబట్టే క్రమంలో సమయాభావానికి గురైనట్లు విద్యార్థులు పేర్కొంటున్నారు. ట్రిగ్నోమెట్రిక్ ఈక్వేషన్స్, హార్మోనిక్ ప్రోగ్రెషన్స్, వెక్టార్స్, ప్రాబబిలిటీ, ఎలిప్స్, మ్యాట్రిసెస్, ఫంక్షన్స్ నుంచి అడిగిన ప్రశ్నలు కొంత సులభంగా ఉన్నాయి. 3-డి జామెట్రీ, కానిక్ సెక్షన్స్ విభాగం ప్రశ్నలు చాలా క్లిష్టంగా ఉన్నట్లు చెబుతున్నారు. పేపర్-2లో కో-ఆర్డినేట్ జామెట్రీ, కాలిక్యులస్‌ల నుంచి ఎక్కువ ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది.

ఫిజిక్స్.. కఠినంగానే

ఫిజిక్స్‌లో ప్రశ్నలు ఓ మోస్తరు క్లిష్టతతో కాన్సెప్ట్ ఆధారితంగా అడిగారు. ఎలక్ట్రిసిటీ, రొటేషనల్ మోషన్, కైనమాటిక్స్, వర్క్ పవర్ అండ్ ఎనర్జీ, థర్మోడైనమిక్స్, సర్ఫేస్ టెన్షన్‌ల నుంచి అడిగిన ప్రశ్నలు రెండు, మూడు కాన్సెప్ట్‌ల సమ్మిళితంగా సుదీర్ఘంగా ఉన్నాయి. వీటిని అర్థం చేసుకోవడానికి విద్యార్థులకు ఎక్కువ సమయం పట్టిందని నిపుణులు పేర్కొంటున్నారు.

కెమిస్ట్రీ.. కొంత ఊరట

మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ విభాగాల్లో కఠినమైన ప్రశ్నలతో ఇబ్బంది పడిన విద్యార్థులకు కెమిస్ట్రీ విభాగం కొంత ఊరటనిచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇందులో ప్రశ్నలు కొంత సులభంగా ఉన్నట్లుగా చెబుతున్నారు. ఫిజికల్ కెమిస్ట్రీ నుంచి మోల్ కాన్సెప్ట్, ఎలక్ట్రో కెమిస్ట్రీ, సర్ఫేస్ కెమిస్ట్రీ, థర్మో డైనమిక్స్, కెమికల్ కైనటిక్స్ విభాగాల నుంచి ప్రశ్నలు అడిగారు. ఆర్గానిక్ కెమిస్ట్రీలో.. కాన్సెప్ట్ బేస్డ్ ప్రశ్నలు, ఇనార్గానిక్ కెమిస్ట్రీలో రియాక్షన్ బేస్డ్ ప్రశ్నలు ఎదురయ్యాయి.

కటాఫ్ 80!

రెండు పేపర్లుగా మొత్తం 360 మార్కులకు నిర్వహించిన అడ్వాన్స్‌డ్‌లో కటాఫ్ 80గా ఉంటుందని అంచనా. ఇది 60 మార్కులకు పరిమితమైనా ఆశ్చర్యపోనక్కర్లేదని చెబుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే పరీక్ష క్లిష్టంగా ఉన్నప్పటికీ.. అభ్యర్థుల సంఖ్య పెరగడం కటాఫ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందంటున్నారు.

మొత్తం 17,385 సీట్లు

అడ్వాన్స్‌డ్ స్కోర్ ఆధారంగా 23 ఐఐటీల్లో ప్రవేశాలు లభిస్తాయి. వీటిల్లో 17,385 సీట్లు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు ఎంతో క్రేజీగా భావించే కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌తోపాటు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ వంటి బ్రాంచ్‌లు ఉన్నాయి. వీటితో పాటు బయో సైన్సెస్ అండ్ బయో ఇంజనీరింగ్, బయోటెక్ అండ్ బయో కెమ్ ఇంజనీరింగ్, బయో ఇంజనీరింగ్ వంటి వైద్య అనుబంధ బ్రాంచ్‌లు ఉండడం విశేషం. అంతేకాకుండా ఇటీవల మార్కెట్ ట్రెండ్‌కు అనుగుణంగా డేటాసైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఏఐ-ఎంఎల్ వంటి బ్రాంచ్‌లను ప్రవేశపెట్టారు. వీటితోపాటు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో.. డేటాసైన్స్ మేజర్‌గా కొత్త ప్రోగ్రామ్ అందుబాటులోకి వచ్చింది. అదే విధంగా.. అయిదేళ్ల డ్యూయల్ డిగ్రీ (బీటెక్+ఎంటెక్) కోర్సులను కూడా ప్రవేశపెట్టారు.

సీఎస్‌ఈకే తొలి ప్రాధాన్యం

అడ్వాన్స్‌డ్ టాప్ ర్యాంకర్ల తొలి ప్రాధాన్యంగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్‌ఈ) బ్రాంచ్ నిలుస్తోంది. గతేడాది ఐఐటీ-ముంబైలో సీఎస్‌ఈ క్లోజింగ్ ర్యాంకు 67గా నమోదవగా.. ఐఐటీ-ఢిల్లీలో 118గా, ఐఐటీ-చెన్నైలో 148గా, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో 279, ఐఐటీ-రూర్కీలో 412, ఐఐటీ-హైదరాబాద్‌లో 674గా నమోదయ్యాయి. మిగతా ఐఐటీల్లో ఓపెన్ కేటగిరీలో 2000లోపు ర్యాంకుతోనే సీఎస్‌ఈ సీట్లు భర్తీ అవడం ఈ బ్రాంచ్‌కున్న క్రేజ్‌కు నిదర్శనంగా చెప్పొచ్చు.

సీఎస్‌ఈ కాకుంటే

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణుల్లో ఎక్కువ మంది సీఎస్‌ఈ రాకపోతేనే ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్‌ల వైపు చూస్తున్నారు. గత ఏడాది ఆరు రౌండ్లలో నిర్వహించిన ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో.. విద్యార్థుల ఆప్షన్లను పరిశీలిస్తే ఈ నాలుగు బ్రాంచ్‌లే ముందంజలో నిలిచాయని స్పష్టమవుతోంది. వీటిలో ఓపెన్ కేటగిరీలో చివరి రౌండ్‌లో తొమ్మిది వేలలోపు ర్యాంకు క్లోజింగ్ ర్యాంకుగా నమోదైంది.

ఏఐ-ఎంఎల్ కోర్సులకూ క్రేజ్

జాబ్ మార్కెట్ అవసరాలు, మారుతున్న టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని పలు ఐఐటీలు.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ వంటి అనుబంధ ప్రోగ్రామ్‌లను కూడా ప్రారంభించాయి. వీటి వైపు కూడా ర్యాంకర్లు మొగ్గు చూపుతున్నారు. వీటిలోనూ క్లోజింగ్ ర్యాంకు గరిష్టంగా రెండు వేల లోపుగా నమోదవడం గమనార్హం.

జోసాతో సీట్ల కేటాయింపు

జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ ఆధ్వర్యంలో 23 ఐఐటీలతోపాటు 31 నిట్‌లు, 26 ట్రిపుల్ ఐటీలు, ఐఐఈఎస్‌టీ షిబ్‌పూర్, 3 ఎస్‌పీఏలు, 37 ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఇందుకోసం ఇప్పటికే జోసా(జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ) వెబ్‌సైన్‌ను ఐఐటీ మద్రాస్ అందుబాటులోకి తెచ్చింది. జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్ ఉత్తీర్ణులు జోసా కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొని సీటు పొందొచ్చు. ఇందుకోసం అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఛాయిస్ ఫిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ ఛాయిస్ ఫిల్లింగ్ ప్రక్రియలో ఇన్‌స్టిట్యూట్స్, ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల ప్రాథమ్యాలను వరుస క్రమంలో పేర్కొనాలి. తదుపరి దశలో అభ్యర్థులు పేర్కొన్న ప్రాథమ్యాలు, ఆయా ఇన్‌స్టిట్యూట్స్, బ్రాంచ్‌లలో అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా ఆన్‌లైన్‌లోనే సీట్ అలాట్‌మెంట్ జరుగుతుంది. అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణులు ఐఐటీలతో సహా నిట్‌లు, ఇతర కేంద్ర ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్‌లను ప్రాథమ్యాలుగా ఎంచుకునే అవకాశం లభిస్తుంది.

ఆరు రౌండ్లలో కౌన్సెలింగ్

జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ నిర్వహించే ఆన్‌లైన్ కౌన్సెలింగ్ మొత్తం ఆరు రౌండ్లలో జరుగనుంది. ఇప్పటి వరకు ఉన్న సమాచారం ప్రకారం-జోసా-2024 కౌన్సెలింగ్ ప్రక్రియ జూన్ 10 నుంచి ప్రారంభం కానుంది. అభ్యర్థులు అయిదో రౌండ్ వరకు కౌన్సెలింగ్‌లో పాల్గొని స్లైడింగ్ ప్రక్రియకు హాజరవ్వచ్చు.

రేపటి నుంచి ఇండియా ఆర్ట్ ఫెస్టివల్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట (హైదరాబాద్): ప్రతి సంవత్సరం ముంబై, బెంగళూరులలో నిర్వహించే ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ మొట్టమొదటిసారిగా ఈ సంవత్సరం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ డైరెక్టర్, ముంబై ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు రాజేంద్ర తెలిపారు. ఈ ఫెస్టివల్ జూన్ 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజులపాటు కింగ్స్ కోహినూర్ కన్వెన్షన్, పిల్లర్ నెంబర్ 68, పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ హైవే, రేతిబౌలిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎమ్వీ రమణారెడ్డి, దివ్య లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఫెస్టివల్‌లో దేశవ్యాప్తంగా 250 మంది కళాకారులు పాల్గొంటారని, 30 ఆర్ట్ గ్యాలరీలు, 3,500 కళాఖండాలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఫెస్టివల్‌లో దేశవ్యాప్తంగా ప్రముఖ కళాకారులు పాల్గొంటారన్నారు.

ఈనెల 7, 8 తేదీల్లో ప్రపంచ వరి సదస్సు

తెలంగాణకు కలిసొచ్చే విషయాలపై చర్చిస్తాం: తుమ్మల



సాక్షి, హైదరాబాద్: ప్రపంచంలోని పలు దేశాలే కాకుండా లాటిన్ అమెరికాలోని కొన్ని దేశాలు కూడా వరి దిగుమతులకోసం భారతదేశం వైపు చూస్తున్నాయని, ఈ అవకాశాలను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటే తెలంగాణ రైతాంగానికి మంచి ధర వస్తుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దిశగా పయనిస్తుందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ కమాడిటీస్ సంస్థ, యూఎస్‌ఏ, తెలంగాణ సహకారంతో ఈనెల 7,8 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే ప్రపంచ వరి సదస్సులో తెలంగాణకు కలిసొచ్చే అన్ని విషయాలను చర్చిస్తామన్నారు. ఈ సదస్సులో అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ, వ్యవసాయ పరిశోధన సంస్థల కన్సార్టియం, భారతదేశ పరిశోధన సంస్థతో పాటు దేశ విదేశాల ప్రతినిధులు, రాష్ట్ర అధికారులు, శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతులు సదస్సులో పాల్గొంటారని ఆయన తెలిపారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.